

ఆంధ్రభూమి



సంపుటి: 29 . సంచిక: 242 | విజయవాడ సిటీ | హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, అనంతపురం, కరీంనగర్, నెల్లూరు | www.andhrabhoomi.net | గురువారం 1 ఫిబ్రవరి, 2018 | 20 పేజీలు | ధర: రూ.3.00

శుభోదయం

కలియుగం - 5119

శాలివాహన శకం - 1939

శ్రీ చాంద్రమాన హేమలంబ నామ సం।
ఉత్తరాయణం, శిశిరఋతువు,
మాఘమాసం, కృష్ణపక్షం
తిథి: బహుళ పాడ్యమి సా.5.32
నక్షత్రం: ఆశ్రేష సా.5.02
శేషవర్జ్యం: ఉ.7.59 వరకు,
తిరిగి రా.తె.4.26 నుండి 5.57 వరకు
దుర్ముహూర్తం:
ఉ.10.00 నుండి 10.48 వరకు,
తిరిగి మ.02.48 నుండి 03.36 వరకు
రాహుకాలం:
మ.1.30 నుండి 3.00 వరకు



భద్రాచల శ్రీసీతారామచంద్రస్వామి

60 ఏళ్ల తర్వాత అరుదైన వైభవం

విళంబిలో జన్మించిన రామయ్య

కొత్త ఉగాదితో మళ్లీ రాక

భద్రాద్రిలో బ్రహ్మోత్సవాలు

మార్చి 26న శ్రీరామనవమి

భద్రాచలం టౌన్, జనవరి 31: శ్రీ రామచంద్రుడు విళంబి నామ సంవత్సరం చైత్ర శుద్ధ నవమి నాడు పునర్వసు నక్షత్ర యుక్త కర్కాటక లగ్నంలో జన్మించాడు. చైత్రశుద్ధ నవమినే శ్రీ రామనవమిగా భావిస్తూ స్వామి పుట్టిన రోజునే భద్రాద్రిలో కల్యాణం జరిపించడం ఆనాదిగా ఆనవాయితీగా వస్తోంది. యస్యావతార సమయ:తత్స కల్యాణ మాచరేత్ (ఏ దేవుని అవతార సమయమో ఆ రోజున ఆ దేవుని కల్యాణాన్ని ఆచరించాలి) అన్న పాంచరాత్రాగమ సంప్రదాయం ప్రకారం శ్రీ రామనవమి నాడే శ్రీ సీతారాముల కల్యాణం జగత్ కల్యాణం కోసమే జరిగిందని పెద్దలు చెబుతారు. స్వామివారి కల్యాణం ఏటా మధ్యాహ్నం 12 గంటలు దాటిన తర్వాత అభిజిత్ లగ్నంలోనే చేయడం ఆనవాయితీ. 'సూర్యాచ్ఛతర్థం యల్లగ్న మభిజిత్సంజ్ఞకంచ తమ్. సర్వేదేశిష్విదం ముఖం. సర్వ వర్గేషు చదుర్లభమ్' అంటారు. సూర్యుడు ఉన్న రాశి నుంచి నాల్గవ లగ్నం ఏ లగ్నమవుతుందో ఆ లగ్నాన్ని అభిజిత్ లగ్నమని పిలుస్తారు. సర్వ దేశములు, సర్వవర్గములు, ఎల్లప్పుడు శుభకార్యాలను ఈ లగ్నంలోనే అచరించవచ్చు. ఇలా శ్రీరాముడికి జరిగే కల్యాణ వైభోగంలో అచారాలు, ఆనవాయితీలు ఉన్నాయి. అయితే ఈసారి భద్రాద్రిలో జరిగే శ్రీ రామనవమి సీతారాముల కల్యాణ మహోత్సవం కూడా ఒక సరికొత్త ప్రత్యేకత సంతరించుకోనుంది. పుట్టిన రోజే ఏటా భద్రాద్రిలో సీతమ్మను పరిణయమాడే శ్రీరాముడు ఈసారి తాను పుట్టిన ఏడాది కల్యాణ రాముడిగా కనిపించనున్నారు. అరుదుగా వచ్చే ఈ సందర్భంగా 60 ఏళ్ల తర్వాత ఈ ఏడాది శ్రీరామనవమికి ఆవిష్కృతం కానుంది. మార్చి 18నుంచి భద్రాద్రిలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానుండగా అదేరోజు ఉగాది నుంచి విళంబిలోకి తెలుగు వారంతా అడుగుపెట్టనున్నారు. శ్రీరామచంద్రుడు కూడా విళంబి - మిగతా 7వ పేజీలో

ఘనగామా



మనకున్న తెలివితేటలే ఉంటే..
గ్రహణంలో ఎందుకు చిక్కుకుంటాడు!!

ఖగోళంలో అద్భుతం



రోదశిలో ఇదొక అరుదైన అద్భుతం. పండు వెన్నెలను కురిపించే చంద్రుడు మూడు రూపాల్లో (సూపర్ మూన్, సూపర్ బ్లూమూన్, సూపర్ బ్లడ్ మూన్) కనువిందైన రీతిలో దర్శనమిచ్చాడు. భారత్‌తోపాటు ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో ఈ ఏడాది తొలి సంపూర్ణ చంద్ర గ్రహణం చిరస్మరణీయ అనుభూతినే కలిగించింది.

స్మార్ట్ బైక్ బాబు..




రాజధాని అమరావతి సచివాలయానికి స్మార్ట్ బైకులు వచ్చేశాయి. సీఎం చంద్రబాబు స్వయంగా నడిపి బుధవారం వీటిని ప్రారంభించారు. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతిలోనూ స్మార్ట్ బైకులు ప్రవేశపెట్టాలని బైసైకింగ్ ఫెడరేషన్‌కు సీఎం సూచించారు. సచివాలయంలోని తన బ్లాక్‌కు స్మార్ట్ సైకిల్‌పై వెళ్తున్న సీఎం చంద్రబాబు

ఆపన్నులా.. సంపన్నులా?

జైట్లీ ఊరడించేది ఎవరినో? • ఆశల పల్లకిలో పలురంగాలు • నేడు కేంద్ర వార్షిక బడ్జెట్

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 31: ప్రధాని నరేంద్ర మోదీ జమిలి ఎన్నికల గురించి ఆలోచిస్తున్న తరుణంలో ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ గురువారం లోక్‌సభలో అందరి మన్ననలు పొందే మంచి బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశాలు అధికంగా ఉన్నాయి. అరుణ్ జైట్లీ ఉదయం 11 గంటలకు లోక్‌సభలో 2018-19 వార్షిక ప్రణాళికను ప్రతిపాదిస్తారు. లోక్‌సభ ఉదయం సమావేశం కాగానే మొదట మహారాష్ట్ర బీజేపీ ఎంపీ అకాల మరణంపై సంతాపం తెలిపిన అనంతరం జైట్లీ బడ్జెట్‌ను ప్రతిపాదిస్తారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న ఆఖరు పూర్తి స్థాయి బడ్జెట్ ఎలా ఉంటుందనే అంశంపై రకరకాల చర్చలు జరుగుతున్నాయి. బడ్జెట్‌లో రైతులు, వ్యవసాయ రంగానికి పెద్దపీట వేయటంతోపాటు ఆదాయం పన్ను మినహాయింపును రెండు లక్షల నుండి రెండున్నర లక్షలకు పెంచే అవకాశాలున్నాయని ఆర్థిక శాఖ అధికారులు సూచనప్రాయంగా చెబుతున్నారు. దీనితోపాటు ఉద్యోగులకు స్టాండర్డ్ డిడక్షన్ విధానాన్ని మరోసారి ప్రవేశపెట్టే అవకాశాలు లేకపోలేదని ఫిక్కి అధికారులు చెబుతున్నారు. ఉద్యోగస్థులకు స్టాండర్డ్ డిడక్షన్ విధానం 2015-06 వార్షిక సంవత్సరం వరకు అమలులో ఉండింది. అయితే ఆ మరుసటి సంవత్సరం నుండి ఉద్యోగులకు ఈ సదుపాయాన్ని తొలగించారు. అయితే వ్యాపారస్థులకు మాత్రం ఈ విధానం ఇప్పటికీ కొనసాగుతోంది. వ్యాపారస్థులకు ఇప్పుడిస్తున్న విధంగానే ఉద్యోగులకు కూడా స్టాండర్డ్ డిడక్షన్ విధానాన్ని అమలుచేయాలని ఫిక్కితోపాటు ఇతర సంస్థలు అరుణ్ జైట్లీని కోరాయి. దీనివలన ఉద్యోగులకు కొంతైనా ఉపశమనం కలుగుతుందని వారు చెబుతున్నారు. వ్యాపారస్థులకు స్టాండర్డ్ డిడక్షన్ సౌకర్యం కొనసాగిస్తున్నప్పుడు ఉద్యోగులకు వర్తింపచేయకపోవటం వివక్షే అవుతుందని వారు స్పష్టం చేస్తున్నారు. అయితే అరుణ్ జైట్లీ ఆదాయం పన్ను మినహాయింపు పరిమితిని పెంచుతారా లేక స్టాండర్డ్ డిడక్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తారా అనేది వేచి చూడవలసిందే. నరేంద్ర మోదీ జమిలి ఎన్నికలకు వెళ్లినా లేక శాసనసభ ఎన్నికలు, లోక్‌సభ ఎన్నికలను విడివిడిగా జరుపుకున్నా ప్రజల



మద్దతు సంపాదించాలంటే బడ్జెట్‌లో కొంతైనా ఉదారత్వంతో వ్యవహరించకతప్పదని భావిస్తున్నారు. నరేంద్ర మోదీ జనాకర్షణ బడ్జెట్‌కు వ్యతిరేకం.. అందుకే అరుణ్ జైట్లీ జనాకర్షణ పథకాలు, నిర్ణయాలను బడ్జెట్‌లో పొందుపరచకపోయినా సగటు ఓటరు మన్ననలు పొందేందుకు మంచి బడ్జెట్‌ను ప్రతిపాదించవలసి ఉంటుంది. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో రైతులు కొట్టిన దెబ్బను మరిచిపోని ఎన్‌డీఏ ప్రభుత్వం రేపటి బడ్జెట్‌లో రైతులు, వ్యవసాయ రంగానికి మేలుచేసే నిర్ణయాలు ప్రకటించే అవకాశాలున్నాయని అంటున్నారు. వ్యవసాయ రంగం అభివృద్ధి 2.1 శాతం మాత్రమే ఉన్నందున ఈ రంగం పుంజుకునేందుకు ప్రభుత్వం ఇందుకు సంబంధించిన కొన్ని నిర్ణయాలను ప్రకటించకతప్పదని అంటున్నారు. జీఎస్‌టీటి మూలంగా పట్టణ ప్రాంతాలతోపాటు గ్రామీణ ప్రాంతాల ప్రజలు కూడా పలు ఇక్కట్లకు గురయ్యారు. అందుకే వారు తమ ప్రభుత్వం పట్ల ఆగ్రహంతో - మిగతా 7వ పేజీలో

ఏపీ ఎదురుచూపులు!

- బడ్జెట్‌లో భూరిసాయం దక్కేనా?
- విభజన హామీలు ఏమయ్యేను..
- బడ్జెట్ లోటు భర్తీ అవుతుందా..
- రాజధానికి ఇచ్చే నిధులు ఎన్ని..



2

ఆయనో పెద్ద కమర్షియల్!

ఏసీబీకి వలలో చీఫ్ కమిషనర్ • కోట్లలో అక్రమ సంపాదన

కిలోల కొద్దీ బంగారం.. సీఆర్‌డీఏలో స్థలాలు • వాణిజ్య పన్నుల శాఖలో సంచలనం

ఆంధ్రభూమి బ్యూరో

విశాఖపట్నం, జనవరి 31: రాష్ట్రంలో మరో అవినీతి అధికారి ఏసీబీకి దొరికాడు. వాణిజ్య పన్నుల శాఖ చీఫ్ కమిషనర్‌గా పనిచేస్తున్న గెడ్డపు లక్ష్మీప్రసాద్ ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టాడన్న ఫిర్యాదులు రావడంతో ఏసీబీ విశాఖ డీఎస్పీ రామకృష్ణ ప్రసాద్ నేతృత్వంలో రాష్ట్రంలో 20 చోట్ల బుధవారం ఏక కాలంలో దాడులు జరిగాయి. విశాఖపట్నం, శ్రీకాకుళం, గుంటూరు, హైదరాబాద్‌లోని ఈ దాడులు జరిగాయి. విశాఖలోని లక్ష్మీ ప్రసాద్ బావమరిది ఇంట్లో కూడా బుధవారం దాడులు జరిగాయి. ఏసీబీ అధికారుల కళ్లు చెదిరేలా లక్ష్మీప్రసాద్ ఆస్తులు ఉన్నాయి. వాణిజ్యపన్నుల శాఖలో అత్యున్నత అధికారి ఏసీబీ అధికారులకు చిక్కడం ఇటీవల కాలంలో ఇదే ప్రథమం. దీంతో రాష్ట్రంలోని వాణిజ్యపన్నుల శాఖలో కలకలం మొదలైంది. లక్ష్మీ ప్రసాద్ అక్రమార్జనకు సంబంధించి ఏసీబీ అధికారులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి.

శ్రీకాకుళం పట్టణంలో ఏడు వేల ఎస్‌ఎఫ్‌టీతో కూడిన జీ ప్లస్ టు భవనాన్ని 2003-04లో కొనుగోలు చేశారు. గుంటూరు జిల్లా గోరంట్లలో 400 చదరపు గజాల స్థలాన్ని



విశాఖలోని లక్ష్మీప్రసాద్ బావమరిది ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు

1997లోనే కొనుగోలు చేశాడు. ఇక్కడే 889 చదరపు గజలా ఇంటి స్థలాన్ని 1993లో కొనుగోలు చేశాడు. ఇక్కడే 240 చదరపు గజాల ఇంటి స్థలాన్ని 2014లో లక్ష్మీ ప్రసాద్ కొనుగోలు చేశాడు. విశాఖ నగరంలోని 200 చదరపు గజాల స్థలం, రంగారెడ్డి జిల్లా పరిగిలో 200 చదరపు గజాల చొప్పున నాలుగు స్థలాలను 2009 నుంచి 2011 సంవత్సరాల మధ్య కొనుగోలు చేశాడు. గుంటూరు జిల్లాలాంలో 172 చదరపు గజాల ఇంటి స్థలం, తాడికొండలో 400 చదరపు గజాల చొప్పున రెండు ఇంటి స్థలాలను ఏసీబీ అధికారులు గుర్తించారు. హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో1485 ఎస్‌ఎఫ్‌టీ కలిగిన ఒక ఫ్లాట్, నారాయణగుడలోని 1594 ఎస్‌ఎఫ్‌టీ కలిగిన మరొక ఫ్లాట్, గచ్చిబౌలిలోని 2040 ఎస్‌ఎఫ్‌టీ కలిగిన ఇంకో ఫ్లాట్‌ను లక్ష్మీ ప్రసాద్ కొనుగోలు చేసినట్టు ఏసీబీ అధికారులు తెలియచేశారు.

రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో 2.14 ఎకరాల డ్రై ల్యాండ్, విశాఖ జిల్లా అచ్యుతాపురంలో 0.17 సెంట్ల ఖాళీ స్థలాన్ని ఏసీబీ అధికారులు గుర్తించారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలో రెండు ఎకరాల వ్యవసాయ భూమిని 2013లో లక్ష్మీ ప్రసాద్ సొంతం చేసుకున్నాడు. లక్ష్మీప్రసాద్ అతని మరదలు పేరిటి మహేశ్వరంలో రెండు ఎకరాల వ్యవసాయ భూమి, గుంటూరు జిల్లా గోరంట్లలో 222 చదరపు గజాల ఖాళీ స్థలాన్ని కొనుగోలు చేశాడు. ఇక లక్ష్మీ ప్రసాద్‌కు చెందిన బంధువులు, స్నేహితులు ఇళ్ళపై దాడులు నిర్వహించగా కోటి రూపాయల విలువైన ప్రాంసరీ నోట్లు, 34 లక్షల బ్యాంక్ బ్యాలెన్స్, 32 వేల రూపాయల నగదు, 40 లక్షల రూపాయలు విలువైన బంగారు ఆభరణాలు, 10 లక్షల విలువైన గృహోపకరణాల, - మిగతా 7వ పేజీలో

మేడిన్ ఇండియా రక్షణ శాఖకు మరింత దన్నును అందించింది. భారత్‌లో నిర్మితమైన స్కార్పియన్ శ్రేణి జలాంతర్గామి ఐఎన్‌ఎస్ కరంజ్ జల ప్రవేశం చేసింది. మూడో స్వదేశీ జలాంతర్గామి ముంబయిలోని మజ్‌గావ్ డాక్‌యార్డ్‌లో తయారైంది. ఈ జలాంతర్గామికి అత్యాధునికమైన సాంకేతిక పాటవం ఉంది. ఏడాదిపాటు అనేకరకాలుగా పరీక్షించిన మీదట ఈ జలాంతర్గామిని నౌకాదళంలోకి చేర్చనున్నారు.





భూ-సేవ విధానాన్ని వివరిస్తున్న మంత్రి కేఈ కృష్ణమూర్తి

దేశంలోనే తొలిసారి ఈ-భూసేవ

ఒక్క క్లిక్‌తో సమగ్ర సమాచారం

ఆధార్ తరహాలో భూధార్

ఉప ముఖ్యమంత్రి కేఈ వెల్లడి

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 31: 'ఒక్క క్లిక్‌తో భూమికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని అందించే భూసేవ పథకాన్ని ప్రవేశపెడుతున్నాం, రాష్ట్రంలోని పట్టాదారుని భూభాగానికి ఆధార్ తరహాలో భూధార్ విశిష్ట సంఖ్యను అందజేస్తాం' అని ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి వెల్లడించారు. సచివాలయం వేదికగా భూసేవ, ఆటో మ్యూటేషన్ ప్రక్రియకు సంబంధించి రెవెన్యూ ఉన్నతాధికారులు ఉప ముఖ్యమంత్రికి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సమావేశంలో రెవెన్యూ, ఐటి, ఎన్‌ఐసీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో భూ వివాదాలు అరికట్టడంతోపాటు రాష్ట్రంలోని భూముల సమగ్ర సమాచారం ఒకే చోట లభ్యమయ్యేలా భూ సేవ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ-ప్రగతి ప్రాజెక్టులో భాగంగా భూసేవ పథకానికి శ్రీకారం చుట్టింది. ప్రాజెక్టులో భాగంగా రాష్ట్రంలోని ప్రతి పట్టాదారుని భూ భాగానికి జియో ట్యాగింగ్ చేసి 11 అంకెలతో ఒక సంఖ్య ఇస్తారని, ఈ సంఖ్య ఆధారంగా భూమికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని తెలుసుకోవచ్చన్నారు. జియో ట్యాగింగ్ చేసిన వెంటనే 99 సంఖ్యతో ప్రారంభమయ్యే తాత్కాలిక భూధార్ నెంబర్ ఇస్తామని, భూ వివరాలను సమగ్రంగా విశ్లేషించి అవి సక్రమంగా ఉన్నాయని నిర్ధారించుకున్న తర్వాత రాష్ట్ర సెన్సెస్ కోడ్ 28తో ప్రారంభమయ్యే పర్మనెంట్ భూధార్ నెంబర్ అందిస్తారు.

ప్రభుత్వ భూములను సులువుగా గుర్తించే విధంగా విశిష్ట సంఖ్య రెండు సున్నాలతో ప్రారంభమవుతుందన్నారు. భూసేవ వెబ్‌సైట్లో మొత్తం 6 శాఖలకు సంబంధించిన - మిగతా 7వ పేజీలో

ఆశల ఊసులు!

(ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి)

- విభజన హామీలు తీరుస్తారా?
- బడ్జెట్ లోటు భర్తీ అయ్యేనా?
- రాజధానికి నిధులిస్తారా?
- రైల్వే జోన్‌పై ఉత్తరాంధ్ర ఆశలు
- టాస్క్‌ఫోర్స్‌కు సై అంటారా?
- విద్యాసంస్థలకు నిధులిస్తారా?
- కేంద్ర బడ్జెట్‌పై ఏపీ ఆశలు వేయి

ఇదే ఆఖరి బడ్జెట్. మరి ఇప్పుడయినా ఆశలు ఫలిస్తాయా? విభజన హామీలు అమలుచేస్తారా? ఉత్తరాంధ్ర ప్రజల స్వప్నమైన రైల్వేజోన్ సాకారమవుతుందా? రాజధాని నగర నిర్మాణానికి సొమ్ముల సంగతేమిటి? బడ్జెట్ లోటు లెక్క ఈసారయినా తేల్చి, నిధుల విడుదల ఉంటుందా? టీడీపీ కోరుతున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుకు అంగీకరిస్తుందా? శంకుస్థాపన చేసిన విద్యాసంస్థలకు నిధుల మాటేమిటి? మొత్తంగా ఏపీపై కేంద్రం కరుణిస్తుందా? మునుపటి మాదిరిగానే కఠినంగా ఉంటుందా? ఇదీ.. పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న పూర్తిస్థాయి, చివరి బడ్జెట్‌పై ఆంధ్రప్రదేశ్ ప్రజల అంతరంగం! లోకసభకు ముందస్తు ఎన్నికల వార్తల నేపథ్యంలో మొదలైన పార్లమెంటు చివరి, పూర్తిస్థాయి బడ్జెట్ సమావేశాలపై ఏపీ ప్రజలు, ప్రభుత్వం వేయి ఆశలు పెట్టుకుంది. ప్రధానంగా విభజన హామీలు, పెండింగ్ ప్రాజెక్టులు, గ్రాంట్లు, రైల్వే జోన్ వంటి కీలక అంశాలపై కేంద్ర స్పందన కోసం రాష్ట్ర ప్రజలు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. ప్రత్యేక హోదా హామీని విస్మరించి, దాని స్థానంలో ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామన్న కేంద్రం ఆ హామీ కూడా నిలబెట్టుకోవడం లేదని, రాష్ట్రానికి మోదీ సర్కారు ఏమీ చేయకపోయినా కేంద్రంలో టీడీపీ ఎందుకు కొనసాగుతోందంటూ విపక్షాలు బీజేపీ-టీడీపీపై జమిలిగా విరుచుకుపడుతున్న నేపథ్యంలో.. ఆ అపవాదుకు ఎన్డీఏ ప్రభుత్వం తెరదించుతుందా? లేక నిధుల సమస్యలతో మళ్లీ దాటవేత ధోరణి ప్రదర్శిస్తుందా అన్న ప్రశ్నలకు నేటి బడ్జెట్ సమాధానం చెప్పనుంది. ఏపీ జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు నిధుల విడుదలపై నెలకొన్న వివాదానికి తెరదించాల్సి ఉంది. ఆ ప్రాజెక్టుపై ఇప్పటిదాకా 7780కోట్లు రావలసి ఉంది. అయితే కేంద్రం నుంచి 4300 కోట్లు వరకే అందాయి. మిగిలిన నిధుల కోసం ప్రభుత్వం కేంద్ర బడ్జెట్ వైపు ఆశగా ఎదురుచూస్తోంది. ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల వాంఛితమైన రైల్వేజోన్‌పై టీటీడీ, వైసీపీ, కాంగ్రెస్ ఎంపీలు ఇప్పటికే ఉభయ సభల్లోనూ పోరాడుతున్నారు. గల్లా జయదేవ్, రామ్మోహన్‌నాయుడు ప్రైవేటు బిల్లు కూడా ప్రవేశపెట్టారు. విశాఖకు సాధ్యం కాకపోతే కనీసం గుంటూరు కేంద్రంగానయినా జోన్ ఇవ్వాలన్న డిమాండు కూడా ఉంది. ఇది ఈ బడ్జెట్‌లో కాకపోతే ఇక అసాధ్యమే. ఇదే అంశంపై వైసీపీ-కాంగ్రెస్ ఉత్తరాంధ్రలో రాజకీయంగా లబ్ధి పొందాలన్న వ్యూహంతో వెళుతున్నాయి. దానికి బ్రేకులు వేయాలంటే జోన్ ప్రకటించక తప్పని పరిస్థితి కనిపిస్తోంది. లేకపోతే ఉత్తరాంధ్రలో బీజేపీ దెబ్బతినే ప్రమాదంతోపాటు, టీడీపీకీ రాజకీయంగా నష్టమేనన్న ఆందోళన అక్కడి ప్రాంత నేతల్లో వ్యక్తమవుతుండగా, ఆ డిమాండ్ ఉధృతంగా ఉన్న సమయంలోనే తాము ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచామని బీజేపీ నేతలు వాదిస్తున్నారు. విభజన హామీలు నెరవేర్చేందుకు టాస్క్‌ఫోర్సు ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబునాయుడు మోదీ, జైట్లీని ఇప్పటికే కోరారు.

వీటిపైనే ఆశలు..

- 13వ షెడ్యూల్‌లో ఉన్న 11 సంస్థల్లో ఇప్పటివరకూ వచ్చినవి 9 మాత్రమే. వాటికి ఇప్పటివరకూ ఇచ్చింది కేవలం 400 కోట్లు మాత్రమే. మిగిలినవి పూర్తి కావాలంటే పూర్తి స్థాయి నిధులివ్వాల్సి ఉంది.
- విశాఖ-అమరావతిని సమన్వయం చేస్తూ చెన్నై వరకూ హైస్పీడ్ రైల్ మార్గం నిర్మాణానికి, విశాఖలో మెట్రో రైల్ నిర్మాణానికి కేంద్రం ఇచ్చిన హామీ నెరవేర్చాల్సి ఉంది.
- అమరావతి నగర నిర్మాణానికి 1000 కోట్లు ఇవ్వాల్సి ఉంది.
- నీటి పారుదల ఉన్న ప్రాంతానికి, లేని ప్రాంతానికి ప్రత్యేక మద్దతు ధర ఇవ్వాలన్న డిమాండును పరిష్కరించాల్సి ఉంది.
- కడపలో స్టీల్‌ప్లాంట్ నిర్మాణం, ప్యాకేజీకి చట్టబద్ధత కల్పించాల్సి ఉంది.
- పరిశ్రమల ప్రోత్సాహకానికి రాయితీల కోసం 1500 కోట్లు కేటాయించాల్సి ఉంది. పరిశ్రమల స్థాపన, ఉత్పత్తులకు పదేళ్లపాటు వందశాతం రాయితీ, ఎక్సైజ్ టాక్సు మినహాయింపు, ఐదేళ్లపాటు 100 శాతం ఆదాయపన్ను మినహాయింపు వంటి ప్రభుత్వ డిమాండ్లు తీర్చాల్సి ఉంది.
- 16 వేల కోట్ల రెవిన్యూలోటు భర్తీ కింద ఇప్పటివరకూ 3 వేల కోట్లు మాత్రమే ఇచ్చింది. అయితే కొత్తగా కేంద్రం ఆ లెక్కను 4117 కోట్లుగా తేల్చింది. తర్వాత ఆ ఖాతా కింద 7500 కోట్లు ఇచ్చేందుకు కేంద్రం అంగీకరించినా, రాష్ట్రం ఆ లెక్క తప్పనివాదిస్తోంది. రెవిన్యూ లోటు కింద రావలసిన 13000కోట్లు ఒకేసారి విడుదల చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ డిమాండు బడ్జెట్‌లో నెరవేరుతుందా? లేదా అన్నది చూడాలి.

ఇవ్వకపోతే ఇద్దరికీ ఇరకాటమే!

ఎన్నికలకు ఇంకో ఏడాది మాత్రమే సమయం ఉన్న నేపథ్యంలో... కేంద్ర బడ్జెట్ రాష్ట్రంలో టీడీపీ-బీజేపీలపై ప్రభావం చూపే అవకాశం లేకపోలేదు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల్లో భాగస్వాములుగా ఉన్న రెండు పార్టీలు, రాష్ట్రానికి కేంద్రం సంతృప్తికర స్థాయిలో నిధులు ఇవ్వకపోతే, అది విపక్షాలకు అస్త్రంగా మారే ప్రమాదం లేకపోలేదు. ఇప్పటికే రైల్వే జోన్ అంశాన్ని విపక్షాలు ఆయుధంగా సంధిస్తుండగా, విభజన హామీల అమలులో రెండు పార్టీలు విఫలమయ్యాయని విరుచుకుపడుతున్నాయి. ప్రధానంగా పెండింగ్‌లో ఉన్న ప్రధాన రైల్వే ప్రాజెక్టులకు ఈసారి మోక్షం లభించకపోతే రెండు పార్టీలు ప్రజల ఆగ్రహం, అసంతృప్తికి గురికాక తప్పని పరిస్థితి. విద్యాసంస్థల ఏర్పాటుపై కేంద్రం ఇచ్చిన నిధులు వాటి ప్రహరీగోడలకే సరిపోవడం లేదు. కేంద్రం కంటే రాష్ట్రప్రభుత్వమే అక్కడ ఎక్కువ నిధులు ఖర్చుపెడుతుండటం గమనార్హం. ఈ బడ్జెట్‌లో రాష్ట్రానికి కేంద్రం సంతృప్తికర స్థాయిలో నిధులు, ప్రాజెక్టులు కేటాయించకపోతే.. కేంద్రంలో చంద్రబాబుకు పలుకుబడి లేదన్న విమర్శలతోపాటు, ఎన్డీఏ నుంచి బయటకు రావాలన్న డిమాండు.. బీజేపీకి రాష్ట్రంపై చిత్తశుద్ధి లేదన్న ఆరోపణలు జమిలిగా ఎదుర్కోవలసి ఉంటుంది. దీనితో కీలకమైన ఎన్నికల సమయంలో కేంద్ర బడ్జెట్ ఇరు పార్టీలకూ ప్రతిష్ఠగా మారింది.



స్మార్ట్ బైకులు ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

సచివాలయంలో స్మార్ట్ బైకులు

- తన బ్లాక్ వరకూ సైకిల్ తొక్కిన చంద్రబాబు
- అమరావతిలో స్మార్ట్ బైకుల తయారీ యూనిట్ ప్రతిపాదన

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, జనవరి 31: రాష్ట్ర రాజధాని అమరావతిలోని సచివాలయంలో స్మార్ట్ బైకులు వచ్చేశాయి. వాటిని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వయంగా నడిపి ప్రారంభించారు. దాని పనితనం చూసి విశాఖపట్నం, విజయవాడ, తిరుపతిల్లో కూడా స్మార్ట్ బైకులు ప్రవేశపెట్టాలని ఆలిండియా బైసైకింగ్ ఫెడరేషన్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించారు. సచివాలయం ప్రాంగణం 2వ బ్లాక్ ఎదురుగా బుధవారం ఉదయం ఆయన స్మార్ట్ బైక్ స్టాండ్, స్మార్ట్ బైకులను ప్రారంభించారు. స్మార్ట్ కార్డ్ ద్వారా డిజిటల్ తాళం తీసే పద్ధతి, బైకుని ఉపయోగించే విధానాన్ని నిర్వాహకులు సీఎంకు వివరించారు. సచివాలయం వద్ద మూడు స్టాండులు, 24 స్మార్ట్ బైకులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ బైకుకు ఉన్న బుట్టలో హెల్మెట్ కూడా ఉంది. ఆంధ్రా బ్యాంక్ సౌజన్యంతో ఈ బైకులు ఏర్పాటు చేశామని, ఒక్క పైసా కూడా ప్రభుత్వం ఖర్చు చేయలేదని సీఎంకు సీఆర్డీఏ కమిషనర్ శ్రీధర్ చెప్పారు. అత్యంత ఆధునికమైన, అత్యుత్తమైన ఈ సైకిళ్లను జర్మనీ నుంచి దిగుమతి చేసుకున్నట్లు, ప్రభుత్వం అనుమతిస్తే త్వరలో అమరావతిలో అసెంబ్లింగ్ యూనిట్ నెలకొల్పనున్నట్లు సీఎంకు ఆలిండియా బైసైకిలింగ్ ఫెడరేషన్ ఛైర్మన్ డివి మనోహర్ చెప్పారు. ఇంతకు ముందు ఎక్కడా లేనివిధంగా ఈ బైక్ స్టాండ్ డిజైన్ చేసినట్లు తెలిపారు. మిగిలిన నగరాలలో కూడా ప్రవేశపెడతామని చెప్పారు. సైకిల్ రేసులు కూడా నిర్వహించమని సీఎం ఆయనకు సలహా ఇచ్చారు. బైక్ స్టాండ్ నిర్మాణం చూసి సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు. స్టాండ్ చుట్టూ మొక్కలు పెంచి పచ్చదనం నింపి, కలర్‌ఫుల్‌గా తయారుచేసి, సందర్శకులు ఇక్కడ కూర్చోవడానికి కూడా ఏర్పాట్లు చేయమని చెప్పారు. ఇక్కడ సోలార్ విద్యుత్ యూనిట్ ఏర్పాటు చేసి ఏపీకి, విద్యుత్ వాహనాలకు వినియోగించే ఏర్పాటు చేయమని అధికారులను ఆదేశించారు. విజయవాడ-గుంటూరు మధ్య కూడా ఇటువంటి సైకిళ్లను ప్రవేశపెట్టే అంశాన్ని పరిశీలించమన్నారు. స్మార్ట్ బైక్ తయారీ యూనిట్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు పరిశీలించమని కమిషనర్ శ్రీధర్‌కు సీఎం చెప్పారు. ఆ తరువాత సీఎం స్వయంగా సైకిల్ తొక్కుతూ 1వ బ్లాక్‌లోని తన కార్యాలయానికి వెళ్లారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారాయణ, ఎనర్జీ, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ బైక్ ఉపయోగించే విధానం ఇదే

సచివాలయం బయట బస్టాండ్ వద్ద, లోపల 5వ బ్లాక్, 2వ బ్లాక్ వద్ద స్మార్ట్ బైక్ స్టాండ్‌ల ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మూడుచోట్ల ఎక్కడైనా బైక్ తీసుకోవచ్చని, ఎక్కడైనా పార్క్ చేయవచ్చని తెలిపారు. పేరు నమోదు చేయించుకున్న వారికి సభ్యత్వ స్మార్ట్ కార్డు ఇస్తారని, ఆ కార్డు ద్వారా బైక్ డిజిటల్ తాళం తీయవచ్చని వివరించారు. యాప్ ద్వారా కూడా బైక్ తాళం తీయవచ్చని తెలిపారు. బైక్‌ను తీసుకొని, ఉపయోగించుకునే వివరాలు స్టాండ్ వద్ద శాశ్వతంగా ప్రదర్శనకు ఉంచారు. ప్రస్తుతం ఈ బైకులను ఉచితంగానే వినియోగించుకోవచ్చని తెలిపారు. దేశంలోని ఇతర ప్రాంతాల్లో రెండు నెలలు, ఆరు నెలలు, ఏడాది చొప్పున ఛార్జి వసూలు చేస్తారని వివరించారు. నగరం విస్తరించిన తరువాత ఈ బైకుల వినియోగం ఎక్కువగా ఉంటుందని చెప్పారు.

ఆంధ్రా బ్యాంక్ రూ.30 లక్షల మంజూరు

కాగా అమరావతిలో తొలిసారిగా ప్రవేశపెట్టిన ఈ స్మార్ట్ బైక్ ప్రాజెక్టుకు అయిన ఖర్చు మొత్తం రూ.30 లక్షలు ఆంధ్రా బ్యాంక్ ఇచ్చినట్లు సీఆర్డీఏ కమిషనర్ చెరుకూరి శ్రీధర్ తెలిపారు. బ్యాంక్ ఏజీఎం ఎం.విజయప్రతాప్ చొరవతో నిధులు విడుదల చేసిన జీఎం కెవిఎస్పీ ప్రసాద్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

స్మార్ట్ విశేషాలివి!

- తొలిసారిగా వెలగపూడి సచివాలయంలో ప్రయోగాత్మకంగా అమలు
- మాస్టర్ ప్లాన్ ప్రకారం సీఆర్‌డీఏ పరిధిలో సైకిల్ సవారీకి ప్రత్యేకంగా ట్రాక్‌ల ఏర్పాటు
- నేటి నుంచి సందర్శకులకు అందుబాటులోకి రానున్న సచివాలయం స్మార్ట్ సైకిళ్లు
- కాలుష్యాన్ని తగ్గించడమే లక్ష్యంగా స్మార్ట్ సైకిళ్ల వ్యవస్థ
- జర్మనీ నుంచి ఇప్పటికే సచివాలయానికి చేరిన 30 సైకిళ్లు
- సచివాలయం ఆవరణ లోపల రెండు స్మార్ట్ సైకిల్ స్టేషన్ల ఏర్పాటు
- సచివాలయం వాహనాల పార్కింగ్ వద్ద మరో స్టేషన్ ఏర్పాటు
- ప్రతి స్టేషన్‌లో అందుబాటులో 10 సైకిళ్లు
- సైకిల్ తీసుకునే వారికి ప్రత్యేకంగా స్వైపింగ్ కార్డు, పాస్‌వర్డ్
- పాస్‌వర్డ్‌తోనే తెరుచుకునే సైకిళ్లు
- సచివాలయం లోపల, బయట సందర్శకుల అవసరార్థం సైకిళ్లు
- పని ముగించుకున్న తర్వాత తీసుకున్న సైకిల్‌ను మూడు స్టేషన్లలో ఎక్కడైనా అప్పచెప్పి వెళ్ళే అవకాశం
- ఎల్లాయిడ్, అల్యూమినియంతో తయారు చేయబడిన కొత్త సైకిళ్లు
- వర్షంలో తడిసినా తుప్పుపట్టే అవకాశం లేని మూడు గేర్ల సైకిళ్లు

కోడిపందాల నిర్వహణపై
అవసరమైతే చట్టం

- హోంమంత్రి చినరాజప్ప

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 31: అవసరమైతే రాష్ట్రంలో కోడి పందాల నిర్వహణకు సంబంధించి చట్టం తీసుకువస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి (హోం) చినరాజప్ప వెల్లడించారు. సినిమా టిక్కెట్ల ధరల పెంపు, వామపక్ష ఉగ్రవాదంపై మంత్రుల కమిటీ సమావేశాలు వెలగపూడి సచివాలయంలో బుధవారం జరిగాయి. అనంతరం ఆయన తన చాంబర్‌లో మీడియాతో మాట్లాడుతూ కోడి పందాల నియంత్రణలో పోలీసులు బాగా పని చేశారన్నారు. దాదాపు 3000 కేసులు నమోదు చేశారన్నారు. కొంతమంది ఎమ్మెల్యేలపైనా కేసులు నమోదు చేశారన్నారు. కోడి పందాలపై సీఎం చాలా సీరియస్‌గా ఉన్నారని తెలిపారు. అయితే కేసులు నమోదైన ఎమ్మెల్యేలు ఎంతమంది, వారి పేర్లు వెల్లడించేందుకు నిరాకరించారు. కోడిపందాలను అనుమతించకపోయినా, అనుమతించినా విమర్శలు వస్తుంటాయన్నారు. గత ఏడాది నమోదైన కోడి పందాల కేసులపై చర్యలు తీసుకోకపోవడాన్ని హైకోర్టు తప్పు పట్టడాన్ని ప్రస్తావించగా, ఈ ఏడాది కేసులు నమోదు చేశామని, ఎక్కడో మారుమూల ప్రాంతాల్లో జరిగిన పందాలను చూపించి మీడియా హడావుడి చేసిందని వ్యాఖ్యానించారు. దీనిని దృష్టిలో ఉంచుకుని అవసరమైతే చట్టం తీసుకువచ్చే అంశం పరిశీస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మావోయిస్టుల కదలికలు తగ్గాయని, తమ ఉనికిని చాటుకునేందుకు ఎక్కడో చిన్న చిన్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. రాష్ట్రంలో నేరాల సంఖ్య పెరుగుతుండటంపై ప్రస్తావించగా, గతంలో కేసులు నమోదు చేసేవారు కాదని, ఇప్పుడు ప్రతి కేసు నమోదు చేస్తుండటం వల్ల ఎక్కువ అవుతున్నట్లు కనబడుతోందన్నారు. కానీ క్రైం రేటు తగ్గుతోందన్నారు.

అమరావతిలో అక్టోబర్ నాటికి
హైకోర్టు భవనాలు సిద్ధం

- రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ వెల్లడి
- రేషన్ బియ్యం రీసైక్లింగ్ చేస్తే కఠిన చర్యలు: మంత్రి ప్రత్తిపాటి

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 31: ఈ ఏడాది అక్టోబర్ నాటికి అమరావతిలో హైకోర్టు భవనాలు అందుబాటులోకి రానున్నాయని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ వెల్లడించారు. రూ.110 కోట్లతో హైకోర్టు భవన నిర్మాణ పనులు ఫిబ్రవరి ఆఖరులోగాని, మార్చి మొదటివారంలో గాని ప్రారంభించనున్నామన్నారు. వెలగపూడి సచివాలయంలోని పబ్లిసిటీ సెల్‌లో బుధవారం నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావుతో కలిసి ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సీఆర్డీఏ సమావేశం బుధవారం జరిగిందన్నారు. ఈ సమావేశంలో హైకోర్టు భవన నిర్మాణం, తరలింపుపై ప్రధాన చర్చ జరిగినట్లు మంత్రి నారాయణ తెలిపారు. 4 ఎకరాల్లో జీ ప్లస్ 2 పద్ధతిలో రూ.110 కోట్లతో హైకోర్టు భవన సముదాయాలు నిర్మించనున్నామన్నారు. ప్రస్తుతం హైకోర్టు భవనాల డిజైన్లు తుది దశలో ఉన్నాయన్నారు. ఈ డిజైన్లను హైకోర్టు న్యాయమూర్తుల దృష్టికి తీసుకెళతామన్నారు. విజయవాడలో ఏప్రిల్ 12, 13 తేదీల్లో సిటీ సమ్మిట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సమ్మిట్ నిర్వహణకు సంబంధించిన లోగో, థీమ్‌పై చర్చ జరిగిందని తెలిపారు. శాంతి భద్రతలు, రవాణా సదుపాయాల దృష్ట్యా భవానీ ఐల్యాండ్‌లో నిర్వహించేందుకు ప్రభుత్వం మొగ్గు చూపుతోందన్నారు. అమరావతిలో ఐటీ టవర్ నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయించిందని, అమరావతిలో వసతి సౌకర్యం కల్పిస్తే, ఐటీ పరిశ్రమలు స్థాపించడానికి అమెరికాకు చెందిన ఐటి పారిశ్రామిక వేత్తలు ముందుకొచ్చారన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని సీఎం చంద్రబాబు నాయుడు 10 లక్షల చదరపు అడుగుల నిర్మాణంలో రెండు భవనాలు నిర్మించాలని నిర్ణయించారన్నారు. నీరుకొండపై ఏర్పాటు చేయదలచిన మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ భారీ విగ్రహం ఏర్పాటుకు అవసరమైన డిజైన్లు సిద్ధం అయినట్లు తెలిపారు. శుక్రవారంనాటి మంత్రివర్గ సమావేశంలో చర్చించి ప్రజాభిప్రాయ సేకరణకు ఆన్‌లైన్‌లో ఉంచుతామన్నారు. రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసే మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు హెచ్చరించారు. మిల్లుల్లో వాడే విద్యుత్ పరిగణలోకి తీసుకుంటామన్నారు.

భవానీ ద్వీపంలో సంతోష నగరాల సదస్సు!

- సంతోష సూచికలో తొలి 50 స్థానాల్లో ఉన్న నగరాలకు లేఖలు
- సీఎం చంద్రబాబు

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, జనవరి 31: ఏప్రిల్ 10 నుంచి 12 వరకు మూడు రోజుల పాటు జరిగే సంతోష నగరాల సదస్సు ద్వారా మరోసారి అమరావతి ప్రాభవాన్ని ప్రపంచానికి చాటే అవకాశం దక్కిందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభిప్రాయపడ్డారు. సంతోష సూచికలో తొలి 50 స్థానాలలో ఉన్న నగరాలకు లేఖలు రాయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఆయా నగరాలలో అమలుచేస్తున్న ఉత్తమ విధానాలు, వినూత్న పద్ధతుల గురించి మనం తెలుసుకునేందుకు ఈ అంతర్జాతీయ సదస్సు తప్పకుండా దోహదపడుతుందని బుధవారం సీఆర్‌డీఏ సమీక్షలో ఆయన అభిప్రాయపడ్డారు. 'భూటాన్, సింగపూర్, యూఏఈల్లో హ్యాపీనెస్‌కు ప్రత్యేకంగా మంత్రిత్వశాఖలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సంతోష సూచికను ప్రామాణికంగా తీసుకుంది. ప్రజల సంతృప్తి, సంతోషాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. ఇటువంటి సమయంలో జరుగుతున్న సంతోష నగరాల సదస్సు ఈ దిశగా మనం చేసే కృషికి తప్పక దోహదపడుతుంది అని చంద్రబాబు అన్నారు. 'సిలికాన్ వ్యాలీ' తరహాలో మన రాష్ట్రం ఇన్నోవేషన్ వ్యాలీగా అవతరించాలని, వినూత్న ఆలోచనలకు ఆంధ్రప్రదేశ్ వేదికగా నిలవాలని ముఖ్యమంత్రి చెప్పారు. అందుకోసమే త్వరలో ఇన్నోవేషన్ సమ్మిట్ ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్, స్టార్టప్ అంశాలలో మన రాష్ట్రం మిగిలిన ప్రపంచానికి రోల్‌మోడల్ కావాలన్న లక్ష్యాన్ని ముందు పెట్టుకున్నామన్నారు. అమరావతి-విజయవాడకు మధ్యలో కృష్ణానదిలో ఉన్న భవానీద్వీపం సంతోష నగరాల సదస్సు నిర్వహణకు వేదికగా అన్ని విధాలుగా అనుకూలంగా ఉంటుందని ఈ సమావేశంలో ప్రాథమికంగా ఒక నిర్ణయానికి వచ్చారు. 'అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్ టు గ్లోబల్ లివింగ్' అనే థీమ్‌తో జరగనున్న సంతోష నగరాల సదస్సుకు 2 వేల మంది అతిథులు వస్తారని అంచనా వేస్తున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. వీరందరికీ విజయవాడ, గుంటూరు నగరాలలోని హోటళ్లలో వసతి కల్పించాలని చెప్పారు. అవసరమైతే భవానీద్వీపంలోనే 200 తాత్కాలిక గదులతో వసతికి ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. అమరావతిలో నెలకొల్పాలనుకుంటున్న 100 కంటైనర్ హోటల్ రూమ్‌లను తొలుత ప్రయోగాత్మకంగా భవానీద్వీపంలో ఏర్పాటు చేయడం ద్వారా సంతోష నగరాల సదస్సుకు వినియోగించుకోవచ్చునన్న ప్రతిపాదనను పరిశీలించాలని ముఖ్యమంత్రి చెప్పారు. పేరొందిన స్టార్ హోటళ్ల నిర్వహణా భాగస్వామ్యంతో అమరావతిలో కనీసం 100 కంటైనర్ హోటల్ రూములను ఏర్పాటు చేయాలని సూచించారు. సిటిజెన్ సెంట్రిసిటీ, అర్బన్ ఇన్నోవేషన్, నెక్స్ట్ జనరేషన్ టెక్నాలజీ, అర్బన్ ప్లానర్లు, అర్బన్ ట్రాన్స్‌ఫోర్టేషన్, ఆర్కిటెక్చర్-డిజైనింగ్ వంటి అంశాలపై సదస్సులో విస్తృతంగా చర్చలు సాగాలని, ఆ చర్చల సారం రాజధాని నిర్మాణానికి ఉపయోగపడాలని ముఖ్యమంత్రి అన్నారు.

మేయర్లు, నగర పాలకులు, అర్బన్ ప్లానర్లకు ఉపయుక్తంగా ఉండాలన్నారు. రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్, బ్లూమ్‌బెర్గ్ ఫిలాంత్రోఫీస్ ఈ సదస్సుకు ప్లాట్‌ఫామ్, మీడియా పార్టనర్లుగా ఉన్నారని అధికారులు తెలిపారు. యూఏఈ, భూటాన్, సింగపూర్ ప్రభుత్వ ముఖ్యులను, కేంద్ర మంత్రులను ఈ సదస్సుకు ఆహ్వానించాలని సూచించారు.

పునర్విభజనపై 'అమితా'సక్తి!

- నేడు బీజేపీ కోర్ కమిటీతో అమిత్‌షా భేటీ
- పునర్విభజన, వర్గీకరణ, పార్టీ కమిటీపై చర్చ?
- వర్గీకరణతో మాదిగలను ఆకర్షించే ఎత్తుగడ

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, జనవరి 31: చాలాకాలం తర్వాత బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా రాష్ట్రానికి చెందిన పార్టీ కోర్ కమిటీతో భేటీ కానున్నారు. రాష్ట్రంలో నెలకొన్న వివిధ అంశాలపై ఆయన కోర్ కమిటీ సభ్యులతో చర్చించనున్నారు. గురువారం ఢిల్లీలో జరిగే సమావేశానికి హాజరుకావాలని ఇప్పటికే కోర్ కమిటీ సభ్యులకు సమాచారం అందింది. ఈ భేటీలో ప్రధానంగా రెండు తెలుగురాష్ట్రాల ముఖ్యమంత్రులు గత రెండేళ్ల నుంచి డిమాండ్ చేస్తున్న, నియోజకవర్గ పునర్విభజన చర్చకు రానున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పునర్విభజన వల్ల రాజకీయంగా పార్టీకి వచ్చే లాభనష్టాలపై అమిత్‌షా ఆరా తీయనున్నారు. గుజరాత్ ఎన్నికల ఫలితాలు, త్వరలో కర్నాటకకు జరగనున్న ఎన్నికలు, లోక్‌సభకు ముందస్తు ఎన్నికల నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. కాగా పునర్విభజనపై ఇప్పటికే కేంద్రం నుంచి సానుకూల లభించిందని టీడీపీ వర్గాలు చెబుతుంటే.. అది పార్లమెంటులో చర్చల వరకూ వచ్చి ఆగిపోతుందని, కేవలం బాబు-కేసీఆర్ తృప్తి కోసమే బిల్లు పెడతారన్న సమాచారం తనకు ఉందని జగన్ తన పార్టీ వారికి స్పష్టంగా చెబుతున్నారు. ఈ క్రమంలో అమిత్‌షా రాష్ట్ర నేతల అభిప్రాయం కోరనున్నారు. ఇదిలాఉండగా, వర్గీకరణ బిల్లుపైనా చర్చించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఏపీలో మాలల్లో కొందరు వైసీపీ, మరికొందరు టీడీపీ వైపు ఉన్నందున, మాదిగలను ఆకట్టుకోవాలంటే వర్గీకరణను ఆమోదించడమే మంచిదన్న అభిప్రాయం రెండు తెలుగు రాష్ట్రాల బీజేపీ నేతల్లో వ్యక్తమవుతోంది. ఇప్పటికే మూడు, నాలుగుసార్లు అసెంబ్లీలో తీర్మానం ఆమోదించినందున దానికి అవరోధాలు ఉండబోవని పార్టీ నేతలు చెబుతున్నారు. ఏపీలో కంటే తెలంగాణలోనే మాదిగల సంఖ్య ఎక్కువ అని తెలంగాణ బీజేపీ నేతలు గుర్తు చేస్తున్నారు. మాదిగలు కూడా బీజేపీ వర్గీకరణ చేస్తుందన్న భరోసాతో ఉన్నారు. ఇటీవల అమిత్‌షా బెజవాడకు వచ్చినప్పుడు కూడా, ఆయన ప్రసంగిస్తున్నప్పుడు ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు నినాదాలు చేసిన విషయం తెలిసిందే. ఇవన్నీ దృష్టిలో ఉంచుకుంటే వర్గీకరణ వల్ల రెండు రాష్ట్రాల్లో పార్టీకి మాదిగలు శాశ్వత ఓటు బ్యాంకుగా మారతారని పార్టీ నేతలు విశ్లేషిస్తున్నారు. ఇక ఇప్పటివరకూ రాష్ట్రంలో పార్టీ కమిటీలు లేవని, హరిబాబు ఒక్కరు మినహా కొత్త కమిటీ లేనందున, దానిపైనా చర్చించే అవకాశం ఉందంటున్నారు. పూర్తి స్థాయి కమిటీ లేనందున, పార్టీ కార్యాలయంలో ఒక సామాజికవర్గం పెత్తనం పెరిగిపోతోందని, ఇటీవల కోర్ కమిటీ అనుమతి లేకుండానే, చర్చలకు వెళ్లే వారి జాబితాను విడుదల చేశారని కొందరు సీనియర్లు అమిత్‌షాకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఆ అంశంపై కొందరు సభ్యులు నేడు ఆయన దృష్టికి వెళ్లే అవకాశం ఉందని చెబుతున్నారు.

గూగుల్ డేటా సెంటర్ టీంతో మంత్రి లోకేష్ భేటీ

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 31: అమెరికా పర్యటనలో భాగంగా శాన్ ఫ్రాన్సిస్కోలో గూగుల్ డేటా సెంటర్ టీంతో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ భేటీ అయ్యారు. ప్రముఖ ఇంజనీర్ పార్థసారథి, రామ్, యాస్పీ తదితరులు ఈ భేటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ రియల్ టైం గవర్నెన్స్ ద్వారా అనేక సేవలు అందిస్తున్నామని, ఏపీలో ఫైబర్ గ్రిడ్ ద్వారా రూ.149కే ఇంటర్నెట్ టెలివిజన్ వంటి పలు సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఏపీలో వర్షపాతం తక్కువ ఉన్నా వ్యవసాయంలో 24 శాతం వృద్ధి సాధించామని, ఏపీని క్లౌడ్ హబ్‌గా మార్చేందుకు అనేక పాలసీలు తీసుకొచ్చామన్నారు. క్లౌడ్ సెంటర్ల ఏర్పాటుకు రాయితీలు కల్పిస్తున్నామని, హెల్త్‌కేర్, వ్యవసాయ రంగంలో గూగుల్ సహకారం కావాలన్నారు. గూగుల్ క్లౌడ్ మినీ క్లస్టర్లు ఏర్పాటులో ఏపీని పరిశీలించాలని లోకేశ్ కోరారు.

ఐటీ అభివృద్ధికి ప్రభుత్వం విశేష కృషి

నవ్యాంధ్రలో పెట్టుబడులే లక్ష్యంగా ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ చేస్తున్న అమెరికా పర్యటన ఫలప్రదమవుతోందని ఎమ్మెల్సీ సత్యనారాయణ తెలిపారు. అనేక కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయని, ఈ మేరకు నారా లోకేష్ ఆయా కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారన్నారు. రాష్ట్రంలో స్టార్టప్ కంపెనీలకు తోడ్పాటు అందించడంతో పాటు సిలికాన్ వ్యాలీలో కంపెనీలు ఏర్పాటు చేసేందుకు ఫాల్కన్ ఎక్స్ ముందుకు వచ్చిందన్నారు. బ్లాక్ చైన్, ఫిన్‌టెక్ అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టిపెట్టారన్నారు. సిస్ ఇంటెలి, ఎలక్ట్రో హెల్త్‌కేర్, ఎలక్సిస్ కంపెనీలతో పాటు ఐటీ దిగ్గజం ఐస్పేస్ సంస్థ ఏపీలో పెట్టుబడులు పెట్టనున్నాయి. గుంటూరులో సాఫ్ట్ హెచ్‌క్యూ సంస్థ రానుందని, అభివృద్ధి వికేంద్రీకరణ లక్ష్యంతో ఐటీ రంగం ఒకేచోట కాకుండా విశాఖ, అనంతపురం, తిరుపతి, అమరావతిలో అభివృద్ధి చేయడం జరుగుతోందని తెలిపారు. గత మూడున్నరేళ్లలో ఐటీలో 24 వేల ఉద్యోగాలు కల్పించారని, రాష్ట్రంలో స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించిందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో హెచ్‌సీఎల్, జోహో కాన్సువెంట్స్‌ఎస్ ఆర్ లాంటి పెద్ద కంపెనీలు వచ్చాయని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో ఐటీ అభివృద్ధిని విస్మరించారని, విదేశాల్లోని ఐటీ కంపెనీలకు లేఖలతోనే సరిపెట్టాయని విమర్శించారు.

విడిపోయి.. ఏం చేస్తాం?

- మీ కోరికలు పార్టీపై రుద్దకండి
- మిత్రపక్షంపై మాట్లాడొద్దు
- బీజేపీతో మనం కలిసే ఉన్నాం
- పార్టీ అధికార ప్రతినిధులతో బాబు

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, జనవరి 31: మిత్రపక్షమైన బీజేపీతో కలసి నడిచే విషయంలో టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబునాయుడు స్పష్టమైన సంకేతాలిచ్చారు. పార్టీ నేతలెవరూ బీజేపీపై నోరుజారి మాట్లాడవద్దని హెచ్చరించారు. ఒకవేళ బీజేపీ నుంచి బయటకు వచ్చి ఏం చేస్తామంటూ నేతలను ప్రశ్నించడం ద్వారా, ఆ పార్టీతో తన భవిష్యత్తు వ్యూహమేమిటో చెప్పకనే చెప్పారు. తన పార్టీకి చెందిన అధికార ప్రతినిధులు, టీవీ చర్చల్లో పాల్గొనే దాదాపు 20 మందితో చంద్రబాబునాయుడు మంగళవారం రాత్రి వరకూ సుదీర్ఘంగా భేటీ అయ్యారు. ప్రజలు ఏమనుకుంటున్నారో వాకబు చేశారు. చర్చల్లో వారు అనుసరించాల్సిన వ్యూహం, మాట్లాడవలసిన తీరు, పార్టీ విధానాలపై దిశానిర్దేశం చేశారు. ఓ సమయంలో తరచూ నోరుపారేసుకునే నేతలను మందలించారు. అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. బీజేపీతో సంబంధాలపై ఇకమీదట ఎవరూ ఇష్టం వచ్చినట్లు మాట్లాడవద్దని, ఆ పార్టీ నేతలను విమర్శించవద్దని చంద్రబాబునాయుడు తన పార్టీ నేతలను ఆదేశించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి ఏమీ ఇవ్వడం లేదని, దాని ప్రభావం తమ పార్టీపైనా పడుతున్నందున.. ఆ పార్టీతో తెగతెంపులు చేసుకోవడమే మంచిదన్న అభిప్రాయం వివిధ వర్గాల్లో ఉందని ఓ నాయకుడు చంద్రబాబు దృష్టికి తీసుకువచ్చారు. దానితో సీరియస్ అయిన చంద్రబాబు 'మీ కోరికలు పార్టీపై రుద్దకండి. ఒకవేళ నీ మాట ప్రకారం కేంద్రం నుంచి బయటకు వస్తే ఏమవుతుంది? ఆరోజుకు మీడియాలో బ్రహ్మాండంగా హైలెట్ అవుతుంది. నీ కడుపు ఉబ్బరం తగ్గుతుంది. నీ కోరిక నెరవేరుతుంది. ఆ తర్వాత స్టెప్ ఏమిటి? కేంద్రంలో మనకు దన్నుగా ఉన్న ప్రభుత్వం ఉంటేనే మనం ఇక్కడ ఏమైనా అభివృద్ధి కార్యక్రమాలు చేయగలం. అందుకే రాజకీయ పరిస్థితులు స్టడీ చేయమంటున్నా. వాళ్లు కొన్ని ఇస్తున్నారు. కొన్ని పెండింగ్‌లో ఉన్నాయి. అంతమాత్రం చేత నోరుపారేసుకోకూడదు. పోలవరంపై కొంచెం అటో ఇటో పనులు అవుతున్నాయంటే అది మన విధానం, లౌక్యం వల్లనే' అని సుదీర్ఘ వివరణ ఇచ్చారు. పోలవరంపై గతంలో ఉన్నన్ని సమస్యలు ఇప్పుడు లేవని, చర్చల ద్వారా దానిని ఓ కొలిక్కి తెచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. మనం బీజేపీతోనే ఉన్నామని, పొత్తుపై ఎవరు ప్రశ్నించినా.. అది రెండు పార్టీల జాతీయ నాయకత్వాలు చూసుకుంటాయని చెప్పాలన్నారు. రాజకీయాలు అధ్యయనం చేయకుండా మాట్లాడితే దెబ్బతింటామని శివసేనను ఉదహరించారు. మహారాష్ట్రలో శివసేనపార్టీ కేంద్రంలో ఉంటూ, వచ్చే ఎన్నికల్లో విడిగా పోటీ చేస్తామని చెప్పడం, కార్పొరేషన్ ఎన్నికల్లో పొత్తు పెట్టుకుని అసెంబ్లీ ఎన్నికల్లో విడిగా పోటీచేస్తామంటే ఎవరూ నమ్మరని ఉదహరించారు. కేంద్రం ఏమేమి ఇవ్వాలో, ఏమేమి ఇచ్చిందో, విభజన హామీలు చెప్పడంలో తప్పు లేదన్నారు. ఒకవేళ బీజేపీ నేతలు కొందరు సొంత అజెండాతో మాట్లాడినా వాటికి విలువ ఉండదన్నారు.

ముగ్గురూ ముగ్గురే!

అయితే అమరావతి... లేదంటే నియోజకవర్గాలకే పరిమితం


పితాని సత్యనారాయణ


పి మాణిక్యాలరావు


కేఎస్ జవహర్

ఆంధ్రభూమి బ్యూరో

ఏలూరు, జనవరి 31: రాజకీయంగా ఎంతో ప్రాధాన్యత కలిగిన పశ్చిమ గోదావరి జిల్లా నుండి రాష్ట్ర క్యాబినెట్‌లో ముగ్గురు మంత్రులున్నా వారికి వారుగా వ్యవహరిస్తూ, నిమిత్తమాత్రులుగా వ్యవహరిస్తున్నారనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. పొత్తులో భాగంగా బిజెపి నుంచి ఎన్నికైన పైడికొండల మాణిక్యాలరావుదేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రిగా, టిడిపి నుంచి పితాని సత్యనారాయణ కార్మిక శాఖ మంత్రిగా, కెఎస్ జవహర్ ఎక్సైజ్ శాఖ మంత్రిగా రాష్ట్ర కేబినెట్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరంతా వారి వారి నియోజకవర్గాలకు పరిమితం కావడం మినహా సంయుక్తంగా జిల్లాకు సాధిస్తున్న మేళ్లేమిటనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

రాజకీయపరంగా చూస్తే 2014 ఎన్నికల్లో జిల్లాలోని మొత్తం 15 అసెంబ్లీ స్థానాలూ టీడీపీ-బీజేపీ కూటమి గెల్చుకుంది. ఈ అంశాన్ని తరచూ ప్రస్తావిస్తూ తరచూ ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లాపై అవ్యాజమైన అభిమానం కురిపిస్తుంటారు. అందుకు తగినట్లుగానే కేబినెట్‌లో జిల్లా నుంచి ముగ్గురికి మంత్రి పదవులు లభించడంతో జిల్లాపై వరాల వర్షం కురుస్తుందని అందరూ భావించారు. కాని అలాంటి పరిస్థితి ఇప్పటివరకూ కన్పించలేదంటే అతిశయోక్తి కాదు. జిల్లాలో రాష్ట్రానికి జీవనాడిగా భావించే పోలవరం ప్రాజెక్టు శరవేగంగా నిర్మాణం అవుతుండటంతోపాటు అప్పట్లో అసెంబ్లీలో స్వయంగా ముఖ్యమంత్రి ప్రకటించిన పలు హామీలు అలాగే ఉన్నాయి. వీటిపై దృష్టిపెట్టి జిల్లా అభివృద్ధిలో క్రియాశీలకపాత్ర పోషించాల్సిన అమాత్యులు ఎవరికివారుగా ఉండిపోయారన్న విమర్శలు విన్పిస్తున్నాయి.

ముగ్గురు మంత్రులు అయితే అమరావతికి, లేదంటే వారి వారి నియోజకవర్గాలకు పరిమితం అయిపోతున్నారని విపక్షాలు విమర్శించే పరిస్థితి నెలకొనడం గమనార్హం. ఇప్పటివరకు ముగ్గురు మంత్రులు ఒక్క అధికారిక సమావేశంలోనూ సంయుక్తంగా పాల్గొన్న దాఖలాలు దాదాపుగా లేకపోవడం విశేషం.

ప్రధానంగా పొత్తులో భాగంగా తాడేపల్లిగూడెం నుంచి ఎన్నికైన మాణిక్యాలరావు దేవదాయశాఖ మంత్రిగా ఉన్నప్పటికీ ఆయన జిల్లాలోని మిగిలిన ప్రాంతాల్లో పెద్దగా పర్యటనలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించిన జాడలేదు. దీనికితోడు సొంత నియోజకవర్గంలో మిత్రపక్షం టీడీపీతో ఉన్న ఇంటిపోరుతోనే ఆయన సతమతమవుతున్నారనే వ్యాఖ్యలూ లేకపోలేదు. ఇక సీనియర్ మంత్రి పితాని సత్యనారాయణ కార్మికశాఖ అమాత్యులుగా కొనసాగుతున్నారు. సహజంగానే ఆయన జిల్లాకు సంబంధించి పూర్తిస్థాయి పట్టు కొనసాగిస్తారన్న ప్రచారం తొలినాళ్లలో సాగినా తొలినాళ్లలో జిల్లా కలెక్టరుపై కొన్ని వ్యాఖ్యలు చేయటం, ఆ తర్వాత ఒకటి, రెండు సమావేశాల్లో కూడా ఇదే తరహాలో వ్యాఖ్యానాలు విన్పించటం మినహా పరిపాలనాపరంగా ఆయన ప్రభావం అంతగా కనపడలేదనే చెప్పాలి. ఇక కొవ్వూరు ఎమ్మెల్యే, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కెఎస్ జవహర్ జూనియర్ అయినప్పటికీ కొంతవరకు తనదైన శైలిలో తిరుగుతూనే ఉన్నా ఆయన అధికభాగం అమరావతికి పరిమితం కావటం, ఉన్న కొద్దిసమయం నియోజకవర్గానికి పరిమితమవుతున్నారు. కీలకమైన దినోత్సవాలు, రాష్ట్ర కార్యక్రమాలు ఉన్నప్పుడు జిల్లా కేంద్రానికి రావటం చేస్తున్నారు. మొత్తంగా చూస్తే ముగ్గురు మంత్రులున్నా దాదాపుగా ఎవరికివారుగానే వ్యవహారం సాగిపోతోంది. గతంలో ఈస్థాయిలో మంత్రిపదవులు దక్కినప్పుడు జిల్లాలో కీలకమైన కార్యక్రమాలు ఉన్నప్పుడు ప్రతి దఫాలోనూ మంత్రులు ప్రత్యేక శ్రద్ధ చూపుతూ పెండింగ్‌లో పడుతున్న కార్యక్రమాలను ముందుకు తీసుకువెళ్లటంలో తమవంతు కృషిచేస్తుండేవారు.

ఈ విషయంలో కాంగ్రెస్ హయాంలో సీనియర్ నేత చేగొండి వెంకట హరిరామ జోగయ్య, తెలుగుదేశం హయాంలో దివంగత నేత కోటగిరి విద్యాధరరావు జిల్లాపై ఆధిపత్యం చెరగనిముద్ర వేశారనే చెప్పాలి. జిల్లా వ్యవహారాలను వీరు ఒంటిచేత్తో నడిపించేవారనడం అతిశయోక్తికాదు. కోటగిరికి సహచరులుగా అప్పట్లో మంత్రి ప్రాతినిధ్యం వహించిన కొత్తపల్లి సుబ్బారాయుడు, దండు శివరామరాజు సైతం అధికారిక సమావేశాల వేదికలను పంచుకుని, పథకాల తీరును సమీక్షించడం, అధికార్ల తీరును ఎండగట్టడం వంటి చర్యలు తీసుకునేవారు.ఇక వైఎస్సార్, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి కేబినెట్‌లోమంత్రిగా పనిచేసిన వట్టి వసంతకుమార్ కూడా తనకున్న అవగాహన, జిల్లాపై ఉన్న పట్టుతో పరిపాలనాపరంగా ఎన్నో కీలకమైన నిర్ణయాలు తీసుకోవటమే కాకుండా రాజకీయంగానూ తన హవాను కొనసాగించారు. అయితే అలాంటి పరిస్థితి ఇపుడు కన్పించకపోవటం విడ్డూరంగానే ఉంది. ప్రస్తుత మంత్రుల్లో సీనియర్‌గా పేరొందిన పితాని సత్యనారాయణ కాంగ్రెస్ ముఖ్యమంత్రుల హయాంలోనూ మంత్రిగా పనిచేసినా ప్రస్తుతం ఎందుకో స్తబ్దుగా ఉండిపోతున్నారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

సచివాలయమే ముందు!

వచ్చే ఏడాదికి శాఖాధిపతుల కార్యాలయాలు, ప్రభుత్వ ఆవాసాలు సిద్ధం ◆ నిడమానూరు వరకు బెంజ్‌సర్కిల్ ఫ్లైఓవర్
అమరావతిలో హ్యాపీ సిటీ సమ్మిట్ ◆ ఇన్నోవేషన్ వ్యాలీగా ఆంధ్రప్రదేశ్ ◆ తాత్కాలిక హైకోర్టు నిర్మాణానికి ఓకే ◆ సీఆర్‌డీఏ సమీక్షలో సీఎం


సీఆర్‌డీఏపై సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, జనవరి 31: రాజధానిలోని పాలనా నగరంలో తొలుత సచివాలయం, శాఖాధిపతుల కార్యాలయ భవనాలు, ప్రభుత్వ ఆవాసాలను త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురానున్నారు. పరిపాలన నగరంలో చేపట్టే అన్ని నిర్మాణాల్లో మొదటి ప్రాధాన్యంగా ఈ మూడు ప్రాజెక్టులను పూర్తిచేసి వచ్చే ఏడాదిలోనే వినియోగంలోకి తీసుకువస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అధికారులు తెలియజేశారు. సచివాలయంలో బుధవారం జరిగిన రాజధాని అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) సమావేశంలో రాజధానిలో చేపట్టిన రహదారులు, పరిపాలన నగర శాశ్వత భవంతుల నిర్మాణాలు తదితర అంశాలతో పాటు, మెరీనా, ఐటీ టవర్లు, హెల్త్ స్ట్రీట్, కంట్రీసైడ్ హోటళ్లు వంటి ఎకనమిక్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులపై సుదీర్ఘంగా చర్చించారు. అమరావతిలో వచ్చే ఏప్రిల్‌లో జరుగనున్న సంతోష నగరాల సదస్సు, 9 మాసాలలో పూర్తి చేయాల్సివున్న ఇంటిరిమ్ హైకోర్టు నిర్మాణ ప్రణాళికలు కూడా ఈ సమావేశంలో చర్చించి కొన్ని ముఖ్య నిర్ణయాలు తీసుకున్నారు. సచివాలయం, శాఖాధిపతుల భవంతుల నిర్మాణ ప్రణాళికలను నార్మన్ ఫోస్టర్ సంస్థ బుధవారం రాత్రిలోగా తమకు పంపుతున్నట్టు తెలియచేసిందని, వీటికి మార్చిలోగా టెండర్లను పిలిచి పనులు ప్రారంభిస్తున్నట్టు సీఆర్‌డీఏ కమిషనర్ చెరుకూరి శ్రీధర్ వివరించారు. హైకోర్టు భవంతి ఆకృతులు, నిర్మాణ ప్రణాళికలు ఫిబ్రవరి 4 లేదా 5వ తేదీలోగా రానున్నాయని తెలిపారు. శాసనసభ భవంతి ఆకృతులు మరో రెండు వారాలలో వస్తాయని చెప్పారు. వచ్చే అక్టోబర్ నాటికి ప్రభుత్వ ఆవాసాలు మొత్తం సిద్ధం కానున్నాయని సీఆర్‌డీఏ కమిషనర్ చెప్పారు. మొత్తం పది పదేశాలలో 69 టవర్ల నిర్మాణం శరవేగంగా సాగుతున్నట్టు తెలిపారు. శాసనసభ్యులు, అఖిల భారత సర్వీస్ అధికారులకు 18 టవర్లలో 144 ఫ్లాట్లు, ఎన్జీవోలకు 22 టవర్లలో 1968 ఫ్లాట్లు, టైప్ 1,2 అధికారులు, గ్రూప్ 'డి' ఉద్యోగులకు 21 టవర్లలో 1440 ఫ్లాట్లను నిర్మిస్తున్నామని తెలిపారు. వీటిన్నింటికీ రాఫ్ట్ స్లాబ్ పనులు పూర్తిఅయ్యాయని చెప్పారు. ప్రభుత్వం నిర్మించే రెసిడెన్షియల్ టవర్స్ అన్నింటిలో క్లబ్ హౌస్‌తో పాటు ఇన్ఫ్రాతంగా స్విమ్మింగ్ పూల్ కూడా ఉండాలని ముఖ్యమంత్రి చెప్పారు.

ఐటీ స్పేస్ కోసం 2 టవర్లు

అమరావతిలో ఐటీ కంపెనీల కోసం ఆఫీస్ స్పేస్ నిర్మాణాలను చేపట్టాలని సీఆర్‌డీఏ ప్రతిపాదనలను సిద్ధం చేసి ముఖ్యమంత్రి ముందుంచింది. ముందుగా సీఆర్‌డీఏ ఈ ప్రాజెక్టును చేపడుతుంది. తరువాత చేపట్టే నిర్మాణాలను అభివృద్ధిదారుకు అప్పగిస్తారు. ప్రభుత్వం రూపొందించిన ఐటీ పాలసీకి అనుగుణంగా వీటి నిర్మాణాన్ని చేపడుతున్నారు. తొలుత 10 లక్షల చదరపు అడుగుల మేర జంట భవంతుల నిర్మాణాన్ని చేపడతారు. ఐటీ టవర్లలో మొదటి దశ నిర్మాణాన్ని 12 మాసాలలో, రెండవ దశను 24 నెలల్లో పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. గ్రీన్ బిల్డింగ్ కాన్సెప్ట్‌తో వీటిని నిర్మించాలని ముఖ్యమంత్రి వారికి సూచించారు. సీఆర్‌డీఏ నిర్మిస్తున్న ఆఫీస్ స్పేస్‌ను విక్రయించడం ద్వారా చదరపు అడుగుకు రూ.3వేల వంతున ధర రావచ్చని అంచనా వేశారు. మొత్తం రూ.90.6 కోట్ల ఆదాయం సమకూరవచ్చునని భావిస్తున్నారు.

తాత్కాలిక హైకోర్టు భవనం


తాత్కాలిక హైకోర్టు భవంతి నిర్మాణ ప్రణాళికపై ఈ సమావేశంలో సీఆర్‌డీఏ అధికారులు ముఖ్యమంత్రికి వివరాలు అందించారు. 4 ఎకరాల విస్తీర్ణంలో హైకోర్టు తాత్కాలిక భవన నిర్మాణం జరగనున్నది. 1.8 లక్షల చదరపు అడుగులలో గ్రౌండ్ ఫ్లోర్ ఏరియా ఉంటుంది. జీ ప్లస్ 2 పద్ధతిలో భవన నిర్మాణాన్ని చేపడుతున్నారు. ప్రధాన న్యాయమూర్తి కోసం 2000 చదరపు అడుగులలో కోర్టు రూమ్, 1200 చదరపుఅడుగుల విస్తీర్ణంలో ఛాంబర్ నిర్మిస్తారు. మరో 1000 చదరపు అడుగుల కార్పెట్ ఏరియాతో 18 కోర్టు హాళ్ళు, 600 చదరపు అడుగుల చొప్పున న్యాయమూర్తుల ఛాంబర్లు ఉంటాయి. తాత్కాలిక హైకోర్టు భవన నిర్మాణానికి రూ.108 కోట్ల వ్యయం కాగలదని అంచనా వేశారు. 6 నుంచి 8 మాసాల వ్యవధిలో మొత్తం నిర్మాణం పూర్తి చేస్తామని సీఆర్‌డీఏ కమిషనర్ చెప్పారు.

అమరావతి నగర నిర్మాణం ఇక వేగం పుంజుకోవాలని ముఖ్యమంత్రి చెప్పారు. సీఆర్‌డీఏ పరిధిలో చిన్నచిన్న పనులకు కూడా కాలయాపన జరుగుతుందని, ఇక మీదట అలా జరగరాదని చెప్పారు. అమరావతిలోని నీరుకొండ గ్రామంలో ఉన్న ఎత్తైన కొండపై 108 అడుగుల ఎత్తున ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనపై అధికారులు ఈ సమావేశంలో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. 6 ఎకరాల విస్తీర్ణంలో అమరావతి మెరీనా ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను ముఖ్యమంత్రి పరిశీలించారు. బోట్లు, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, సెయిలింగ్ ట్రైనింగ్ సెంటర్, పవర్ బోటింగ్, ఫుడ్ కోర్టు, కన్వెన్షన్ సెంటర్ వంటి సదుపాయాలతో మెరీనా ఏర్పాటు చేస్తారు.

ఆలయాల మూసివేత







తిరుపతి, జనవరి 31: చంద్రగ్రహణం కారణంగా బుధవారం ఉదయం 11 గంటలకు శ్రీవారి ఆలయం తలుపులు మూసివేశారు. రాత్రి 9.30 గంటల తరువాత సంప్రోక్షణ అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించినట్లు టీటీడీ తిరుమల జేఈఓ శ్రీనివాసరాజు తెలిపారు. చంద్రగ్రహణం కారణంగా ఉదయం 11గంటలకు శ్రీవారి ఆలయం తలుపులు మూసివేశామన్నారు. రాత్రి 9.30 గంటలకు ఆలయ తలుపులు తెరచి శుద్ధి, పుణ్యాహవచనం, రాత్రి కైంకర్యాలు పూర్తయిన అనంతరం భక్తులకు సర్వదర్శనానికి అనుమతించామన్నారు. అన్నప్రసాదాల వితరణ లేని కారణంగా వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లలోకి భక్తులను అనుమతించలేదన్నారు. ఇదిలావుండగా చంద్రగ్రహణం సందర్భంగా శ్రీ కాళహస్తిలో భక్తుల రద్దీ పెరిగింది. చంద్రగ్రహణం సందర్భంగా రాష్ట్రంలోని అన్ని ఆలయాలు మూసివేస్తుండగా రాహు-కేతు క్షేత్రమైన శ్రీ కాళహస్తీశ్వరాలయంలో మాత్రం స్వామి దర్శనం యథావిధిగా కొనసాగడంతో భక్తుల రద్దీ పెరిగింది. గ్రహణం సందర్భంగా స్వామి,అమ్మవార్లను దర్శించుకుంటే మంచి జరుగుతుందని భక్తులు నమ్ముతారు. గ్రహణం సందర్భంగా ఎక్కువ మంది భక్తులు ఆలయానికి వచ్చారు. రాహు-కేతు పూజలు ఎక్కువగా చేయించుకున్నారు.

భద్రాద్రి, విజయవాడ దుర్గగుడి

విజయవాడ/భద్రాచలం: చంద్రగ్రహణం సందర్భంగా బుధవారం విజయవాడలోని కనకదుర్గ ఆలయం, భద్రాచలంలోని రామాలయాలను మూసివేశారు. ఉదయం సుమారు 10-30గంటలకు ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానాన్ని ఆలయాధికారులు మూసివేశారు. గ్రహణం సందర్భంగా ఆలయ ఈవో ఎం. పద్మ ఆదేశాల మేరకు ఆలయ అర్చకులు వేకువ జామునుంచే వివిధ రకాలైన ప్రత్యేక పూజలు, అర్చనలు, తదితర వాటిని నిర్వహించి తర్వాత ఆలయాన్ని మూసివేశారు. గురువారం వేకువ జామున ఆలయ స్థానాచార్యుడు విష్ణుభొట్ల శివప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవార్లకు సంప్రోక్షణ, స్నపనాభిషేకం, విశేష పూజలు, తదితర వాటిని నిర్వహించిన తర్వాత ఉదయం సుమారు 8-30 గంటలనుండి అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు. తెలంగాణలోని భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు ఆలయ అర్చకులు, సిబ్బంది ఆలయ తలుపులకు తాళం వేశారు. రాత్రి 9.15 గంటలకు గ్రహణం వీడనుండటంతో అనంతరం ఆలయ తలుపులు తెరిచి ఆలయ శుద్ధి, సంప్రోక్షణ నిర్వహించారు. గురువారం ఉదయం నుంచి భక్తులకు సాధారణ రీతిలో దర్శనం కల్పించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు.

ఫీజు చెల్లించలేక విద్యార్థిని ఆత్మహత్య

యాజమాన్యం వత్తిడి తట్టుకోలేక దారుణం

ఆంధ్రభూమి బ్యూరో

విశాఖపట్నం, జనవరి 31: ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం వత్తిడి, అకస్మాత్తుగా ఉపాధి కోల్పోయి వీధిన పడిన తండ్రి, ఆర్థిక ఇబ్బందులు ఓ విద్యార్థిని ఆత్మహత్యకు దారితీశాయి. విశాఖ నగరంలో జరిగిన ఈ సంఘటన అందరినీ కలిచివేసింది. స్థానిక లలితానగర్‌కు చెందిన గ్రంథి తేజశ్విని ఓ కార్పొరేట్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఆమె తండ్రి శ్రీనివాసరావు స్థానిక జీవీఎంసీ ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం వద్ద ఫుట్‌పాత్‌పై బట్టలు విక్రయిస్తుంటాడు. ఇతనికి హాకర్ లైసెన్స్ కూడా ఉంది. కొద్ది రోజుల కిందట ఫుట్‌పాత్ వ్యాపారులను అక్కడి నుంచి తొలగించాలని జీవీఎంసీ కమిషనర్ పోలీసులను ఆదేశించారు. పది రోజుల కిందట పోలీసులు అక్కడి వ్యాపారులను తొగించారు. దీంతో తేజశ్విని తండ్రి శ్రీనివాసరావు ఉపాధి కోల్పోయాడు. ఆయన వ్యాపారం చేసుకుంటూ కుమార్తెను చదివించుకుంటున్నాడు. సరిగ్గా ఫీజు చెల్లించాల్సిన సమయంలో శ్రీనివాసరావు ఉపాధి కోల్పోయాడు. తేజశ్వినికి ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి ప్రాక్టికల్స్ పరీక్షలు ఉన్నాయి. ఫీజు చెల్లిస్తే కానీ ప్రాక్టికల్స్‌కు హాజరుకానివ్వమని యాజమాన్యం తేజశ్వినిపై వత్తిడి తెస్తోంది. ఇదే విషయాన్ని తండ్రికి చెప్పాలని బుధవారం ఉదయం తేజశ్విని ప్రయత్నించింది. తండ్రి ఫోన్ లిఫ్ట్ చేయలేదు. ఇదే సమయంలో తల్లి ఇందుమతి ఆసుపత్రికి వెళ్లింది. దీంతో తీవ్ర వత్తిడికి గురైన తేజశ్విని తన పిన్నికి ఫోన్ చేసి, పరిస్థితి వివరించి, తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పి ఫోన్ పెట్టేసింది. కొద్ది క్షణాల్లోనే తేజశ్విని ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మాత్రం తేజశ్విని కేవలం అనారోగ్య సమస్యల వలన ఆత్మహత్య చేసుకుందని చెపుతున్నారు.

ఏపీకి నాలుగేళ్ల క్రితమే 'చంద్ర'గ్రహణం


తెలుగుదేశం ప్రభుత్వ తీరుపై వైఎస్ జగన్ ధ్వజం


పొదలకూరు మండల కేంద్రంలో బుధవారం జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతున్న జగన్

పొదలకూరు, జనవరి 31: రాష్ట్రానికి నాలుగేళ్ల క్రితమే చంద్రగ్రహణం పట్టిందని, నేడు పట్టిన గ్రహణం కొన్ని గంటల్లో తొలగిపోతుందని, రాష్ట్రాన్ని పట్టింది వీడేందుకు ఇంకా ఏడాది సమయం ఉందని వైఎస్ఆర్ కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు జగన్మోహనరెడ్డి పేర్కొన్నారు. బుధవారం నాడు పొదలకూరుకు వచ్చిన ఆయన స్థానిక పంచాయతీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ ఈ గ్రహణాన్ని వదిలించేందుకు యువత సైనికుల్లా సన్నద్ధం కావాల్సిన ఆవశ్యకత నెలకొందన్నారు. గత నాలుగేళ్లకాలంలో అవినీతి పెరిగిపోయిందని దుయ్యబట్టారు. చంద్రబాబు విదేశాలకు వెళ్తే ఆ సీటులో బాలకృష్ణ ఆశీనులవుతాడని విమర్శించారు. సాధారణ పూజలు జరగాల్సిన దుర్గమ్మ గుడిలో తాంత్రిక, మాంత్రిక పూజలు కూడా జరగడం శోచనీయమన్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలను చంద్రబాబు నిస్సిగ్గుగా కొనుగోలు చేస్తున్నారన్నారు. వారికి మంత్రి పదవులు కట్టబెడుతుండటం అమానుషమన్నారు. రాజ్యాంగాన్ని కాపాడాల్సిన చంద్రబాబు తూట్లు పొడుస్తుండటం శోచనీయమన్నారు. గోదావరి పుష్కరాల్లో చంద్రబాబు ప్రచార పిచ్చికి 29 మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన చెందారు. ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిన చంద్రబాబు తనపై అభియోగాల నుంచి ప్రజలను మళ్లించేందుకు ప్రత్యేక హోదాను కేంద్రానికి తాకట్టు పెట్టారని దుయ్యబట్టారు. చంద్రబాబు ఉద్యోగులకు ఐదువేల కోట్ల రూపాయల వరకు బకాయి ఉన్నాడన్నారు. రెండు డిఏలు కూడా ఇవ్వాల్సి ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ గెలిచేందుకు చంద్రబాబు ప్రతి ఇంటికీ కిలో బంగారం ఇస్తామని ప్రకటించినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదన్నారు. గత ఎన్నికల్లో జాబు రావాలంటే బాబు రావాలని ఊదరగొట్టారన్నారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో జాబు ఉండాలంటే బాబు పోవాల్సిన అవసరం ఉందన్నారు. కండలేరు ఎడమగట్టుకాలువపై శాశ్వత ఎత్తిపోతల పథకం మంజూరుకు దివంగత సిఎం వైఎస్ రాజశేఖరరెడ్డి శ్రీకారం చుట్టారన్నారు.

మూడు చోట్ల కుటుంబ వినోద కేంద్రాలు

కాకినాడ, చీరాల ఓడరేవుల వద్ద రిసార్ట్‌లు ◆ పర్యాటక శాఖ ప్రతిపాదనలు ◆ ఆర్థిక మంత్రి యనమల సమీక్ష


అధికారులతో సమీక్షిస్తున్న ఆర్థికమంత్రి యనమల , టూరిజం మంత్రి అఖిలప్రియ

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 31: విశాఖపట్నం, విజయవాడ, తిరుపతిలలో భారీస్థాయి కుటుంబ వినోద కేంద్రాల (ఎఫ్‌ఈసీ) ఏర్పాటును పర్యాటక శాఖ అధికారులు ప్రతిపాదించారు. సచివాలయం ఆర్థిక శాఖ సమావేశ మందిరంలో బుధవారం ఉదయం ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు అధ్యక్షతన పట్టణాభివృద్ధి విధానాల సంస్కరణపై మంత్రిమండలి ఉప సంఘం సమావేశం, పర్యాటక శాఖ అభివృద్ధిపై సమీక్షా సమావేశం జరిగాయి. ఈ సందర్భంగా విశాఖపట్నం, విజయవాడ, తిరుపతిలలో ప్రతిపాదించిన మూడు ఎఫ్‌ఈసీలు కాకినాడలో రిసార్ట్, ప్రకాశం జిల్లా చీరాలలోని ఓడరేవు సమీపంలో రిసార్ట్ గురించి పర్యాటక శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా వివరించారు. విశాఖ ఎఫ్‌ఈసీలో ఒక ఐమాక్స్ థియేటర్ 8 వెండితెరల మల్టీప్లెక్స్, రెండు వేల సీట్ల సామర్థ్యం గల ఒక కాన్ఫరెన్స్ హాల్, 50 వేల అడుగుల వాణిజ్య స్థలం, త్రీస్టార్ హోటల్ ఉంటాయని తెలిపారు. విజయవాడలోని ఎఫ్‌ఈసీలో ఒక ఐమాక్స్ థియేటర్, 6 వెండితెరల మల్టీప్లెక్స్, రెండు వేల సీట్ల సామర్థ్యం గల ఎంఐసీఈ, 80 వేల అడుగుల వాణిజ్య స్థలం, త్రీస్టార్ హోటల్ ఉంటాయని వివరించారు. కాకినాడలో మొత్తం పది ఎకరాల స్థలంలో ఓ రిసార్ట్ ఏర్పాటు చేసి అక్కడ వినోద కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ మొత్తం ప్రాజెక్టులకు వంద నుంచి 150 కోట్ల రూపాయలు పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. పర్యాటక శాఖకు సంబంధించి మూడు కేటగిరీలుగా విభజించిన 9 అంశాలను పర్యాటక శాఖ కమిషనర్ హిమాన్షు శుక్లా వివరించారు.ఈ సందర్భంగా మంత్రి రామకృష్ణుడు మాట్లాడుతూ ఏ ప్రాజెక్టులైనా నిర్ణయించిన సమయానికి పూర్తి కాకపోతే వారికి ఇచ్చిన భూములను తప్పనిసరిగా వెనక్కు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గిరిజన ప్రాంతంలో ఏవైనా ప్రాజెక్టులు గిరిజనేతరులు చేపట్టడానికి నిబంధనలు అనుమతించనందు వల్ల ప్రభుత్వం ఆధ్వర్యంలో సొసైటీలు ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని చెప్పారు. ఏపీ టూరిజం బోర్డు ఏర్పాటు, మహేంద్ర సంస్థకు శ్రీకాకుళంలో స్థలం కేటాయింపు, తూర్పుగోదావరి జిల్లా మారేడుమిల్లిలో పర్యాటక ప్రాజెక్ట్, అక్కడి ఐల్యాండ్, పలు పర్యాటక ప్రాజెక్టులు, ఏపీటీడీసీ ప్రాజెక్టులు, అరవపల్లి, కుప్పం, తొట్లకొండ, ఎర్రకాలువ భూముల కేటాయింపు తదితర పలు అంశాలను చర్చించారు.

హరీష్ ఆత్మహత్యతో ప్రజల్లో పెల్లుబికిన ఆగ్రహం

పలాస, జనవరి 31: ఇప్పటి వరకూ ఎంతో ప్రశాంతంగా ఉన్న శ్రీకాకుళం జిల్లా పలాస, కాశీబుగ్గ జంట పట్టణాలు ఇప్పుడు అట్టుడికిపోతున్నాయి. రెండురోజుల కిందట జరిగిన ఒక సంఘటనలో స్వీట్ షాప్‌లో పని చేసే కుర్రాడు ఊహించని రీతిలో ఆత్మహత్య చేసుకున్నాడు. అధికార పార్టీకి చెందిన ఒక కౌన్సిలర్ అకారణంగా స్వీట్ షాప్‌లో పని చేసే హరీష్‌ను చితక బాదడంతో అతడు మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రజల్లో ఆగ్రహం పెల్లుబికుంది. బుధవారం పోలీసులు జంట పట్టణాలను దిగ్బంధం చేశారు. ఘటద ఈ ప్రాంతంలో తీవ్ర సంచలనం రేకెత్తడంతో ప్రజల స్పందన చూసి పోలీసులు కూడా ఒక అడుగు వెనక్కి వేయాల్సిన పరిస్థితి నెలకొంది.

అమెరికాలో మచిలీపట్నం యువకుడి అనుమానాస్పద మృతి


చైతన్య (ఫైల్‌ఫోటో)

ఆంధ్రభూమి బ్యూరో

మచిలీపట్నం, జనవరి 31: కృష్ణా జిల్లా మచిలీపట్నంకు చెందిన యువకుడు అమెరికాలో అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మచిలీపట్నం పురపాలక సంఘంలో పనిచేస్తున్న ఉద్యోగి బొమ్మల రామ్మోహనరావు కుమారుడు చైతన్య ఎంఎస్ చదివేందుకు రెండేళ్ల క్రితం అమెరికా వెళ్లాడు. ఎంఎస్ పూర్తి చేసి ఉద్యోగాన్వేషణలో ఉన్న చైతన్య ఫ్లోరిడా రాష్ట్రంలో తన స్నేహితులతో కలిసి ఒక రూమ్‌లో ఉంటున్నాడు. ఈ నెల 30వతేదీ సుమారు రాత్రి 10గంటల సమయంలో (భారత కాలమానం ప్రకారం 31వతేదీ ఉదయం 10గంటలు) సమయంలో మయామి బీచ్‌లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందివున్నాడు. విషయం తెలుసుకున్న బంధువులు దుఖ సాగరంలో మునిగిపోయారు. చైతన్య మృతికి కారణాలు ఇంకా తెలియరాలేదు.

ఆంధ్రభూమి
జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ
గురువారం, 1 ఫిబ్రవరి 2018

రక్షకులపై కక్ష..

జమ్ముకశ్మీర్ ప్రభుత్వం విచిత్రమైన న్యాయ ప్రక్రియను ఆరంభించడం ద్వారా భారత జాతీయ రాజ్యాంగ వ్యవస్థను వెక్కిరించింది, కేంద్రప్రభుత్వ సార్వభౌమ అధికారాన్ని ధిక్కరించింది. విధి నిర్వహణలో కాల్పులు జరిపిన సైనికులపై 'నేరారోపణ పత్రం' - ఎఫ్ఐఆర్ - దాఖలు చేయడం ఈ విచిత్రమైన న్యాయప్రక్రియ. ఈ 'న్యాయప్రక్రియ'ను ఆరంభించడం ద్వారా జమ్ముకశ్మీర్ ప్రభుత్వం తాను స్వయంగా నేరప్రక్రియకు పాల్పడినట్టయింది! తమకు లేని అధికారాలను రాష్ట్ర ప్రభుత్వం చెలాయించడానికి పూనుకొనడం చట్ట వ్యతిరేకం, రాజ్యాంగస్ఫూర్తికి విరుద్ధం.. భారతీయ రక్షణ బలాలు కేంద్రప్రభుత్వం అధికార పరిధిలో పనిచేస్తున్నాయి. అందువల్ల విధి నిర్వహణలో సైనికులు తప్పులు చేసినట్టయితే చర్య తీసుకోవలసింది కేంద్రం మాత్రమే! విధి నిర్వహణలోకాక వ్యక్తిగత కార్యకలాపాల సందర్భంగా సెలవులో ఉన్న సైనికులు నేరాలు చేసినట్టయితే రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవచ్చు, ఈ చర్యలను గురించి కేంద్రప్రభుత్వానికి నివేదించాలి! విధి నిర్వహణలో ఉన్న సైనికులు నేరానికి పాల్పడినట్టు ఆరోపణలు వచ్చినట్టయితే వాటిని విచారించవలసింది సైనిక న్యాయస్థానం - కోర్ట్ మార్షల్ -, కేంద్రప్రభుత్వం, ఉన్నత సర్వోన్నత న్యాయస్థానాలు! అంతేకాని విధి నిర్వహణలో ఉన్న సైనికులు హత్య చేసినట్టు, హత్య చేయడానికి యత్నించినట్టు రాష్ట్ర పోలీసు విభాగాలు 'ఎఫ్ఐఆర్' రూపొందించడం అభ్యంతరకర చర్య. ఈ చర్యకు జమ్ముకశ్మీర్ ప్రభుత్వం ఇప్పుడు ఒడిగట్టింది. జమ్ముకశ్మీర్‌లో సైనిక దళాల ప్రత్యేక అధికారాల చట్టం - ఆర్మ్‌డ్ ఫోర్సెస్ స్పెషల్ పవర్స్ యాక్ట్ - ఏఎఫ్ఎస్‌పిఎ - అమలులో ఉంది. బీభత్సకారులతోను, దేశవిద్రోహులతోను, అక్రమంగా మనదేశపు సరిహద్దులను దాటి చొరబడే సాయుధులతోను, తమపై దాడులకు పాల్పడేవారితోను తలపడే సమయంలో సైనికదళాలవారు కాల్పులను జరపక తప్పదు. దాడి చేసేవారు తమను హత్య చేయకుండా రక్షించుకునేందుకు ఎదురు దాడులు చేసే హక్కు సామాన్య ప్రజలకు కూడా ఉంది! అయితే ఇలా ఎదురుకాల్పులు జరిపే హక్కు సైనిక దళాలకు లేదని జమ్ముకశ్మీర్ ప్రభుత్వం భావించడం అంతుపట్టని వ్యవహారం. సైనిక వాహనాలను నిరోధించి సైనికులపై రాళ్లు రువ్విన విద్రోహులు ఒక సైనిక అధికారిని హత్య చేయడానికి యత్నించారు. జనవరి 27వ తేదీన జరిగిన ఈ 'రాళ్లదాడి' ఘటనలో ఏడుగురు జవానులు గాయపడ్డారు. రాళ్లు రువ్విన బీభత్సమూకలను నిరోధించడానికి సైనికులు జరిపిన కాల్పులలో ఇద్దరు దుండగులు హతులయ్యారట! ఇలాంటి ఘటనలు ఏళ్ల తరబడి జరుగుతూనే ఉన్నాయి. కానీ ఇప్పుడు కాల్పులు జరిపిన సైనిక అధికారికి సైనికులకు వ్యతిరేకంగా జమ్ముకశ్మీర్ ప్రభుత్వం హత్యాభియోగాన్ని నమోదు చేసింది. ఈ అభియోగాన్ని న్యాయస్థానాలు విచారణకు స్వీకరిస్తాయా అన్నది వేచిచూడదగిన అంశం..

దక్షిణ కశ్మీర్‌లోని 'సోఫియా'లోని గణపురా చౌక్ గుండా వెడుతుండిన సైనికదళాల వాహనశ్రేణిని కొన్ని మూకలు అటకాయించి రాళ్ల వర్షం కురిపించినట్టు రక్షణ మంత్రిత్వశాఖ వెల్లడించింది! ఆ తరువాత సైనికులు కాల్పులు జరుపవలసి వచ్చింది. ఈ మొత్తం వ్యవహారంపై స్థానిక 'డివిజనల్ మాజిస్ట్రేట్' విచారణకు ఆదేశించాడట! విచారణ పూర్తికావడానికి ఇరవై రోజులు పట్టవచ్చు. విచారణ నివేదికలో సైనికులు దోషులని నిర్ధారణ జరిగితే ఆ నివేదిక ఆధారంగా కేంద్రప్రభుత్వం చర్య తీసుకోవాలి, రాష్ట్ర ప్రభుత్వం చర్య తీసుకోజాలదు. కానీ 'నివేదిక' కోసం వేచి ఉండకుండా జమ్ముకశ్మీర్ పోలీసులు సైనికులపై నేరాలను నమోదు చేయడం కేంద్రప్రభుత్వ అధికార పరిధిలోనికి రాష్ట్ర ప్రభుత్వం చొరబడడం. విచారణలో సైనికులది తప్పులేదని ధ్రువపడితే వారిపై ఎలాంటి అభియోగాన్నికానీ నమోదు చేయడానికి వీలులేదు. వ్యవస్థాబద్ధమైన ఈ ప్రక్రియను జమ్ముకశ్మీర్ ప్రభుత్వం ఉల్లంఘించడానికి కారణం సైనికదళాలపట్ల అధికార 'పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ' వారికి దశాబ్దులుగా ఏర్పడి ఉన్న వ్యతిరేకత! 'పీడీపీ'తో కలసి జమ్ముకశ్మీర్ ప్రభుత్వాన్ని నిర్వహిస్తున్న 'భారతీయ జనతా పార్టీ' మాత్రం 'సోఫియా' ఘటనలో సైనికులు ఎలాంటి తప్పు చేయలేదని స్పష్టం చేసింది.

భారతీయ జనతా పార్టీకి చెందిన రవీంద్ర రయినా అన్న శాసనసభ్యుడు 'డివిజనల్ మాజిస్ట్రేట్' - సబ్ కలెక్టర్ - విచారణకు ఆదేశించడం కూడా సరికాదని, చట్ట విరుద్ధమని అభిప్రాయపడ్డాడు. 'ఏఎఫ్ఎస్‌పిఏ' ప్రకారం కశ్మీర్‌లో విధులను నిర్వహిస్తున్న సైనికులకు 'న్యాయరక్షణ' లభిస్తోంది. అందువల్ల సైనిక వ్యతిరేక విచారణకు ఆదేశించడం ఈ చట్టంలోని నిబంధనలకు వ్యతిరేకమన్నది రవీంద్రరయినా చెప్పిన మాట! ఈ చట్టంలోని నిబంధనలు జమ్మూకశ్మీర్ ప్రభుత్వానికి తెలుసు, ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీకి తెలుసు. అయినప్పటికీ ఆమె సబ్‌కలెక్టర్ స్థాయి అధికారితో విచారణ జరిపించాలని నిర్ణయించడం స్థానిక 'మూకల'ను అక్రమంగా సంతృప్తిపరచడానికి జరుగుతున్న ప్రయత్నం. సైనిక దళాలపై రాళ్లను రువ్వుతున్నవారు పాకిస్తాన్ ప్రభుత్వ ప్రేరిత బీభత్సకారులు. ఈ రాళ్లురువ్విన వారిపై కఠిన చర్యలు తీసుకోవలసిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పదేపదే వారిని క్షమించి వదిలివేస్తుండడం వల్ల వారి చేతులకు కొత్త రాళ్లు లభిస్తున్నాయి. పాకిస్తాన్ నుంచి 'హురియత్', విచ్ఛిన్న జిహాదీ ముఠాలకు నిధులు లభిస్తున్నాయి. ఈ నిధులతో కిరాయి మూకలను సైనిక దళాలపైకి ఉసిగొల్పుతున్నారు. ఈ ''యువజనుల''కు సైనికులపై రాళ్లు విసరడం 'వృత్తి'గా మారింది. కేంద్రప్రభుత్వం గత ఏడాదికిపైగా ఈ నిధుల రాకను అరికట్టడానికి చర్యలు తీసుకొంది! ''నిధులు' అందుకుంటున్న 'హురియత్' ముఠాల ''పెద్దల''కు వ్యతిరేకంగా అభియోగాలు నమోదయ్యాయి. న్యాయప్రక్రియ కొనసాగుతోంది! పాకిస్తాన్ నుంచి 'నిధుల' రాక తగ్గిందని అందువల్ల సైనికులపై రాళ్లు విసురుతున్న మూకల సంఖ్య కూడా తగ్గిందని ప్రచారం జరిగింది! కానీ రాళ్లు రువ్వుతున్నవారు యాథావిధిగా బీభత్స ''విధుల''కు హాజరవుతున్నారని సోఫియా ఘటనవల్ల స్పష్టమైంది!

దేశ సరిహద్దులను రక్షిస్తున్న సైనికులపట్ల వ్యతిరేకత, రాళ్లురువ్వుతున్న పాకిస్తానీ తొత్తులపట్ల వాత్సల్యం పెరుగుతుండడం కశ్మీర్ లోయలో నెలకొని ఉన్న వైపరీత్యం! కేంద్రప్రభుత్వం కూడా రాళ్లు రువ్విన వారిని జైళ్లనుంచి విడుదల చేయడం, వారికి పునరావాసం, ప్రత్యామ్నాయ ఉపాధి కల్పిస్తోంది. గతంలో మన్‌మోహన్‌సింగ్ ప్రభుత్వం ప్రకటించిన 'అష్టసూత్ర' పరిష్కారంలో భాగంగా అనేకమందిని జైళ్లనుంచి విడుదల చేశారు. గత నవంబర్‌లో 4327మంది 'రాళ్ల' దుండగులను మళ్లీ జైళ్లనుంచి విడుదల చేశారు. ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థిక సహాయంతో తెగ తిని బలిసిన ఈ దుండగులు మళ్లీమళ్లీ రాళ్లు రువ్వుతూనే ఉన్నారు. సైనికులను గాయపరుస్తున్నారు. హత్య చేస్తున్నారు. పట్టుబడితే మళ్లీ ప్రభుత్వం క్షమించి వదిలిపెట్టగలదన్నది ఈ రాళ్లురువ్వుతున్నవారి ధీమా..

'గంగ' నుంచి 'మాతృగంగ' వరకు..

విశ్లేషణ

ఆగ్నేయ ఆసియా దేశాలతో మన దేశం జనవరి ఇరవై ఐదవ తేదీన జరిపిన శిఖరాగ్ర మహాసభ చరిత్ర పునరావృత్తికి సరికొత్త సాక్ష్యం! ఆగ్నేయ ఆసియా దేశాలలో భారతీయ సంస్కృతి ప్రభావం విస్తరించడం సహస్రాబ్దుల చరిత్ర.. ఈ చరిత్ర శతాబ్దులపాటు గ్రహణగ్రస్తం కావడానికి కారణం మన సరిహద్దులకు పడమటి నుంచి దాడి చేసిన బీభత్స బర్బర మూకలతో మనం సంఘర్షణ జరుపవలసి రావడం! క్రీస్తుశకం పూర్వం పదునాలుగవ శతాబ్ది- కలియుగం పద్దెనిమిదవ శతాబ్ది- యవన, శక, గ్రీసు, హూణ జాతులు, కలియుగం 3813- క్రీస్తుశకం 712 -వ సంవత్సరం నుంచి అరబ్బీ, తురుష్క, మొఘలాయి, ఐరోపా జాతులవారు జరిపిన భయంకర హత్యాకాండను దమనకాండను ప్రతిఘటించడంలో మన దేశం నిమగ్నమైంది! భారత సమ్రాట్ పుష్యమిత్రుడు యవన దురాక్రమణను నిరోధించడంతో ఈ ప్రతిఘటన మొదలైంది, మహాత్మాగాంధీ వరకు నేతాజీ సుభాష్ చంద్రవసు- బోసు - వరకు కొనసాగింది. ఇలా మన దృష్టి మొత్తం 'పడమటి' దురాక్రమణ వైపు కేంద్రీకృతమై ఉండిన సమయంలో ఆగ్నేయ ఆసియా దేశాలు రాజకీయంగా మన దేశానికి దూరంగా జరిగాయి. కానీ సాంస్కృతికంగా ఆగ్నేయ ఆసియా దేశాల ప్రజలు మన దేశ ప్రజలతో సమాన భూమికపై విలసిల్లగలగడం 1947 వరకు కొనసాగిన చరిత్ర! గౌతమబుద్ధుడు కలియుగం 1215- క్రీస్తుశకం పూర్వం 1887వ సంవత్సరంలో జన్మించాడు! ఈ దివ్యాంశ సంభూతుడు క్రీస్తునకు పూర్వం ఆరవ శతాబ్ది - కలియుగం ఇరవై ఆరవ శతాబ్ది -లో జన్మించాడని బ్రిటన్, ఐరోపా చరిత్రకారులు అబద్ధాలను ప్రచారం చేయడం వేరే వైపరీత్యం... **బుద్ధునికి పూర్వం, బుద్ధుని తరువాత దాదాపు రెండు వేల ఏళ్ల వరకు ఆగ్నేయ ఆసియా దేశాలలో వేదమతాలు విలసిల్లాయి. ఆ తరువాత మన దేశం నుంచి బౌద్ధమతం విస్తరించింది.** తరువాతి కాలంలో 'ఇండోనేసియా'- యవ, బాలి, సుమిత్ర వంటి ద్వీపాల సమూహం వంటి దేశాలలో ఇస్లాం, ఫిలిప్పీన్స్ వంటి చోట్ల క్రైస్తవం ప్రధాన మతాలయ్యాయి! హైందవ సంస్కృతి మాత్రం అధికాధిక ఆగ్నేయ ఆసియా దేశాలలో చెక్కు చెదరలేదు! మతం బౌద్ధం.. సంస్కృతి హైందవం! మతం ఇస్లాం, సంస్కృతి హైందవం! మతం క్రైస్తవం, సంస్కృతి హిందుత్వం- ఇదీ ఆగ్నేయ ఆసియా దేశాల జన జీవనం.. మన దేశానికీ ఆగ్నేయ ఆసియా దేశాలకూ మధ్య గల సాంస్కృతిక సమానత్వం ఇదీ!

ఆగ్నేయ ఆసియా దేశాలతో మన దేశం జరిపిన శిఖర సమావేశంలో మన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన ప్రసంగంలోని ప్రధాన అంశం ఇదీ.. భాషా మత వాణిజ్య రాజ్యాంగ వ్యవస్థలకు, సార్వభౌమ దేశాల సరిహద్దులకు అతీతంగా ఈ మన దేశానికీ ఆగ్నేయ ఆసియా దేశాలకూ మధ్య ఈ సమాన సాంస్కృతిక తత్త్వం విస్తరించి ఉందన్నది నరేంద్ర మోదీ ధ్వనింపజేసిన చారిత్రక వాస్తవం! **బౌద్ధం, రామాయణం, మహాభారతం, పంచభూతాలను పవిత్ర తత్త్వాలుగా భావించడం మన దేశంలోను ఆగ్నేయ ఆసియా దేశాలలోను సమానం!** మన విదేశ వ్యవహారాల మంత్రి సుషమా స్వరాజ్ ఈ సత్యాన్ని 'శిఖర సభల' సందర్భంగా పునరుద్ఘాటించింది, ధ్వనింపజేసింది! ప్రపంచంలోని అతి పెద్ద హైందవ సాంస్కృతిక మందిరం అంగ్‌కార్‌వట్ - అంకురవటం- కంబోడియాలో ఉంది! సహస్రాబ్దులకు పూర్వం 'కౌండిన్యుడు' అన్న వేదపండిత యువకుడు 'కాంభోజ'కు సాంస్కృతిక యాత్ర చేయడం చరిత్ర. 'కాంభోజ', 'కంపూచియా', 'కంబోడియా' అన్నవి పరిణామక్రమంలోని పేర్లు! కలియుగం ముప్పయి మూడవ శతాబ్ది- క్రీ.శ. పన్నెండవ శతాబ్ది- నాటి క్షీర -క్షిమేర్- కుమేర్- వంశం రాజు రెండవ సూర్యవర్మ, ఏడవ జయవర్మ దశాబ్దుల తరబడి శ్రమించారు, 'అంగ్‌కార్‌వట్'ను నిర్మించారు. పదిహేను వందల యాభయి మీటర్ల పొడవు, పదునాలుగు వందల మీటర్ల వెడల్పు ఉన్న ఈ ఆలయ వాటికలో ప్రధానమైనది విష్ణుదేవుని మందిరం! కలియుగం ముప్పయవ శతాబ్ది నుంచి ముప్పయి ఆరవ శతాబ్ది వరకు 'అంగ్‌కార్' నగరం కంబోడియా రాజధాని కూడా! క్రీస్తుశకం 1863వ సంవత్సరం నుంచి 'ఫ్రాన్స్' దురాక్రమణకు గురి అయిన కంబోడియా 1954లో మళ్లీ విముక్తమైంది. 1975 నుంచి 1991 వరకు వివిధ వర్గాల కమ్యూనిస్టుల పాలనలో మగ్గిన కంబోడియా కనీవినీ ఎరుగని భయంకర బీభత్సకాండకు బలైంది. కమ్యూనిస్టుల నిరంకుశ దమనకాండ **1975 - 1979వ సంవత్సరాల మధ్య పదిహేను లక్షలమంది కంబోడియా ప్రజలను హత్య చేయడం చెరగని భయానక స్మృతి!** ఈ హత్యాకాండకు ఆధ్వర్యం వహించిన 'పోల్‌పాట్' అన్న కమ్యూనిస్టు నియంత నరరూప పిశాచంగా చరిత్రకెక్కాడు! ఆగ్నేయ ఆసియా దేశాలు యాభయి ఏళ్ల క్రితం సమాఖ్యగా ఏర్పడడానికి ప్రధాన కారణం 'కమ్యూనిస్టు' నియంతృత్వ వ్యవస్థలు ఏర్పడకుండా నిరోధించడం.. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం..

ఈ లక్ష్యంతో 'ఆగ్నేయ ఆసియా దేశాల సమాఖ్య'- అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఈస్ట్ ఆసియన్ నేషన్స్ - 'ఆసియాన్' - ఏర్పడినపుడు కంబోడియా ఈ సమాఖ్యలో చేరలేదు. 'ఇండోనేసియా, సింగపూర్, మలేసియా, థాయ్‌లాండ్, ఫిలిప్పీన్స్' దేశాలు 1967 ఆగస్టు ఎనిమిదవ తేదీన ఈ సమాఖ్యను ఏర్పాటుచేశాయి. 1975లో కమ్యూనిస్టు కబంధ బంధంలో చిక్కిన కంబోడియాలో 1991లో ప్రజాస్వామ్య వ్యవస్థ పునఃప్రారంభమైంది. 1999లో 'కంబోడియా' 'ఆసియాన్'లో చేరింది! థాయ్‌లాండ్ - సయామ్ రాజధాని బ్యాంగ్‌కాక్‌లో జరిగిన సమావేశంలో 'ఆసియాన్' ఏర్పడడంవల్ల ఈ సమాఖ్యకు 'బ్యాంగ్‌కాక్ సంఘటన' అన్నది పర్యాయపదం! బ్రూనీ, బర్మా- మ్యాన్మార్- లావోస్, వియత్నాంల చేరికతో 'ఆసియాన్' పది దేశాల వాణిజ్య ఆర్థిక సంఘటనగా మారింది! **ఈ ఆర్థిక సంఘటన సమగ్రరూపం ధరించేనాటికి చైనాలో కమ్యూనిస్టు నియంతృత్వం అంతరించి 'కాపిటలిస్ట్' - పెట్టుబడిదారీ నియంతృత్వ వ్యవస్థగా ఏర్పడింది!** 'ప్రపంచీకరణ' నడికొన్న తరువాత చైనా అతి పెద్ద పెట్టుబడిదారుడుగా ఏర్పడడం, స్వేచ్ఛావాణిజ్య మార్కెట్ ఎకానమీ పరిణామక్రమం! 'ఆసియాన్' దేశాలపై చైనా తన ఉక్కుపిడికిలి బిగించి ఉంచడానికి ప్రపంచీకరణ మరో ప్రధాన కారణం! ఆసియాన్ దేశాలతో మన వాణిజ్య రాజకీయ దౌత్య సంబంధాల పునరుద్ధరణ జరుగకుండా పదిహేను ఏళ్ల క్రితం వరకు చైనా నిరోధించగలిగింది. 1947 తరువాత దశాబ్దుల తరబడి మన ప్రభుత్వం తూర్పు వైపు తొంగి చూడకపోవడం సమాంతర విపరిణామం! అందువల్లనే చైనా ఆగ్నేయ ఆసియాలోకి చొరబడి చొచ్చుకొని రాగలిగింది. బ్రిటన్ వ్యతిరేక సాయుధ స్వాతంత్ర్య సమరం జరిపిన నేతాజీ సుభాష్ చంద్రవసు బర్మా నుంచి జపాన్ వరకు ప్రాంతాలను వ్యూహాత్మకంగా అనుసంధానం చేయగలిగాడు! మన దేశానికి ఈ ప్రాంతాలలోను అతి ప్రాచీన రాజకీయ సంబంధాలకు అది మొదటి పునరుద్ధరణ. 1992లో 'భారత - ఆసియాన్ భాగస్వామి కూటమి' ఏర్పడడం రెండవ పునరుద్ధరణ! 'ఆసియాన్' భారత్ భాగస్వామ్యానికి పాతికేళ్లు నిండిన సందర్భంగా ఇప్పుడు ఢిల్లీలో ఈ శిఖర సభ జరిగింది. ఈ పది దేశాల ప్రభుత్వ అధినేతలు మన గణతంత్ర దినోత్సవానికి అతిథులుగా హాజరుకావడం అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించిన అపూర్వ పరిణామం.. **ఒక దేశపు రాజ్యాంగ దినోత్సవానికి, వార్షికోత్సవానికి పది విదేశాల ప్రభుత్వాధినేతలు హాజరు కావడం ప్రపంచంలో బహుశా ఇది మొదటిసారి. అందువల్ల అంతర్జాతీయ సమాజం అత్యంత కుతూహలంతో తిలకించింది. చైనా నియంతలు మరింత ఆదుర్దాతో గుడ్లు మిటకరించారు.**

ఆసియాన్‌తో మన బంధం 1992లో మళ్లీ దృఢపడినప్పటికీ ఆసియాన్ దేశాలలో చైనా వాణిజ్య ఆధిపత్యం కొనసాగుతూనే వుంది. వ్యూహాత్మక ఆధిపత్యం కూడా కొనసాగిన రోజులలో చైనా ఆసియాన్ దేశాలకూ మనకు మధ్య వైరుధ్యాలను సృష్టించింది. 1998లో మనం అణ్వస్త్ర పాటవ పరీక్షలు జరిపిన తరువాత ఆగ్నేయ ఆసియా దేశాలలో చైనా మన దేశాన్ని దుమ్మెత్తిపోసింది. భారతదేశం తయారుచేస్తున్న అణ్వస్త్రాలవల్ల ఆగ్నేయ ఆసియా ప్రాంతానికి ప్రమాదం ఏర్పడనున్నట్టు కొన్ని దేశాలను చైనా నమ్మించగలిగింది. 'భారత్ - ఆసియాన్' వాణిజ్య భాగస్వామ్యం కొన్నేళ్లు కొడిగట్టడానికి ఇది కూడా కారణం! ఇప్పటికీ వాణిజ్య రంగంలో చైనాదే ఆధిపత్యం- ఆసియాన్‌తో మన వాణిజ్యం విలువ దాదాపు ఐదు లక్షల కోట్ల రూపాయలు. 2020 నాటికి ఈ వాణిజ్యం ఆరు లక్షల యాబయి వేల కోట్లకు చేరగలదట! కానీ ఇప్పటికే ఆసియాన్‌లో చైనా వాణిజ్యం విలువ యాబయి మూడు లక్షల కోట్ల రూపాయలకు పైగానే ఉంది. మన వాణిజ్యం కంటే చైనా వాణిజ్యం విలువ ఎనిమిది రెట్లు ఎక్కువ! అయితే చైనాకు దాదాపు అన్ని ఆసియాన్ దేశాలతోను భూమి వివాదాలు, జల వివాదాలు కొనసాగుతున్నాయి. అందువల్ల మన దేశంతో జట్టు కట్టి చైనాను ప్రతిఘటించాలన్నది ఆసియాన్ దేశాల అంతరంగం. జపాన్, ఆస్ట్రేలియా, దక్షిణ కొరియా దేశాల సమష్టి వ్యూహం.. ఇండోనేసియాకు ఉత్తరంగాను వియత్నాంకు తూర్పుగాను, చైనాకు దక్షిణంగాను, ఫిలిప్పీన్స్‌కు పడమరగాను వ్యాపించిన సముద్రంలోను అనేక ద్వీపాల విషయంలో ఆసియాన్ దేశాలకూ చైనాకు మధ్య వివాదాలు ఉద్ధృతమౌతున్నాయి! టిబెట్‌లో మన బ్రహ్మపుత్రపై ఆనకట్టలను కట్టి ఈ నదీ జలాలను చైనా మళ్లించుకొంటోంది. 'మెకాంగ్' నదీ జలాలు ఆగ్నేయ ఆసియాకు దక్కకుండా చేయడానికి కూడా చైనా యత్నిస్తోంది..

'మెకాంగ్' నది టిబెట్‌లో పుట్టి, బర్మా, లావోస్, థాయ్‌లాండ్, కంబోడియా, వియత్నాం వంటి ఆగ్నేయ దేశాలలో ప్రవహించి సముద్ర సంగమం చేస్తోంది. ఈ దేశాలన్నీ 'మెకాంగ్' నదీ జలాలను వ్యవసాయానికి, తాగడానికి ఉపయోగిస్తున్నాయి. ఆగ్నేయ ఆసియాకు గంగానది వంటిది 'మెకాంగ్', అతి పెద్ద నది! థాయ్ భాషలో 'మెకాంగ్' అని అంటే 'మాతృగంగ' అని అర్థం. 'మాతృగంగ' థాయ్‌లాండ్‌కు మాత్రమే కాదు, పై దేశాలన్నింటికీ జీవనధార! టిబెట్ స్వతంత్రంగా ఉండినట్టయితే మెకాంగ్‌ను కాని బ్రహ్మపుత్రను కాని కొల్లగొట్టడానికి చైనాకు వీలుండేది కాదు. బ్రహ్మపుత్ర చైనాలో లేదు, టిబెట్‌లో జన్మించి మన దేశంలోకి వస్తోంది. 'మెకాంగ్' కూడా టిబెట్‌లోనే జన్మిస్తోంది, టిబెట్‌లో సుదీర్ఘ ప్రయాణం చేసిన తరువాత బర్మాలోకి లావోస్‌లోకి చేరడానికి ముందు యాబయి కిలోమీటర్లు మాత్రమే చైనాలో ప్రవహిస్తోంది. **ఈ నదిని 'ఆగ్నేయ' ఆసియా ప్రజలు 'మాతృగంగ'గా పిలవడం మన దేశంలో ఆ దేశాలకున్న సనాతన - శాశ్వత - సాంస్కృతిక బంధానికి ప్రతీక!** చైనాతో ఉభయులకూ నీటి తగాదా ఏర్పడి ఉండడం మనకూ ఆగ్నేయ ఆసియా ప్రజలకూ మధ్యగల సరికొత్త సమానత్వం! ఇలా **ఈ 'మాతృగంగ' నది 'మెకాంగ్' కావడానికి కారణం సంస్కృత భాష! ఆగ్నేయ ఆసియా ప్రాంతంలోని అనేక భాషలు సంస్కృత భాషకు రూపాంతరాలు.** అందువల్లనే మాతృగంగ థాయ్ భాషలో 'మెకాంగ్'గా మారింది! బౌద్ధం వ్యాపించక పూర్వం వందల ఏళ్లపాటు ఈ దేశాలలో సంస్కృత భాష పాలనా భాష, అనుసంధాన భాష, ఉన్నత విద్యా బోధనకు మాధ్యమ భాష. ఆ తరువాత సంస్కృతం, పాళీ భాష రెండూ ఆగ్నేయ ఆసియాలో విలసిల్లాయి. సాంస్కృతిక సమానత్వానికి వారధి సంస్కృత భాష!

మన దేశం అనాదిగా ఒక జాతిగా ఏర్పడి ఉంది. కలియుగం ఆరంభం నాటికి భరత వర్షమంతటా హైందవ సంస్కృతి విస్తరించి ఉంది. భరతఖండం ఈ 'భరతవర్షం'లో ఒక భాగం! హైందవ - సనాతన- సంస్కృతితోపాటు సమీకృత రాజ్యాంగ వ్యవస్థ కూడా ఏర్పడి ఉండిన ప్రాంతం భరతఖండం! ఈ భరత ఖండంలో యాబయి ఆరు రాజ్యాలు ఉండేవి. భారత - మగధ - సామ్రాజ్యపు పరమోన్నత అధికారానికి లోబడిన రాజ్యాలివి. ఇది భరత ఖండం లేదా 'అఖండ భారత్'... 'భరత ఖండం' వెలుపల ఉండిన 'భారత వర్ష' దేశాలలో కూడా హైందవ సంస్కృతి విస్తరించి ఉండేది. కానీ ఆ దేశాలు 'భరతఖండపు' సమీకృత రాజ్యాంగ వ్యవస్థలో లేవు! 'ఆసియాన్' దేశాలు అలాంటి 'భారత వర్షం'లోని ప్రాచీన స్వతంత్ర దేశాలు!

-హెబ్బార్ నాగేశ్వరరావు
9951038352

తరగతి ఓ వడపోసే యంత్రం

తరగతి గది ప్రతి అంశాన్ని వడపోస్తుంది. ముద్రించిన ప్రతి అక్షరం నిజం కావాల్సిన అవసరం లేదు. పుస్తకంలో ఉండే ప్రతి అక్షరాన్ని వడపోసే లక్షణాన్ని ఉపాధ్యాయుల్లో పిల్లల్లో కలిగిస్తుంది. అందుకే తరగతి గదికి వెళ్లకముందు ఉపాధ్యాయుడు ఆ అంశానికి సంబంధించిన ప్రతి పుస్తకాన్ని చదవాలి. విమర్శించుకోవాలి. విమర్శన అంటే విశ్లేషణ చేయడం, విడమరిచి చెప్పడం. ఆ అంశానికి సంబంధించిన సత్యాసత్యాలు బేరీజు వేసుకోవడం జరగాలి. అదేమాదిరిగా విద్యార్థి కూడా ముద్రించిన ప్రతి అక్షరాన్ని బట్టీ పట్టకూడదు. విద్యార్థులు తరగతి గది నేర్పిన వడపోతను ఉపయోగించాలి. దాని సత్యాన్వేషణ కూడా చేసుకోవాలి. ఇది సమాచార యుగం కాబట్టి ఎన్నో పుస్తకాలు వస్తాయి. ఏ పుస్తకాలు చదవాలో విద్యార్థులు గుర్తించగలగాలి. మన ఆలోచనలను నులిపివేయడానికి గైడ్స్ వస్తాయి. గైడ్ సమస్యకు పరిష్కారంకన్నా మన పరిష్కారాన్ని మన మేధస్సులో దూర్చే ప్రయత్నం చేస్తుంది. దీనివలన మన ఆలోచనలపై మనకే నమ్మకం లేకుండాపోతుంది. పత్రికల్లో వచ్చే ప్రతి మాటను మనం మన ఆలోచనలతో, ఆలోచనా పలకపై రాసి చూసుకోవాలి. తరగతిగది మనకిచ్చే సద్గుణాలలో విమర్శన అదే పుస్తకంలోని సమాచారాన్ని వడపోస్తుంది. సమాచారాన్ని వడపోసేది తరగతి గది. ఈ పవిత్రతను ఉపాధ్యాయులు, విద్యార్థి కాపాడిననాడే అది నాలుగు కాలాలు తన పవిత్రతను చాటగలుగుతుంది. తరగతి గది వడపోత లక్షణాన్ని కాపాడే సంరక్షకులుగా ఉపాధ్యాయులు నిలవాలి.

అనామకుడే సాంస్కృతికి అణువు

ఈనాడు ఆధునికతతో పరుగులు పెడుతున్న నేటితరం యువతకు నైతిక, సామాజిక స్పృహ కలిగించాలనే ఉద్దేశంతో ప్రతిరోజూ తరగతి గదిలో గుర్తు తెలియని ఏవో ఒక విద్యార్థి కొన్ని సూక్తులు రాస్తాడు. దీన్ని మనం ఈ రోజుకు ఆలోచించవలసినది (థాట్ ఫర్ ది డే అనుకుంటాం. తరగతి గదిలో శక్తిని, ఉత్సాహాన్ని, దేశభక్తిని రగిలించాలనే ఉద్దేశంతో కొందరు 'థాట్ ఫర్ ది డే' అన్న సామెతను రాస్తారు. ఇది ఉపేక్షించే అంశం కాదు. ప్రతివారు ఆలోచిస్తూనే ఉంటారు. ప్రతివారం తన ఆలోచనను బహిర్గతం చేస్తారు. ఇలాంటి సూక్తులు చినికి చినికి ఆలోచనల జడివానగా మారతాయి. అవే తరగతి గది గడప దాటి మార్నింగ్ అసెంబ్లీ వరకు వస్తుంది. దానినే ప్రధానోపాధ్యాయుడు వివరిస్తాడు. అది అన్ని తరగతుల అంశంగా మారిపోతుంది. ఎవరో తెలియని వ్యక్తి అనామకుడు కల్పించినటువంటి భావన ఒక జాతి కల్చర్‌గా మారిపోతుంది. తరగతి గది కూడా తనకు తెలియకుండానే దేశ సంస్కృతిలో భాగస్వామి అయిపోతుంది. ప్రతి తరగతి గది జాతి ఆలోచనలో ఒక అణువే కావచ్చును. జాతి కల్చర్‌ను నిర్మించడంలో తాను కూడా భాగస్వామినవుతున్నానని తరగతి గది భావిస్తోంది. అందుకే 'జాతి శీలం నిర్మించబడేది తరగతి గదిలోనే' అని కొఠారి అన్నారు.

-డా.చుక్కా రామయ్య

ఎన్నికల వేళ తాయిలాల గాలం?

వ్యవసాయం, గ్రామీణ ఉపాధి, సాంఘిక సంక్షేమ, మౌలిక సదుపాయాలు, స్టార్టప్, మేక్ ఇన్ ఇండియా, స్కిల్ ఇండియా మొదలైన సంస్కరణలపై దృష్టిపెట్టి 2017 కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఈ 2018 బడ్జెట్ బీజేపీ-ఎన్డీఏ కూటమికి చాలా కీలకమైనది. రాజస్థాన్, మధ్యప్రదేశ్, నాగాలాండ్, ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటక, మేఘాలయ, మిజోరం, సీపీఐ(ఎం) ఖాతాలోనున్న త్రిపుర రాష్ట్రాలలో 2018లో అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధంగా ఉన్నాయి. మొన్నటివరకు పాలించిన ఎనిమిదింట కాంగ్రెస్ ఐదు ఈశాన్య రాష్ట్రాలలో పాగావేస్తే ఇప్పుడు బీజేపీ మిత్రపక్షాలు ఎనిమిదింట ఐదు రాష్ట్రాలను కైవసం చేసుకొని కాంగ్రెస్ విముక్త ఈశాన్య రాష్ట్రాలు అని కంకణం కట్టుకొంది. మరోవైపు రెండు తెలుగు రాష్ట్రాలు, ఒడిశా, హర్యానా, మహారాష్ట్ర, ఝార్ఖండ్, సిక్కిం, అరుణాచల్‌ప్రదేశ్ 2019లో అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధంగా ఉన్నాయి. అంటే దేశంలోనున్న ఓటర్లలో సగంమంది రాబోయే సంవత్సర కాలంలో రాష్ట్ర ప్రభుత్వాల భవిష్యత్ మరియు దేశంలో మొత్తం ఓటర్లు 2019లో జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో కేంద్రప్రభుత్వం భవిష్యత్ నిర్ణయిస్తారన్నమాట. నోట్ల రద్దు, జీఎస్టీ అమలువల్ల పట్టాలు తప్పిన భారత ఆర్థిక వ్యవస్థని క్రమబద్ధీకరణ కోసం గత బడ్జెట్‌లో సామాన్యులకు మోదీ ప్రభుత్వం మొండి చెయ్యి చూపించేరు అన్న విమర్శలు ఎదుర్కొంది.

మొన్న గుజరాత్‌లో అష్టకష్టాలుపడి ఎట్టకేలకు గెలిచాము అనిపించుకొన్న బీజేపీకి యువత సత్తా ఏమిటో తెలుసు. గత సంవత్సరంగా పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ వంటి విప్లవాత్మకమైన సంస్కరణలు ప్రవేశపెట్టి ఎన్నో విమర్శలు, ఒడిదుడుకులు చూసిన మోదీ సర్కారు ఈ బడ్జెట్‌లో భారం వడ్డించేకంటే తాయిలాలు పంచడానికే ఎక్కువ ఆస్కారముంది. ఈసారి విత్త మంత్రి ఆచితూచి వ్యవహరించి ఒకప్రక్క ద్రవ్యలోటు పూడ్చి, ఆర్థిక వృద్ధి రేటు 7.5 శాతం పైబడి సాధించే విధంగా మరోపక్క ఎన్నికలకు సిద్ధంగా ఉన్న ఓటర్లను ప్రసన్నం చేయడానికి ప్రజా బడ్జెట్‌ను తయారు చేస్తుంటారు.

గ్రామీణ భారతం, వ్యవసాయ రంగంపై గత సంవత్సరం దృష్టి కేంద్రీకరించిన ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో కూడా గ్రామీణాభివృద్ధి కోసం అధిక మొత్తాల్లో పెట్టుబడులు ఎంజీఎన్ఆర్ఇజిఎ, పంటబీమా, నీటిపారుదల, విద్యుదీకరణ, పాడి ప్రాసెసింగ్, సాంకేతికంగా అభివృద్ధిలాంటి వాటి కోసం కేటాయింపు సంభావ్యం. చిన్న, సన్నకారు రైతులకు కనీసం కంటి తుడుపు కోసమైనా లబ్ధి మరియు రుణమాఫీలు ప్రకటించొచ్చు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారీగా ప్రభుత్వ వాటా విక్రయాలు జోరుగా సాగడానికి శ్రీకారం చుట్టింది. రాబోయే ఆర్థిక సంవత్సరంలో దాదాపు లక్ష కోట్లు డిసిన్వెస్ట్‌మెంట్ లేదా ప్రభుత్వ వాటాలు అమ్మకానికి బీజం నాటింది. దీనితో ద్రవ్యలోటును అధిగమిస్తుంది. గత బడ్జెట్‌లో 70 వేల కోట్లు లక్ష్యంగా పెట్టుకొన్న ప్రభుత్వం, ప్రభుత్వరంగ ఇన్సూరెన్స్ కంపెనీలలో ఐపీఓల ద్వారా వాటా అమ్మింది. మొన్న ముగిసిన విక్రయ ఒప్పందం ప్రభుత్వరంగ చమురు సంస్థ ఓఎన్జీసీ రిఫైనర్ హెచ్‌పీసీలో 51 శాతం కొనుగోలు ద్వారా 40వేల కోట్ల రూపాయలు ప్రభుత్వ ఖజానాకు వచ్చినట్లే.

భారతదేశం యొక్క యూనిట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా (ఎస్‌యుయుటిఐ) యాభై లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు 50కి పైగా భారీ ప్రైవేటురంగ సంస్థలలో పెట్టింది. వీటిలో ప్రయివేటు కంపెనీలలో ఎల్ అండ్ టీ, ఐటీసీ, ఆక్సిస్ బ్యాంక్‌లో వాటాలను విక్రయించాలని నిర్ణయించారు. ఇండియన్ ఆయిల్, కోల్ ఇండియా, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా, బీయిఎంఎల్, హిందూస్థాన్ ఏరోనాటిక్స్, స్కూర్స్ ఇండియా, పవన్‌హన్స్‌లో పబ్లిక్ ఇష్యూ ద్వారా వాటా అమ్మకాలకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. రైల్వే అనుబంధ సంస్థ రైట్స్ మరియు భారత్ డైనమిక్స్ లిమిటెడ్ మొదలైన 20 ప్రభుత్వరంగ కంపెనీలు 2018లో ప్రాథమిక పబ్లిక్ ఆఫర్లకు సిద్ధంగా ఉన్నాయి. తెల్లఏనుగు అయిన ఎయిర్ ఇండియాలో హెచ్చుశాతం వాటాను ఎలాగైనా వదిలించుకోవాలన్న ప్రభుత్వ ప్రయత్నాలు 2018లో ఫలించేటట్టు ఉన్నాయి. ఓఎన్జీసీకి హిందూస్థాన్ పెట్రోలియంలో వాటా అమ్మడం ద్వారా గత బడ్జెట్‌లో 2017-18గానూ 72,500 కోట్ల రూపాయల డిసిన్వెస్ట్‌మెంట్ లక్ష్యాన్ని మించి ప్రభుత్వం మొత్తాన్ని అందుకొంది. 2016-17లో 45 వేల కోట్ల రూపాయలు ప్రభుత్వ వాటా విక్రయాల ద్వారా ఖజానాకొచ్చాయి.

2018 బడ్జెట్‌లో విత్తమంత్రి మధ్య తరగతికి, ఉద్యోగవర్గానికి ఆదాయ పన్నులో ఉపశమనం ప్రకటించగలరు. పన్నుభారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం ఆదాయపన్ను స్లాబ్‌ను, రేట్ల సర్దుబాటు చేయవచ్చు. బడ్జెట్ -2018లో స్టాండర్డ్ డిడక్షన్ లేదా ప్రామాణిక మినహాయింపు తిరిగి ప్రవేశపెట్టొచ్చు. 1974-75 బడ్జెట్‌లో జీతంపై ఆధారపడే ఉద్యోగుల కోసం ప్రామాణిక మినహాయింపును ప్రవేశపెట్టారు. ఆ సమయంలో వేతన తరగతికి ప్రామాణిక మినహాయింపుకోసం అనేక ఖర్చులు అనుమతించేది. 2005-2006 బడ్జెట్ ప్రవేశపెట్టిన చిదంబరం, ప్రామాణిక మినహాయింపునకు స్వస్తి పలికి ఆ మినహాయింపు మొత్తం సెక్షన్ 80 సిలో చేర్చారు. కాకపోతే 80 సిలో మధ్య తరగతి వర్గం అంత మొత్తం ఆదా చేస్తేనే ప్రయోజనం. ప్రామాణిక మినహాయింపు టాక్స్ కోసం ఆదా చేయకుండానే ప్రతి వేతన తరగతి వ్యక్తి పొందవచ్చును.

అనాదిగా స్వాతంత్ర్యానికి మునుపునుంచి వస్తున్న ప్రజాపంపిణీ కార్యక్రమం (రేషన్‌కార్డుపై చౌకబియ్యం, దినుసులు)ని తొలగించి యూనివర్సల్ బేసిక్ ఇన్‌కమ్ (విశ్వవ్యాప్త ప్రాథమిక ఆదాయం)ను ప్రవేశపెట్టాలన్న ప్రభుత్వ యోచన కార్యరూపం దాల్చుకోవచ్చు. ప్రజాపంపిణీ వ్యవస్థ 40 శాతం మందికే చేరుతోంది. మిగతాదంతా దుర్వినియోగం చెందుతోందని ఎంతోమంది ఆర్థికశాస్త్రవేత్తలు నిరూపించారు. ఇప్పటికే యూబీఐ మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో దాద్రానగర్ హవేలీ, చండీగఢ్, పుదుచ్చేరిలో ప్రభుత్వ సబ్సిడీ ఆహారధాన్యాలు బదులుగా నగదు పంపిణీ చేయడానికి ఒక ప్రయోగాత్మక ప్రాజెక్టును నిర్వహిస్తున్నారు. ఈ ప్రాజెక్టు 90 శాతం సఫలీకృతమైనట్టు ఈ మధ్య నిర్వహించిన సర్వే వెల్లడించింది. ఒకవేళ యూబీఐని దేశవ్యాప్తంగా అమలుపరచిన తరుణంలో ఇప్పటికే గ్యాస్ వినియోగదారులకు ఇస్తున్న డైరక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్‌ను కూడా యూబీఐలో విలీనం చేయొచ్చు.

2004-05 బడ్జెట్‌లో స్టాక్‌ఎక్స్ఛేంజ్‌లలో క్రయవిక్రయాలు జరిపిన షేర్లపై దీర్ఘకాలిక మూలధన లాభం (ఎల్‌టీసీజి)ను తొలగించారు. దాని బదులుగా స్టాక్‌ఎక్స్ఛేంజ్‌లనుంచి షేర్ల క్రయవిక్రయాలపై సెక్యూరిటీ ట్రాన్సాక్షన్ టాక్స్ (ఎల్‌టీసీజి)ను తొలగించారు. లాభనష్టాలతో సంబంధం లేకుండా ప్రతి వ్యక్తి షేర్ అమ్మినా, కొనినా, తప్పక చెల్లించాలి. ఈ బడ్జెట్‌లో ఎల్‌టీసీజీ పునఃప్రవేశపెడతారన్న సందేహం లేకపోలేదు. అయితే 2008 తర్వాత గందరగోళమైన అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ తదితర పరిణామాలలో, ఎన్నో అభివృద్ధి పథకాలకు పునాదులు వేసి, ప్రకాశవంతంగానున్న భారతదేశ ఆర్థిక వ్యవస్థలో విదేశీ మదుపర్లు కీలకపాత్ర వహిస్తున్నారు. కాబట్టి ఎల్‌టీసీజీ ప్రవేశపెట్టి విదేశీ మదుపర్లను మరియు సంస్థాగత మదుపర్లను నిరాశకు గురి చేయగలరా అన్నదే ప్రశ్న. తలసరి బీమా ప్రపంచ సగటు రేటు 18వేల రూపాయలు, భారతదేశంలో 800 మాత్రమే. బీమారంగం ప్రోత్సహించడానికి ఈ బడ్జెట్ కొన్ని మార్పులను తీసుకురావచ్చు. భారతీయ రైల్వేలు 90 ఏళ్లుగా ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెట్టారు. చారిత్రక 2017 బడ్జెట్‌లో రైల్వే బడ్జెట్ సాధారణ బడ్జెట్‌లో విలీనం చేయబడింది. సర్వసాధారణంగా ప్రయాణీకుల రవాణా ఛార్జీలు, సరుకుల రవాణా ఛార్జీలు ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా పెరుగుతూంటాయి. రైల్వేబడ్జెట్ బాధ్యతకూడా ఆర్థికమంత్రి నెత్తిమీద పడిన దరిమిలా ఈ సంవత్సరం కూడా రైలు ఛార్జీలు పెంచాలి. పెరుగుతున్న నిర్వహణ ఖర్చు, అదనపు సౌకర్యాలు, ఆధునిక బోగీలు, కొత్త రైళ్లు, లైన్ల కోసం పెట్టుబడులతోపాటు రైల్వే మాజీ ఉద్యోగుల ఫించన్ బిల్లు సాలీనా దాదాపు 50 వేల కోట్లు వస్తుంది. కాబట్టి రైలు ఛార్జీల పెంపు తప్పనిసరిగా ఉండొచ్చు. స్లీపర్ క్లాసుని మినహాయించొచ్చు.

ప్రధానమంత్రి యొక్క డిజిటల్ ఇండియా, స్కిల్ ఇండియా ప్రాజెక్టుల కలలు సాకారం జరగాలంటే భారతదేశంలో గ్రామాలన్నింటికి ఇంటర్నెట్ అందుబాటులో ఉండడానికి మొబైల్స్, కంప్యూటర్లు, హార్డ్‌వేర్ ఇతర ఉత్పత్తులు సామాన్యులకు అందుబాటులో ఉంచడానికి వాటిపై సుంకం తగ్గించడమే కాకుండా వాటిని ఉత్పత్తి చేసే కంపెనీలకు రాయితీలను కూడా బడ్జెట్‌లో చోటు ఉండొచ్చు. గతంలో సోలార్ రంగానికి ఎన్ని ప్రయోజనాలు కల్పించినా చెప్పుకోదగ్గ ఫలితాలు పొందలేదు. ఈ బడ్జెట్‌లో సోలార్ కోసం ప్రత్యేక రాయితీలు ఉండకపోవచ్చు. ఔషధాలు, నిత్యావసర వస్తువులు సామాన్యులకు అందుబాటులో ఉంచి మిగతా విలాస వస్తువులపై సుంకాలు పెరగడం సహజం.

దేశానికి వెన్నెముక అయిన వ్యవసాయం, వ్యవసాయదారుల కోసం బడ్జెట్లో ప్రత్యేక అంశాలు, శుభవార్తలు ఆశించొచ్చు. ముఖ్యంగా రైతులకు కనీస అమ్మకపు ధర గిట్టుబాటయ్యేటట్లు చర్యలు తీసుకోవడం, ప్రస్తుత విత్తనాల, నీటిఎద్దటిలాంటి వ్యవసాయ సంక్షోభాన్ని పరిష్కరించడం చేసినప్పుడే రైతుల ఆదాయం రెట్టింపు లక్ష్యాన్ని 2022నాటికి సాధించడం జరుగుతుంది. వాళ్లకు ఎ2 ఖర్చు అనగా విత్తనాలు, ఎరువులు, రసాయనాలు, యంత్ర, కార్మికులు, వడ్డీ, కౌలు, నీటిపారుదల ఖర్చులు, నిర్వహణ వ్యయం వంటి పంటల ఉత్పత్తిలో అయ్యే ఖర్చులపై 50 శాతం మార్జిన్‌తో కనీస అమ్మకపు ధర ఉండాలని రైతుల కోరిక. 23 పంటలపై కనీస అమ్మకపు ధర చట్టం చేయబడినా వరి, గోధుమలు వంటి పంటలకు మాత్రమే సమర్థవంతంగా లభిస్తుంది. ప్రభుత్వం తన పాలనా సమర్థతను నిరూపించుకొని యువత, రైతులు, ఉద్యోగులను ఆకర్షించి ప్రభావితం చేయడమే తక్షణ కర్తవ్యం. 2018 బడ్జెట్ అంతా సాంకేతికపర వ్యవసాయాభివృద్ధి, ఉద్యోగవృద్ధి, ఉద్యోగాల సృష్టి, గ్రామీణ మౌలిక సదుపాయాలు, జీవనాభివృద్ధి వంటి అంశాలపై కేంద్రీకృతమై ఉంటుంది. వచ్చే ఏడాది కాలంలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు ఈశాన్య రాష్ట్రాలలో ఎన్నికలు ఎదుర్కొనడానికి సిద్ధమవుతున్న తరుణంలో ప్రభుత్వం వాయువ్య రాష్ట్రాల కోసం ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని కూడా కేటాయించినా ఆశ్చర్యపోనవసరం లేదు.

-సునీల్ ధవళ.. 09741747700

ఉత్తరాయణం

కొంత భరోసా.. కొంత నిరాశ

ఈ యేడు ఆర్థిక సర్వే ఫలితాలు చూస్తే రోగితో వైద్యుడు 'ఏం ఫర్వాలేదు, అంతా సర్దుకుంటుంది' అన్న తరహాలో ఉన్నాయి. వైద్యుడి మాటలతో భరోసా కలిగినా, ఇదంతా తనకి ధైర్యం చెప్పడంలో భాగమే కదా అన్న అనుమానమూ అతడికి వదలదు. ఆర్థిక సర్వే ఈ సంవత్సరం స్థూల జాతీయోత్పత్తి 6.5 శాతంగా ప్రకటించి, వచ్చే యేడు 7 నుండి 7.5 శాతంగా ఉండొచ్చని, తద్వారా ప్రపంచంలో త్వరితంగా ఆర్థికాభివృద్ధి సాధిస్తున్న దేశంగా తిరిగి కొనసాగగలదని ఆశాభావం వెలిబుచ్చింది. పెరిగిన పరోక్ష పన్నులు చెల్లించేవారి సంఖ్య, ఎగుమతులు, విదేశీ పెట్టుబడులను ఆర్థిక పుష్టికి కారణంగా చూపింది. అయితే వ్యవసాయ రంగానికి, విద్య, ఉపాధి రంగాలకు చెయ్యాల్సిన మేలును కూడా గుర్తు చేసింది. ఈ మధ్యనే విడుదలైన ఆక్స్‌ఫామ్ సంస్థ నివేదిక ప్రకారం గత సంవత్సరంలో సంపదలో 73 శాతం ఒక్కరి వద్దే పోగుపడగా దేశ జనాభాలో సగం మంది కేవలం ఒక్కశాతయం ఆదాయాభివృద్ధి చూడగలిగారు. లెక్కలు కచ్చితంగా ఇవే కాకపోవచ్చు కానీ ఆదాయం పంపిణీ సరళి ఎలా ఉందో తెలియచేస్తోంది. కోట్లాది పేదల జీవనాన్ని ఏమాత్రం మెరుగుపర్చలేని అభివృద్ధి ఆరోగ్యకరం కాదు. అసమానతలను తగ్గించేలా ప్రభుత్వం ఆలోచించాలి. అధిక జనాభా ఆధారపడిన వ్యవసాయ రంగం వివిధ కారణాలతో కుదేలై ఉండడం సర్వే గుర్తించింది. కనుక ఆ రంగం మెరుగుపడి, తద్వారా దేశ ఆర్థికపుష్టికి ఊతమిచ్చేలా చర్యలు ఉండాలి. యువశక్తి అధికంగా ఉన్న దేశంలో విద్య, కౌశలాలు, ఉద్యోగాల సృష్టిలో ముందుండడం ద్వారానే ఫలితం ఉంటుంది. ఈ విషయాల్లో ఎంత వెనుకబడి ఉన్నామో వివిధ సర్వేలు పట్టి చూపిస్తున్నాయి. విదేశీ పెట్టుబడులు, ఎగుమతుల్లో వృద్ధి సాధించడం అన్నది మన దేశం చేసే ప్రయత్నంతోబాటు పై దేశాల విధానాలపై ఆధారపడి ఉంటాయి. కాబట్టి పరిణామాలూ, ఆయిల్ ధరలూ, వాటిపై అప్పటికప్పుడు స్పందించడం తప్ప చేసేదేమీ లేదు. ఒక ఆశావహ దృక్పథంతో స్థిరమైన, సమగ్రమైన ఆర్థికాభివృద్ధి సాధించడానికి వెసులుబాటు ఉంది అన్న నమ్మకంతో ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవడానికి ఈ సర్వే దారి చూపుతుంది. అవకాశం సద్వినియోగపర్చడం ప్రభుత్వం చేతిలో ఉంది.

-డి.వి.జి.శంకరరావు, పార్వతీపురం

మేడారం జాతరకు ఈ-హుండీ అవసరం

దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతర తెలంగాణలోని మేడారం అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్నారు. సమ్మక్క-సారలమ్మ జాతరకు దాదాపు 1.5 కోట్ల మంది భక్తులు హాజరవుతారు. ప్రత్యక్షంగా మేడారం వెళ్లే భక్తులు కానుకలు చెల్లించుకునే వెసులుబాటు ఉంది. అయితే అక్కడకు వెళ్లలేనివారు ఆన్‌లైన్‌లో విరాళాలు, మొక్కులు చెల్లించుకునే వెసులుబాటు కల్పిస్తే బాగుండేది. ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం ఈ విషయంలో వెబ్ ఆప్షన్ ఆవిష్కరించి భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తే మంచిది.

-సి.వి.ఆర్.కృష్ణ, హైదరాబాద్

మహిళా కమిషన్‌కు రాజకీయ ప్రాపకం వద్దు

మాజీ చైర్‌పర్సన్ మోహిని స్పష్టీకరణ



న్యూఢిల్లీ, జనవరి 31: జాతీయ మహిళా కమిషన్ ఏర్పడి పాతికేళ్లు పూర్తైన సందర్భంగా ఇప్పటివరకూ మహిళల హక్కుల పరిరక్షణలో అది నిర్వహించిన పాత్ర, రాజకీయంగా లభిస్తున్న ఆదరణపై కేంద్ర మంత్రి మేనకాగాంధీ బుధవారం ఇక్కడ అనేక కీలక ప్రశ్నలను ఎదుర్కోవాల్సి వచ్చింది. గత పన్నెండేళ్లుగా గిరిజా వ్యాస్, మమతా శర్మ, లలితా కుమార మంగళం సహా జాతీయ మహిళా కమిషన్‌కు చైర్‌పర్సన్లుగా వ్యవహరించిన వారంతా ఆయా సందర్భాల్లోని కేంద్ర ప్రభుత్వాలతో ప్రత్యక్ష సంబంధాలు కలిగి ఉన్నవారే. అయితే జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్లు ఇలా ప్రత్యక్ష రాజకీయ సంబంధాలను కలిగి ఉండటంపై విమర్శలు తలెత్తుతున్నాయి. ఎన్‌సిడబ్ల్యు చైర్‌పర్సన్ పూర్తిస్థాయిలో స్వతంత్రంగా వ్యవహరించాలేగానీ, ఏ రకమైన రాజకీయ ప్రాపకాన్ని, ప్రాబల్యాన్ని కలిగి ఉండకూడదన్నది తన అభిప్రాయమని గతంలో ఈ కమిషన్‌కు సారథ్యం వహించిన మోహిని వి గిరి స్పష్టం చేశారు. 1995 నుంచి 98 వరకూ జాతీయ మహిళా కమిషన్ రెండో చైర్‌పర్సన్‌గా ఆమె వ్యవహరించారు. కమిషన్‌కు మరిన్ని అధికారాలు కల్పించాల్సిన అవసరం ఉందని, ఈ విషయం పట్ల కేంద్ర మంత్రి మేనకా గాంధీ ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఆమె తెలిపారు. జాతీయ మహిళా కమిషన్ కూడా జాతీయ మానవ హక్కుల కమిషన్ మాదిరిగానే వ్యవహరించాలని, ఎవరికైనా అందుబాటులో ఉంటూ, ఎవరికైనా సహాయపడే విధంగా ఈ కమిషన్‌ను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని ఆమె తెలిపారు. గత సెప్టెంబర్‌లో లలితా కుమార మంగళం మూడేళ్ల పదవీకాలం పూర్తైన తరువాత ఇప్పటి వరకూ జాతీయ మహిళా కమిషన్‌కు చైర్‌పర్సన్ లేకపోవడం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది. 2014లో ఈ పదవిలో నియమితమైన సమయానికి లలితా కుమార మంగళం బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలిగా ఉన్నారు. ఆమెకు ముందు 2011 నుంచి 14 వరకూ మమతా శర్మ ఈ పదవి నిర్వహించారు.

ఏం చేద్దాం.. చెప్పండి

బీజేపీ పరిస్థితిపై అమిత్ షా కసరత్తు ■ అసెంబ్లీ సీట్ల పెంపుపైనా నేడు చర్చ

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 31: విభజన చట్టంలో ఇచ్చిన హామీమేరకు తెలంగాణ, ఆంధ్ర అసెంబ్లీ సీట్ల పెంపు, తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ పరిస్థితులు, పార్టీ పరిస్థితిపై చర్చించేందుకు జాతీయ అధ్యక్షుడు అమిత్ షా గురువారం రెండు రాష్ట్రాల బీజేపీ నేతలతో సమావేశం కానున్నారు. చర్చల అనంతరం అసెంబ్లీ సీట్ల పెంపుపై ఒక నిర్ణయం రావొచ్చన్న వాదనా వినిపిస్తోంది. సీట్ల పెంపునకు బీజేపీ సుముఖంగా ఉందని కొందరు అంటున్నా, పార్టీ వర్గాలు మాత్రం ఖరారు చేయటం లేదు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు పార్టీ నేతలతో అమిత్ షా సమావేశమవుతారు. రాష్ట్రాలవారీ, విడివిడిగా జరుపనున్న సమావేశాల్లో సీట్ల పెంపువల్ల పార్టీకి ఏమేరకు ప్రయోజనం ఉంటుందనేదీ తెలుసుకుంటారని అంటున్నారు. సీట్ల పెంపువల్ల ఆంధ్రలో తెదేపా, తెలంగాణలో తెరాస మాత్రమే లాభపడతాయని, బీజేపీకి కలిసొచ్చేదేదీ లేదని రెండు రాష్ట్రాల నేతలు మొదటి నుంచీ వాదించటం తెలిసిందే. తెలుగు రాష్ట్రాల్లో పార్టీ పరిస్థితి, మిత్రపక్షాలతో ఏమేరకు పొత్తు కొనసాగించొచ్చు? పార్టీ ఏమేరకు బలోపేతమైంది? మరింత బలోపేతానికి ఎలాంటి చర్యలకు వీలుంది? క్షేత్రస్థాయిలో పార్టీ, కార్యకర్తల పరిస్థితి? రెండుచోట్లా నెలకొన్న రాజకీయ పరిస్థితులు? తదితర అంశాలపై సుదీర్ఘ చర్చలు జరుపనున్నారు. నేటి సమావేశానికి తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కె లక్ష్మణ్, అసెంబ్లీ పక్షనేత జి కిషన్ రెడ్డి, మాజీ కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ, జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్ రావు, ఎమ్మెల్సీ రామచందర్‌రావు, మంత్రి శ్రీనివాస్, ఏపీ అధ్యక్షుడు, ఎంపీ కె హరిబాబు, అసెంబ్లీ పక్షనేత విష్ణుకుమార్ రాజు, మాజీ కేంద్ర మంత్రి పురంధ్రీశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు హాజరవుతున్నారు. ఆంధ్ర బృందంతో జరిపే చర్చల్లో తెలుగుదేశంతో పొత్తు కొనసాగించాలా? వద్దా? అనే దానిపైనా లోతైన చర్చ జరగవచ్చన్న మాట వినిపిస్తోంది. ముఖ్యంగా పురంధ్రీశ్వరి, సోము వీర్రాజు గుప్పిస్తున్న విమర్శలు తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబుకు ఎంతమాత్రం మింగుడుపడటం లేదు. తాము మిత్రధర్మాన్ని పాటిస్తున్నాం, ఓపికున్నంత కాలం భరిస్తాం, ఓపిక నశిస్తే నమస్కారం పెట్టి వెళ్లిపోతామని పరోక్షంగా హెచ్చరించటం తెలిసిందే. ఇదిలావుంటే తెలుగుదేశం ప్రభుత్వం పనిచేస్తున్న తీరు, రాష్ట్రంలో అవినీతి విచ్చలవిడిగా కొనసాగటం, మంత్రులపై వస్తున్న అవినీతి ఆరోపణలు, తెలుగుదేశంతో పొత్తు కొనసాగించటం వలన బీజేపీపై పడుతున్న చెడు ప్రభావం తదితర అంశాలను రాష్ట్ర నేతలు జాతీయ నాయకత్వం దృష్టికి తేనున్నారు. తెదేపా ప్రభుత్వం రాష్ట్ర బీజేపీని ఏమాత్రం ఖాతరు చేయటం లేదనేదీ జాతీయ నాయకత్వానికి వివరించనున్నారు. తెలంగాణ నేతలు రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, సీఎం కేసీఆర్ సర్కారు పనితీరు, పొత్తుల విషయం చర్చకు రావచ్చని అంటున్నారు.



అసూయతో రాయలేదు

భన్సాలీపై విమర్శలను సమర్థించుకున్న స్వర భాస్కర్

ముంబయి, జనవరి 31: సంజయ్‌లీలా భన్సాలీ చారిత్రక చిత్రం 'పద్మావత్'ను ఉద్దేశించి తాను రాసిన లేఖ అసూయతో రాసింది కాదని బాలీవుడ్ నటి స్వర భాస్కర్ స్పష్టం చేసింది. భన్సాలీని విమర్శిస్తూ లేఖ రాసిన ఆమె బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేసింది. పద్మావత్‌లో సతీసహగమనాన్ని ఆకాశానికి ఎత్తేస్తూ మహిమాన్విత కార్యక్రమంగా చూపడాన్ని మాత్రమే తాను విమర్శించానని ఆమె చెప్పుకొచ్చారు. 'విమర్శించడం, తప్పులను ఎత్తిచూపే హక్కు అందరికీ ఉంటుంది. ఎవరి అభిప్రాయం వాళ్లు చెప్పుకునే స్వేచ్ఛ ఉంది. నాకు కూడా అదే వర్తిస్తుంది. భన్సాలీ చిత్రంపై అందుకే నా అభిప్రాయం చెప్పాను' అని స్వరభాస్కర్ పేర్కొంది. ఎంతో మర్యాదగా, గౌరవంగా తాను లేఖ రాశానని నటి సమర్థించుకుంది. పద్మావత్ దర్శకునికి లేఖ రాయడం వెనక దురుద్దేశం లేదా అసూయ ఎంతమాత్రం లేదని భాస్కర్ వివరించారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా తమ అభిప్రాయాలు వ్యక్తం చేయవచ్చు అని బాలీవుడ్ నటి పేర్కొన్నారు.

కాశ్‌గంజ్ అల్లర్ల సూత్రధారి అరెస్టు

లక్నో, జనవరి 31: ఉత్తరప్రదేశ్‌లోని కాశ్‌గంజ్ పట్టణంలో రిపబ్లిక్‌డే ర్యాలీ సందర్భంగా ఘర్షణల్లో ప్రధాన నిందితుడు సలీంను పోలీసులు అరెస్టు చేశారు. తిరంగ యాత్ర సందర్భంగా చందన్‌గుప్తా అనే 22 ఏళ్ల విద్యార్థిపై సలీం కాల్పులు జరపగా అతడు చనిపోయాడు. ఈ హత్యకేసులో సలీంతోపాటు అతడి సోదరులు నసీం, వాసీం నిందితులేనని ఆలీగఢ్ ఐజీ సంజీవ్ గుప్తా బుధవారం వెల్లడించారు. కాశ్‌గంజ్ ఘటనలో దోషులను వదిలిపెట్టేదిలేదని యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మంగళవారం ప్రకటించిన సంగతి తెలిసిందే. మర్నాడే నిందితుడు సలీంను పట్టుకున్నామని ఐజీ స్పష్టం చేశారు.

మొత్తం ఖర్చు మీరే భరించాలి

పోలవరంపై కేంద్రాన్ని కోరిన ఉత్తరాంధ్ర నేతలు ■ మాజీ ప్రధాని మన్మోహన్‌తోనూ భేటీ

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 31: పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పూర్తి వ్యయాన్ని కేంద్రమే భరించాలని ఉత్తరాంధ్ర చర్చా వేదిక విజ్ఞప్తి చేసింది. బుధవారం మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ నేతృత్వంలో ఉత్తరాంధ్ర చర్చా వేదిక నాయకులు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌ను కలిశారు. విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీల అమలు కాని విషయాన్ని మన్మోహన్ దృష్టికి తెచ్చారు. కాగా పార్లమెంట్‌లో విభజన హామీలపై లేవనెత్తుతామని మాజీ ప్రధాని హామీ ఇచ్చారని ఆ నాయకులు వెల్లడించారు. ఉత్తరాంధ్ర చర్చా వేదిక కన్వీనర్ కొణతాల రామకృష్ణ, కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు కేవీపీ రామచందర్‌రావు, ఎంపీ కొత్తపల్లి గీత తదితరుల కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిశారు.

పోలవరం ప్రాజెక్టు పూర్తి వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వమే భరించాలని కోరారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం పోలవరం ప్రాజెక్టు నిర్మాణ నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు. అనంతరం కొణతాల విలేఖరుతో మాట్లాడుతూ డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌ను ప్రైవేటీకరణ ఆపాలని గడ్కరీని కోరినట్టు చెప్పారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు భూసేకరణ, పరిహారం ఖర్చులు పూర్తిగా కేంద్రమే భరించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రాజెక్టు భూ సేకరణ సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇంతవరకు ప్రతిపాదనలు అందలేదని కేంద్రమంత్రి గడ్కరీ తమకు చెప్పారని కొణతాల వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు అందిన తర్వాత కేంద్ర కేబినేట్‌లో చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటామని మంత్రి అన్నారని ఆయన పేర్కొన్నారు. 2018 డిసెంబర్ నాటికి ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామని కేంద్రమంత్రి చెప్పారని, ఇంకా 11 నెలల కాలం మాత్రమే మిగిలి ఉందని, ఎలా ప్రాజెక్టు పూర్తిచేస్తారో వారికే తెలియాలని కొణతాల రామకృష్ణ వ్యాఖ్యానించారు. అనంతరం అరకు ఎంపీ కొత్తపల్లి గీత మాట్లాడుతూ పోలవరం ముంపు రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీల నుంచి వచ్చి సమస్యల్ని కేంద్రం దృష్టికి తీసుకొస్తున్నమని ఎంపీ కొత్తపల్లి గీత చెప్పారు.

బేరసారాలు మాకు అనవసరం: కేవీపీ

పోలవరం ప్రాజెక్టు కాంట్రాక్టర్ల మార్పు, కమిషన్ల బేరసారాలను తాము పట్టించుకోబోమని కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు కేవీపీ రామచందర్‌రావు అన్నారు. ఈ ప్రాజెక్టు విషయంలో ఎవరి వాటా ఎంత అన్నది తేల్చుకుని, నిర్మాణం పూర్తిచేస్తే చాలన్నారు. ప్రజాధనం వృథా అవడాన్ని ఎవరూ ఆపలేమని ఆయన చెప్పారు. ఆంధ్రా ప్రజల ఆకాంక్ష పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడమే మాముందున్న లక్ష్యమని, ప్రాజెక్టు ఎన్డీయే ప్రభుత్వంవల్ల కాకుంటే తమ ప్రభుత్వం వచ్చాక పూర్తిచేసి చూపిస్తామని రామచందర్ రావు తెలిపారు.

'రిజర్వేషన్లను 52 శాతానికి పెంచాలి'

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 31: దేశంలోని వెనుకబడిన కులాల రిజర్వేషన్లను 52 శాతానికి పెంచి వర్గీకరించాలని జాతీయ ఎంబీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సంగం సూర్యారావు, ఇతర నాయకులు వంశరాజ్, అంతయ్య, రవిశంకర్, నరసింహసాగర్, సతీష్ డిమాండ్ చేశారు. జాతీయ ఎంబీసీ సంక్షేమ సంఘం నాయకులు బుధవారం ఓబీసీ రిజర్వేషన్ల వర్గీకరణ కమిటీ అధ్యక్షురాలు, న్యాయమూర్తి రోహిణిని కలిసి ఈ మేరకు ఒక వినతిపత్రం అందజేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం ఓబీసీ రిజర్వేషన్లను వర్గీకరించేందుకు న్యాయమూర్తి రోహిణి అధ్యక్షతన ఒక కమిటీని ఏర్పాటు చేయటం తెలిసిందే. ఓబీసీలకు ఇప్పుడు జాతీయ స్థాయిలో ఇస్తున్న 27 శాతం రిజర్వేషన్లను వర్గీకరించటం వలన పెద్దగా ప్రయోజనం ఉండదని వారు సూచించారు. ఓబీసీ రిజర్వేషన్లను వర్గీకరించటం చిక్కులతో కూడుకున్న విషయం కాబట్టి దీనిని జాగ్రత్తగా చేయవలసి ఉంటుందన్నారు. ఓబీసీ రిజర్వేషన్లను వారి జనాభా ఆధారంగా 52 శాతానికి పెంచి వర్గీకరిస్తే మంచి ఫలితాలు ఉంటాయనేది ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం గ్రహించాలని వారు సూచించారు. ఓబీసీల క్రీమీలేయర్ పరిమితిని పది లక్షల రూపాయలకు పెంచాలని కూడా వారు డిమాండ్ చేశారు. ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించడంతోపాటు రాజకీయ రిజర్వేషన్లు కల్పించినప్పుడే సాధికారిత కలుగుతుందని వారు న్యాయమూర్తి రోహిణికి సూచించారు.

పేదలకు దూరం.. దూరం

ప్రధాని మోదీపై రాహుల్ విమర్శ ■ తన జాకెట్ బహుమతిగా వచ్చిందని వివరణ

షిల్లాంగ్, జనవరి 31: నరేంద్ర మోదీ ఇప్పటికీ 'సూటు-బూటు ప్రధాని' అని, పేదలకు దూరంగా ఉండేలా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మరోసారి విమర్శనాస్త్రాలు సంధించారు. తాను ఖరీదైన నలుపు జాకెట్‌ను ధరించడం పట్ల మేఘాలయ బీజేపీ విభాగం చేసిన వ్యాఖ్యలకు రాహుల్ తీవ్రంగా స్పందించారు. సూట్లు ధరించిన వారి మధ్య గడిపేందుకు మాత్రమే ఇష్టపడే మోదీ పేదల మధ్యకు వెళ్లేందుకు ఏమాత్రం సుముఖత చూపరని ఆయన ప్రతిదాడి చేశారు. 'ఆయన పేదవాడిని ఆలింగనం చేసుకోవడం గానీ, పేదవాడితో ముచ్చటించడం గానీ, నిరుపేదల మధ్య గడపడం గానీ ఎవరైనా చూశారా? పేదలను 'తగినంత' దూరంలో ఉంచే ఆయన ఒబామా లాంటి వ్యక్తుల మధ్య ఉండేందుకు తెగ ఆరాటపడతారు' అని మోదీని ఉద్దేశించి రాహుల్ మండిపడ్డారు. 'సూటు- బూటుపై మమకారం చూపే ప్రధాని దేశానికి ఏమీ చేయలేకపోతున్నారని, రెండు కోట్ల ఉద్యోగాలిస్తానని వాగ్దానం చేసిన ఆయన తన లక్ష్యాన్ని సాధించడంలో ఘోరంగా విఫలమయ్యారని ఆరోపించారు. రాహుల్ చేసిన 'సూటు- బూటు' విమర్శలపై మేఘాలయ బీజేపీ విభాగం ఘాటైన సమాధానం ఇచ్చింది. మేఘాలయ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న రాహుల్ 63వేల రూపాయల విలువైన నలుపురంగు జాకెట్ వేసుకున్నారని బీజేపీ విమర్శించింది. రాహుల్ వేసుకున్న జాకెట్ గురించి మేఘాలయ బీజేపీ నేతలు ప్రస్తావిస్తూ, 'సూటు-బూటు సర్కారు దేశంలో నల్లధనాన్ని అరికట్టింది, అవినీతిని పారదోలింది, కాంగ్రెస్ మాత్రం ఇక్కడి సమస్యలపై దృష్టి పెట్టడానికి బదులు తన అసమర్థతను చాటుకుంటోంది, మీరు చూపుతున్న అశ్రద్ధ ఇక్కడి వారిని అవహేళన చేసినట్టు ఉంది..' అంటూ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. కాగా, జాకెట్ వివాదంపై రాహుల్ స్పందిస్తూ, మేఘాలయకు చేరుకున్నపుడు దీన్ని తనకు కానుకగా ఇచ్చారని వివరించారు. రాహుల్ గాంధీ మేఘాలయలో ఎన్నికల ప్రచారం సందర్భంగా పలువురు క్రైస్తవ నాయకులను కలుసుకున్నారు. 60 స్థానాలున్న మేఘాలయ అసెంబ్లీకి ఫిబ్రవరి 27న ఎన్నికలు జరుగుతాయి. ఈ రాష్ట్రంలో క్రైస్తవుల జనాభా గణనీయంగా ఉన్నందున ఆ సామాజికవర్గ నేతలతో రాహుల్ భేటీ అయ్యారు.

'వలస విధానాల'పై మద్దతివ్వండి

వాషింగ్టన్, జనవరి 31: అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి రెండో ఏడాదిలో ప్రవేశించిన డొనాల్డ్ ట్రంప్ ఇపుడు వలస విధానాల్లో సంస్కరణలపైనే ప్రధానంగా దృష్టి సారించారు. అధ్యక్ష పదవి చేపట్టాక తొలిసారిగా ఆయన 'స్టేట్ ఆఫ్ యూనియన్ అడ్రస్' (ఎస్‌ఓటీయూ)కు హాజరై తన ఎజెండాలోని కీలక అంశాలపై సుదీర్ఘంగా ప్రసంగించారు. వలస విధానాల్లో తాను చేపట్టే సంస్కరణలకు విభేదాలకు అతీతంగా అందరూ మద్దతు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వలస విధానాలతో పాటు గ్రీన్‌కార్డులు, డ్రీమర్లు, ఉత్తర కొరియా, ఐసిస్ ఉగ్రవాదం వంటి అంశాలను కూడా ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు.

సుమారు 80 నిమిషాల సేపు ఆయన ప్రసంగించి, అధ్యక్షుడిగా తొలి ఏడాదిలో తాను తీసుకున్న నిర్ణయాలను వివరించారు. నైపుణ్యం ఆధారంగా అమెరికాలోకి వలసలను అనుమతించేందుకు 'కాంగ్రెస్' మద్దతు ఇవ్వాలని ఆయన అర్థించారు. భారత్ వంటి దేశాల నుంచి నిపుణులను తమ దేశానికి రప్పిస్తే కలిగే ప్రయోజనాలను ట్రంప్ వివరించారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేని 1.8 మిలియన్ల వలసవాదులు తమ దేశంలో ఉండేందుకు ఇపుడు అనుమతి ఇస్తున్నట్లు తెలిపారు.

ఎటుపోతున్నాం!?

- భారత ప్రజాస్వామ్యం లోపభూయిష్టం
- ఆ దేశాల జాబితాలో 42వ స్థానం
- విస్మయపరుస్తున్న ఈఐయూ నివేదిక

న్యూఢిల్లీ, జనవరి 31: భారత్‌ది ఘనమైన ప్రజాస్వామ్యమని చెప్పుకునే రోజులు చేజారుతున్నాయా? తాజా సర్వే పరిశీలిస్తే అవుననక తప్పని పరిస్థితి. ప్రపంచ ప్రజాస్వామ్య దేశాల వార్షిక జాబితాలో భారత్ 42వ స్థానానికి చేరిందన్నది ఈఐయూ తాజా నివేదిక. అంతేకాదు, ఛాందసవాదం పెరిగి మైనారిటీలపై దాడులు చోటుచేసుకుంటున్నాయని, భిన్నమతాల గొంతులు అణచివేతకు గురవుతున్నాయంటూ వార్షిక నివేదికలో పేర్కొనడం గమనార్హం. గత ఏడాది జాబితాతో పోల్చిచూస్తే భారత్ పది స్థానాల కిందకుజారితే, నార్వే మాత్రం ఈ ఏడాదీ ప్రథమస్థానంలో నిలిచింది. తరువాతి స్థానాల్లో ఐస్‌లాండ్, స్వీడన్ దేశాలు నిలిచాయని ఎకనామిస్ట్ ఇంటిలిజెన్స్ యూనిట్ (ఈఐయు) ఒక నివేదికను విడుదల చేసింది. అంతేకాదు, లోపభూయిష్ట ప్రజాస్వామ్య దేశాల జాబితాలో భారత్‌ను చేర్చడం గమనార్హం. ఐదు అంశాలను పరిగణనలోకి తీసుకుని 165 దేశాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాలకు ఈఐయు ర్యాంకులను కేటాయించింది. ప్రజా విధానాలు.. బహుళత్వం, సామాజిక స్వేచ్ఛ, ప్రభుత్వాల పనితీరు, రాజకీయాల్లో ప్రజా భాగస్వామ్యం, రాజకీయ సంస్కృతి అంశాల ప్రాతిపదికన ర్యాంకులను కేటాయించింది. సంపూర్ణ ప్రజాస్వామ్యం, లోపభూయిష్ట ప్రజాస్వామ్యం, మిశ్రిత ఏకస్వామ్యం, సంస్థాగత ఏకస్వామ్య పాలన ప్రాతిపదికన మొత్తం దేశాలను నాలుగు క్యాటగిరీల్లో చేర్చింది. అమెరికా (21వ ర్యాంకు), జపాన్, ఇటలీ, ఫ్రాన్స్, ఇజ్రాయిల్, సింగపూర్, హాంకాంగ్ దేశాలు సైతం లోపభూయిష్ట ప్రజాస్వామ్య దేశాల జాబితాలో ఉండటం గమనార్హం. బ్రిటన్ నుంచి పని చేస్తున్న ది ఎకనామిస్ట్ గ్రూపులో ఈఐయూ అనేది అధ్యయన, విశ్లేషణాత్మక విభాగం. వ్యాపార, ఆర్థిక సంస్థలు, ప్రభుత్వాలకు ఉపకరించేలా 'మారుతోన్న ప్రపంచ స్వరూపం? కొత్త ప్రపంచంలో లభిస్తున్న అవకాశాలు? తలెత్తుతోన్న సమస్యలు? లాంటి విస్తృతాంశాలపై అధ్యయనాలు చేస్తోంది. ఈ సంస్థ ఇచ్చిన ర్యాంకుల్లో మొదటి మూడు స్థానాలను ఉత్తరప్రాంత దేశాలైన నార్వే, ఐస్‌లాండ్, స్వీడన్‌లు దక్కించుకుంటే, టాప్ టెన్‌లోని తరువాతి స్థానాల్లో వరుసగా న్యూజిలాండ్, డెన్మార్క్, ఐర్లాండ్, కెనడా, ఆస్ట్రేలియా, ఫిన్‌లాండ్, స్విట్జర్లాండ్ దేశాలు నిలిచాయి. మొదటి 19 స్థానాల్లో నిలిచిన దేశాలను మాత్రమే పూర్తి ప్రజాస్వామ్య దేశాల క్యాటగిరీలో ఈఐయూ చేర్చింది. అలాగే నియంతృత్వ పోకడలు కనిపించే దేశాల జాబితాలో పాకిస్తాన్ (110), బంగ్లాదేశ్ (92), నేపాల్ (94), భూటాన్ (99) దేశాలున్నాయి. నియంతృత్వ పాలన సాగే దేశాల్లో చైనా (139), మయన్మార్ (120), రష్యా (135), వియత్నాం (140) ఉన్నాయి. ఉత్తర కొరియాకు 167వ స్థానం దక్కితే, ఒక సంఖ్య మెరుగ్గా సిరియాకు 166వ స్థానం దక్కింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ
ఇ-టెండరు ప్రకటన

నెం.3863/డి2/2017 తేది: 25.01.2018

నమోదిత ఆర్గనైజేషన్లు / సంస్థల నుండి 2017-18లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 10 ISSNIP జిల్లాలకు ILA మోడ్యూల్స్ 19, 20 మరియు 21 ముద్రణ మరియు సరఫరా కోసం సీలు వేయబడిన టెండర్లు ఆహ్వానించుచున్నారు. **31.01.2018న రాత్రి 9 గంటల నుండి 05.02.2018న మ.గం.1.00 వరకు** https://tender.apeprocurement.gov.in అను వెబ్‌సైట్‌వద్ద డౌన్‌లోడ్ కోసం టెండరు డాక్యుమెంట్లు లభించును. ఇ-టెండర్లు దాఖలు చేయుటకు చివరి తేది:- **05.02.2018న మ.గం.1.30 ని.ల వరకు.** టెండర్లు తెరచు తేది:- **05.02.2018న మ.గ.3.00లకు.** తదుపరి వివరములు కోసం ఫోన్ నెంబర్లు **0863-2333221 / 2332587**లపై సంప్రదించగలరు. అకౌంట్స్ ఆఫీసర్: **9440814406.**

R.O.No.3223/CL/Advt/1/1/2017-18 సం./- **స్పెషల్ కమీషనర్**

దూరదర్శన్ కేంద్రం విజయవాడ
విజయవాడ వన్‌టౌన్ దూరదర్శన్ ప్రేక్షకులకు గమనిక

ప్రసార భారతి బోర్డు ఆదేశాల మేరకు విజయవాడ గాంధీ హిల్ లోని ట్రాన్స్‌పోజర్ (ఛానల్ నెం.11) ద్వారా విజయవాడ వన్‌టౌన్ ప్రాంతంలో ప్రసారమవుతున్న దూరదర్శన్ జాతీయ, ప్రాంతీయ ప్రసారాలు 12 ఫిబ్రవరి 2018 నుంచి నిలిపివేయబడును.

ఆంధ్రాబ్యాంక్ (భారత ప్రభుత్వరంగ సంస్థ)
ఫోన్ : 08674-243258, 242248
డిమాండ్ నోటీసు
Date:12-01-2018
[illegible]

కార్పొరేషన్ బ్యాంక్
హనుమాన్ జంక్షన్ బ్రాంచి, కృష్ణా జిల్లా
స్వాధీనత ప్రకటన
... రూ.6,79,048/- ... ది.10-11-2017 ... ది.25-01-2018 ...
[illegible]

కార్పొరేషన్ బ్యాంక్
హనుమాన్ జంక్షన్ బ్రాంచి, కృష్ణా జిల్లా
స్వాధీనత ప్రకటన
... రూ.11,03,806/- ... ది.10-11-2017 ... ది.25-01-2018 ...
[illegible]

బిజినెస్

2015-16 జీడీపీ వృద్ధి రేటు 8.2 శాతం

సవరించిన సీఎస్ఓ

న్యూఢిల్లీ, జనవరి 31: సెంట్రల్ స్టాటిస్టిక్స్ ఆఫీస్ (సీఎస్ఓ) బుధవారం 2015-16 ఆర్థిక సంవత్సర స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటును 8 శాతం నుంచి 8.2 శాతానికి సవరించింది. 2016-17 ఆర్థిక సంవత్సర వృద్ధి రేటును మాత్రం ఎలాంటి మార్పులు లేకుండా 7.1 శాతంగానే ఉంచింది. వాస్తవ జీడీపీ 2016-17లో రూ. 121.96 లక్షల కోట్లు, 2015-16లో రూ. 113.86 లక్షల కోట్లు నమోదయిందని, ఈ రెండు ఆర్థిక సంవత్సరాలలో జీడీపీ వృద్ధి రేటు వరుసగా 7.1 శాతం, 8.2 శాతం చొప్పున నమోదయిందని సీఎస్ఓ ఒక ప్రకటనలో వెల్లడించింది.

1.8 శాతం పెరిగిన వేదాంత నికర లాభం

న్యూఢిల్లీ, జనవరి 31: మైనింగ్ కంపెనీ వేదాంత లిమిటెడ్ నికర లాభం మూడో త్రైమాసికంలో 1.8 శాతం పెరిగింది. 2017 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికంలో ఈ కంపెనీ రూ. 2,173 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. వేదాంత లిమిటెడ్ గత ఆర్థిక సంవత్సరం తృతీయ త్రైమాసికంలో రూ. 2,133 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం తృతీయ త్రైమాసికంతో పోలిస్తే ఆదాయం బాగా పెరగడం వల్ల నికర లాభం కూడా పెరిగినట్లు వేదాంత లిమిటెడ్.. బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ)కి సమర్పించిన ఒక పత్రంలో పేర్కొంది.

Vedanta Ltd. Q3 2017-18 (in ₹Crores)

	DECEMBER 31 2016	DECEMBER 31 2017	YoY Growth %
Op Revenue	20391	24361	19.47
Income	21405	24934	16.49
Expenditure	17613	20453	16.12
PBT	3792	4323	14.00
Net Profit	2133	2173	1.88
EPS (in ₹)	7.19	5.86	

Unaudited, Consolidated — PTI GRAPHICS

36వేల స్థాయిని కోల్పోయిన సెనె్సక్స్

★ 69 పాయింట్లు పడిపోయిన సూచీ
★ 22 పాయింట్లు తగ్గిన నిఫ్టీ
★ వరుసగా రెండో రోజూ పతనమే
★ బడ్జెట్‌వైపు మదుపరుల చూపు

ముంబయి, జనవరి 31: మరో 24 గంటల్లో పార్లమెంటు ముందుకు కేంద్ర బడ్జెట్ రానున్న తరుణంలో మదుపరులు అప్రమత్తంగా వ్యవహరించి కొనుగోళ్లకు దూరంగా ఉండటంతో దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం నష్టాల్లో ముగిశాయి. బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) సెనె్సక్స్ కీలకమైన 36,000 పాయింట్ల స్థాయికన్నా దిగువన ముగిసింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) నిఫ్టీ కూడా పతనమయినప్పటికీ, కీలకమయిన 11,000 పాయింట్ల స్థాయికి పైన స్థిరపడగలిగింది. మదుపరులు వరుసగా రెండో రోజు బుధవారం కూడా అప్రమత్తంగా వ్యవహరించి, తమ పోర్ట్‌ఫోలియోలను విస్తరించుకోకుండా మరిన్ని సానుకూల అంశాల కోసం బడ్జెట్‌వైపు ఎదురు చూశారని ట్రేడర్లు తెలిపారు. సెనె్సక్స్ బుధవారం సెషన్‌లో ఎక్కువ సమయం ప్రతికూల ధోరణిలోనే సాగి, క్రితం సెషన్ ముగింపుతో పోలిస్తే 68.71 పాయింట్లు (0.19 శాతం) దిగజారి, 35,965.02 పాయింట్ల వద్ద ముగిసింది. ఈ సూచీ ఇంట్రా-డేలో 35,818.41 పాయింట్ల కనిష్ట స్థాయి, 36,050.69 పాయింట్ల గరిష్ఠ స్థాయి మధ్య కదలాడింది. సెనె్సక్స్ తన జీవనకాల గరిష్ఠ స్థాయి నుంచి మంగళవారం 249.52 పాయింట్లు పడిపోయిన విషయం విదితమే. నిఫ్టీ బుధవారం ఇంట్రా-డేలో 10,979.30 పాయింట్ల కనిష్ట స్థాయిని తాకి, తరువాత కొంత పుంజుకొని చివరకు క్రితం ముగింపుతో పోలిస్తే 21.95 పాయింట్ల (0.20 శాతం) దిగువన 11,027.70 పాయింట్ల వద్ద స్థిరపడింది.

TOP LOSERS 31 JAN — 35,965.02

POINTS	BSE SENSEX	%
2225.25	Dr Reddys	-3.75%
705.05	Tata Steel	-3.49%
298.60	Coal India	-2.32%
1369.65	HUL	-2.13%
579.35	Sun Pharma	-2.02%
1150.65	Infosys	-1.63%
271.25	ITC	-1.51%
3111.75	TCS	-1.33%
304.65	Wipro	-0.99%
1416.60	Larsen Turbo	-0.87%

-68.71 — PTI GRAPHICS

అయితే, నెలవారీగా చూస్తే సెనె్సక్స్ ఈ నెలలో 1,908.19 పాయింట్లు (5.60 శాతం) పెరగగా, నిఫ్టీ 497 పాయింట్లు (4.71 శాతం) పుంజుకుంది. ఇదిలా ఉండగా, మంగళవారం ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) నికరంగా 105.56 కోట్ల విలువయిన షేర్లను, దేశీయ సంస్థాగత మదుపరులు (డీఐఐలు) రూ. 281.65 కోట్ల విలువ గల షేర్లను విక్రయించారు.

బుధవారం లావాదేవీల్లో సెనె్సక్స్ ప్యాక్‌లోని సంస్థల్లో డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరి బాగా నష్టపోయింది. ఈ సంస్థ షేర్ విలువ 3.75 శాతం పడిపోయింది. 3.49 శాతం నష్టంతో టాటా స్టీల్ రెండో స్థానంలో నిలిచింది. నష్టపోయిన ఇతర సంస్థల్లో హెచ్‌యూఎల్, సన్ ఫార్మా, కోల్ ఇండియా, ఇన్ఫోసిస్, ఐటీసీ లిమిటెడ్, టీసీఎస్, విప్రో, ఎల్అండ్‌టీ, పవర్ గ్రిడ్, మారుతి సుజుకి, భారతి ఎయిర్‌టెల్, ఓఎన్‌జీసీ, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఆటో, ఎస్‌బీఐ ఉన్నాయి. వీటి షేర్ల విలువ 2.62 శాతం వరకు పడిపోయింది. అయితే, మార్కెట్‌లో ప్రతికూల ధోరణిని అధిగమించి కోటక్ మహీంద్ర బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, టాటా మోటార్స్, యెస్ బ్యాంక్, ఆసియన్ పెయింట్స్, ఐసీఐసీఐ బ్యాంక్ లాభాలను ఆర్జించాయి.

రంగాల వారీగా చూస్తే, బీఎస్ఈ హెల్త్‌కేర్ ఇండెక్స్ అత్యధికంగా 1.62 శాతం పడిపోయింది. తరువాత స్థానాల్లో ఎఫ్ఎంసీజీ 1.25 శాతం, మెటల్ 1.25 శాతం, క్యాపిటల్ గూడ్స్ 1.12 శాతం, ఐటీ 1.10 శాతం, కన్స్యూమర్ డ్యూరేబుల్స్ 0.98 శాతం, టెక్ 0.86 శాతం, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ 0.56 శాతం, పీఎస్‌యూ 0.39 శాతం చొప్పున నష్టపోయాయి. అయితే, చమురు- సహజ వాయువు, బ్యాంకెక్స్ సూచీలు లాభాల్లో నిలవగలిగాయి.



TOP GAINERS	%	TOP LOSERS	%
Kotak Mahi	1.88	Dr Reddys	-3.75
Reliance	1.25	Tata Steel	-3.49
HDFC	1.15	Coal India	-2.32
IndusInd	1.05	HUL	-2.13
Tata Motors	0.77	Sun Pharma	-2.02


PTI GRAPHICS



TOP GAINERS	%	TOP LOSERS	%
Bharti Infra	2.06	Tata Steel	-4.61
Kotak Mahi	1.92	Dr Reddys	-3.50
Tech Mahi	1.61	UPL	-2.43
BPCL	1.38	Cipla	-2.28
HPCL	1.20	HUL	-2.21

కేటీపీఎస్ 7వ దశలో విజయవంతంగా లైటప్

★ ఉద్యోగులు, కార్మికుల్లో ఆనందోత్సాహాలు
★ సీఎండీని అభినందించిన సీఎం కేసీఆర్


కంప్యూటర్ ద్వారా లైటప్ చేస్తున్న జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు

పాల్వంచ, జనవరి 31: రూ.5,500 కోట్ల వ్యయంతో 800 మెగావాట్ల సామర్థ్యంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో నిర్మిస్తున్న కేటీపీఎస్ 7వ దశలో బుధవారం చేసిన లైటప్ విజయవంతమైంది. అనుకున్న సమయానికంటే ముందుగానే నిర్మాణ పనులు పూర్తి చేసుకున్న బాయిలర్ విభాగంలో టీఎస్ జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు కంప్యూటర్ ద్వారా లైటప్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. బాయిలర్‌లో లోడెన్స్ ఆయిల్‌తో బుధవారం ఉదయం 7.35 నిమిషాలకు ప్రయోగాత్మక పరిశీలన చేయగా బాయిలర్ నుండి సుమారు 20 నిమిషాల పాటు పొగలు విరజిమ్మాయి. దీంతో కేటీపీఎస్ అధికారుల్లో, కార్మికుల్లో, బీహెచ్ఇఎల్ అధికారుల్లో ఆనందోత్సవాలు వెల్లివిరిశాయి. నిర్దేశించిన సమయానికంటే ముందుగా కర్మాగారంలో లైటప్ విజయవంతం కావడంతో కార్మికులు, ఉద్యోగులు స్వీట్లు పంచుకున్నారు. అనంతరం సీఎండీ 7వ దశలోని కొన్ని విభాగాల్లో శరవేగంగా జరుగుతున్న పనులను పరిశీలించి అధికారులకు తగు సూచనలు ఇచ్చారు. కేటీపీఎస్, బీహెచ్ఎల్ అధికారులు సంయుక్తంగా ఇదే స్ఫూర్తితో ముందుకు పోతూ సింక్రనైజేషన్ జరిగే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెన్‌కో, కేటీపీఎస్, బీహెచ్ఇఎల్ అధికారులు పాల్గొన్నారు. కేటీపీఎస్ 7వ దశలో నిర్దేశించిన సమయానికంటే ముందుగానే కర్మాగారంలోని బాయిలర్ నిర్మాణ పనులను పూర్తి చేసి విజయవంతంగా లైటప్ నిర్వహించిన టీఎస్ జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావును రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, కొత్తగూడెం శాసనసభ్యుడు జలగం వెంకట్రావు అభినందించారు. ప్రస్తుతం రాష్ట్రంలో నిర్మాణం చేసుకొంటున్న విద్యుత్ కేంద్రాల్లో ఇదే తరహాలో పనులను పూర్తి చేసి విద్యుత్ ఉత్పత్తి జరిగేలా చూడాలని కోరారు.

పరిశ్రమలు, మార్కెటింగ్‌కు అపార అవకాశాలు

ఉద్యాన పరిశ్రమల ఏర్పాటుపై సదస్సులో సోమిరెడ్డి పిలుపు


ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, జనవరి 31: రాష్ట్రంలో వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేసే పారిశ్రామిక వేత్తలకు పరిశ్రమలు పెట్టడానికి అనుకూలతతో పాటు విస్తారమైన మార్కెట్ అవకాశాలు రాష్ట్రంలో ఉన్నాయని వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన రెడ్డి తెలిపారు. బుధవారం నగరంలోని ఒక ప్రైవేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ, ఉద్యాన పరిశ్రమల ఏర్పాటుపై పారిశ్రామిక వేత్తల కార్యక్రమానికి వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్రంలో వ్యవసాయ యంత్ర పరికరాల తయారీకి ముందుకు వచ్చే సంస్థలకు మంచి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో పాటు తగిన విధంగా సబ్సిడీలు ఇచ్చి ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రముఖ పారిశ్రామిక వేత్తల్లో అవగాహన కల్పించి రాష్ట్రంలో తయారీ పరిశ్రమలు ఏర్పాటు చేయించాలనేది ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా అడుగులు వేస్తున్నామన్నారు. ఇప్పటివరకు వ్యవసాయ యంత్ర పరికరాలు తయారు చేసే కంపెనీలు ఇతర రాష్ట్రాల్లోనే ఉన్నాయనే ఉద్దేశ్యంతో ఏపీ ప్రభుత్వం రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పే వారికి మంచి రాయితీలు ఇస్తోందన్నారు. సమైక్యాంధ్ర ప్రదేశ్‌లో ఆంధ్రా, తెలంగాణ, రాయలసీమ ప్రాంతాలకు చెందిన ప్రజలు హైదరాబాద్‌ను అనేక విధాలుగా అభివృద్ధి చేశారని, విభజన వల్ల హైదరాబాద్ తెలంగాణలో భాగమైందన్నారు. ఏపీకి ఎన్నో సహజ వనరులు ఉన్నాయని అందులో సముద్ర తీర ప్రాంతం, పోర్టులు తదితరమైనవని, వాటితో ఏపీని అభివృద్ధి చేసుకునే అవకాశం ఉందని తెలిపారు.

రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కష్టపడే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉండటం తమ అదృష్టమన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించేందుకు పారిశ్రామిక వేత్తలు ఎప్పుడు కావాలన్నా తనతో నేరుగా మాట్లాడవచ్చన్నారు. పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వం అండగా ఉంటూ అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందన్నారు.

గోదావరికి అడ్డుకట్ట!

'పోలవరం' డయాఫ్రం వాల్ నిర్మాణంలో భాగం


అడ్డుకట్ట వేసేందుకు డంపర్ల ద్వారా మట్టిని తోలుతున్న దృశ్యం


నీటి ప్రవాహానికి వీలుగా ఉంచనున్న సిమెంటు తూరలు

పోలవరం, జనవరి 31: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో కీలకమైన డయాఫ్రం వాల్ నిర్మాణం కోసం గోదావరి నదికి అడ్డుకట్టవేసే పనులను బుధవారం ప్రారంభించారు. మొత్తం 1427 మీటర్ల పొడవు, 1.5 మీటర్ల వెడల్పుతో భూమిలోపల నిర్మించే డయాఫ్రం వాల్ ఇప్పటివరకు 929 మీటర్ల మేర నిర్మాణం పూర్తయ్యింది. మిగిలిన 498 మీటర్ల నిర్మాణం కోసం గోదావరి నదికి అడ్డుకట్ట వేస్తున్నారు. అయితే నీటి ప్రవాహానికి వీలుగా 250 మీటర్ల నుండి 450 మీటర్ల ప్రాంతం వద్ద 200 మీటర్ల వెడల్పులో సిమెంట్ పైపులు ఏర్పాటుచేస్తున్నారు. ఈ అడ్డుకట్ట నిర్మాణం 20 రోజుల్లో పూర్తవుతుందని ప్రాజెక్టు ఈఈ ఎస్‌కే హుస్సేన్ తెలిపారు. ప్రస్తుతం గోదావరి నీరు దిగువకు 6 వేల క్యూసెక్కుల నీరు వెళ్తోందన్నారు. ఇది రానున్న రోజుల్లో మరింత తగ్గే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం తూర్పు గోదావరి జిల్లా వైపు నుండి 80వ మీటరు నుండి 225 మీటర్ల వరకు నీటి ప్రవాహం ఉందన్నారు. డయాఫ్రం వాల్ నిర్మాణ పనులు ఎల్అండ్‌టి, జర్మనీ కంపెనీ బావర్ ఏజెన్సీలు సంయుక్తంగా నిర్వహిస్తున్న విషయం విదితమే. డయాఫ్రం వాల్ నిర్మాణం మే 30వ తేదీ నాటికి పూర్తవుతుందని ఈఈ వివరించారు. ఇలావుండగా అడ్డుకట్ట నేపథ్యంలో పోలవరం నుండి బయలుదేరే పాపికొండలు విహార యాత్ర టూరిజం బోట్లు ఇకపై తూర్పు గోదావరి జిల్లా దేవీపట్నం నుండి మాత్రమే బయలుదేరతాయి.

వినిమయం కంటే ఉత్పత్తి ఎక్కువ!


★ మద్దతు ధర కాదు.. ఎంత లాభసాటి అన్నదే ముఖ్యం
★ తృణధాన్యాలపై రైతులను ఆకర్షించాలి
★ సీఏసీపీ చైర్మన్ ప్రొఫెసర్ విజయ్ పాల్ శర్మ

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, జనవరి 31: పంట పండించే రైతులకు తక్కువ ధర లభించడంలో వినిమయం కంటే ఉత్పత్తి ఎక్కువగా రావడం, తృణధాన్యాల సాగువైపు కాకుండా సాంప్రదాయ ఉత్పత్తులను సాగు చేయడం ప్రధాన కారణంగా నిలుస్తోందని కమిషనర్ ఫర్ అగ్రికల్చరల్ కాస్ట్ అండ్ ప్రైజెస్ (సీఏసీపీ) చైర్మన్ ప్రొఫెసర్ విజయ్‌పాల్ శర్మ అభిప్రాయపడ్డారు. గతంలో జాతీయ స్థాయిలో నిర్వహించే సదస్సును ప్రస్తుతం ప్రాంతీయంగా నిర్వహించుకునే విధానంలో స్థానిక బందరు రోడ్డులోని ప్రయివేటు సమావేశ మందిరంలో కమిషనర్ ఫర్ అగ్రికల్చరర్ కాస్ట్ అండ్ ప్రైజెస్ ఆధ్వర్యంలో దక్షిణ భారత దేశ రాష్ట్రాల ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. శర్మ మాట్లాడుతూ, వ్యవసాయ విధానంలో యాంత్రీకరణను అమలు చేయడంలో వ్యక్తిగత స్థాయిల కంటే సంఘాల, సామాజిక విధానంలో అమలు చేయడం ద్వారా యాంత్రీకరణ కోసం అయ్యే ఖర్చు తగ్గుతుందన్నారు. దక్షిణ భారత దేశ రాష్ట్రాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆశించిన స్థాయిలో సమావేశాల ఫలితాలు రావడం సంతోషంగా ఉందన్నారు. రైతులకు కనీస మద్దతు ధర లభించడంలో క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలను సరైన ధృక్పథంతో వెల్లడించారని, అయితే సాగు చేసే పంటలు ఆయా ప్రాంతాలలో భూసార పరీక్షల ఆధారంగా చేపట్టడంతో పాటు ఎరువుల వినియోగాన్ని కూడా అందుకనుగుణంగానే చేపట్టాల్సి ఉంటుందన్నారు. ఏపీ అగ్రికల్చరల్, సహకార సంస్థ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు ఉత్పత్తుల స్థాయి పెరగడంలో కృష్ణా, గోదావరి నదుల అనుసంధానం వల్ల సాధ్యమైందని జూన్ నాటికే కృష్ణా డెల్టా ప్రాంతంలో నీరు అందించడం వల్ల నవంబర్, డిసెంబరు నెలల్లో వచ్చే ప్రకృతి విపత్తుల నుంచి పంటను కాపాడగలిగామన్నారు. జీరో బడ్జెట్ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కర్నాటకకు చెందిన ఫుడ్ అండ్ సివిల్ సప్లయీస్ డిపార్ట్‌మెంట్ మేనేజింగ్ డైరెక్టర్ కె.హిమాజీ నాయక్ మాట్లాడుతూ మార్కెట్ ధరకు, ఉత్పత్తి ధరకు వ్యత్యాసం ఎక్కువగా ఉంటోందని కనీస మద్దతు ధర లభించేలాగా చర్యలు చేపట్టాలన్నారు.

కేటాయింపులు ఎక్కువే ఉండవచ్చు

కేంద్ర బడ్జెట్‌పై యనమల ఆశాభావం



ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 31: కేంద్ర ప్రభుత్వం గురువారం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయింపులు ఎక్కువగా ఉంటాయన్న ఆశాభావాన్ని రాష్ట్ర ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో విభజన వల్ల ఇబ్బంది పడుతున్న రాష్ట్రాన్ని ఆదుకోవాల్సి ఉందన్నారు. 2014-15 సంవత్సరానికి సంబంధించి రెవెన్యూ లోటు కింద 4000 కోట్లు కేటాయిస్తారని భావిస్తున్నట్లు తెలిపారు. వెలగపూడి సచివాలయంలో ఆయన తన చాంబర్‌లో మీడియాతో బుధవారం మాట్లాడుతూ రాజధాని నిర్మాణానికి మరో 2000 కోట్లు కేటాయించాల్సి ఉందన్నారు. విభజన కారణంగా ఏపీకి ప్రత్యేకంగా కేటాయింపులు చేయాల్సి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థలకు తగిన నిధులు కేటాయించాలని, రాష్ట్ర ప్రభుత్వం తరపున స్థలం కేటాయించి, ప్రహరీలను కూడా నిర్మించి ఇచ్చామని గుర్తు చేశారు. కొంత మేరకు నిధులు ఫిబ్రవరి మాసాంతానికి రావచ్చని భావిస్తున్నామన్నారు. రైల్వే జోన్ కూడా ఇంకా రావాల్సి ఉందన్నారు. ఉపాధి హామీ పథకం కింద 1200 కోట్ల రూపాయల మేర బకాయిలు ఉన్నాయన్నారు. స్పెషల్ ప్యాకేజీ కింద నిధులు విడుదల కావాల్సి ఉందన్నారు. గ్రామాల లింక్ రోడ్ల నిర్మాణానికి దాదాపు 4000 కోట్లతో ప్రణాళిక అందచేశామన్నారు. ఈఏపీ, సీఎస్సెస్, సీఏస్పీ కింద వివిధ ప్రాజెక్టులను 60:40 నిష్పత్తిలో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం భరిస్తున్నాయన్నారు. కానీ కేంద్ర వాటాను 90 శాతం చేయడం వల్ల రాష్ట్రానికి కొంత ఉపయుక్తంగా ఉంటుందన్నారు. భోగాపురం, విజయవాడ, రాజమండ్రి విమానాశ్రయాలకు సంబంధించి, అనంతపురం-అమరావతి రహదారి, కోస్టల్ కారిడార్ల కింద నిధులు విడుదల కావాల్సి ఉందన్నారు. రైల్వే జోన్ కూడా ప్రకటించాల్సి ఉందన్నారు.

'అపరాధ' ముద్రకు వ్యతిరేకంగా పోరు!

★ అవమానిస్తున్నారంటున్న 'గోదావరి' వ్యాపారులు
★ మార్చి 11 నుంచి రాజమహేంద్రి కేంద్రంగా పోరుకు నిర్ణయం

ఆంధ్రభూమి బ్యూరో

రాజమహేంద్రవరం, జనవరి 31: ప్రభుత్వాలు విధించే వివిధ రకాల పన్నులను వసూలుచేసే శాఖలకు సాధారణంగా వసూళ్ల లక్ష్యాలను నిర్దేశించడం చూస్తుంటాం. కానీ జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత ప్రత్యేకించి అపరాధ రుసుం వసూలుకు అధికారులకు లక్ష్యాలను నిర్దేశించడం వివాదాస్పదమవుతోంది. ప్రభుత్వ లక్ష్యాలను సాధించడానికి వాణిజ్య పనులు శాఖ అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారనే ఆరోపణతో ఇప్పుడు గోదావరి జిల్లాల వ్యాపారులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. అధికారులు షాపులకు దూరంగా మాటువేసి ఎవరో ఒకర్ని ఆయా షాపులకు పంపించి, బిల్లు ఇచ్చేలోపు వస్తువు తీసుకుని వచ్చేసే విధంగా పురమాయించి, వెనువెంటనే ఆ షాపు వద్దకు వెళ్లి, బిల్లు ఇవ్వలేదంటూ రూ.20వేలు అపరాధ రుసుం వేస్తున్నారని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. అధికారుల లక్ష్యాలను సాధించడానికి తమను కేసుల్లో ఇరికిస్తున్నారని, ఇదంతా జీఎస్టీ తెచ్చిన తంటా అని వ్యాపారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. తాము పన్నులు చెల్లించడానికి వ్యతిరేకం కాదని, వేధింపులకు వ్యతిరేకమని చెబుతున్నారు. అపరాధ రుసుం లక్ష్యాలను అధిగమించడానికి కుట్రపూరితంగా వ్యవహరిస్తున్న తీరును వ్యాపారులు తీవ్రంగా ప్రతిఘటించాలని బుధవారం రాజమహేంద్రవరంలో జరిగిన ఉభయ గోదావరి జిల్లాల వ్యాపార సంఘాలు తీర్మానించాయి. అపరాధ రుసుం పేరిట అధికారులు చేపడుతున్న 'డెకో' ఆపరేషన్లు తమను అవమానపరుస్తున్నాయని పేర్కొంటూ ప్రభుత్వాలకు తమ ప్రతిఘటన రుచి చూపించాలని నిర్ణయించాయి. జీఎస్టీ ముసుగులో అపరాధ రుసుం పేరిట చేపట్టిన వేధింపులకు నిరసనగా మార్చి 11 నుంచి ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నాయి.

సౌరశక్తితో హెచ్‌సీసీబీ ఉత్పత్తి

విజయవాడ, జనవరి 31: హిందుస్థాన్ కోకా-కోలా బేవరేజేస్ సంస్థ తెలుగు రాష్ట్రాల్లోని తమ ఉత్పత్తి యూనిట్లల్లో సౌరశక్తిని వినియోగించుకోనుంది. ఇందుకు అవసరమైన సౌర విద్యుత్ కోసం హైదరాబాద్‌లోని గ్రీన్ ఎనర్జీ సొల్యూషన్స్ కంపెనీ వైబ్రేంట్ ఎనర్జీతో బుధవారం ఒప్పందం కుదుర్చుకుంది. తెలంగాణలోని అమీన్‌పూర్, ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, శ్రీకాళహస్తిలో హెచ్‌సీసీబీకి యూనిట్లు ఉన్నాయి. ఇందుకు 2.7 కోట్ల యూనిట్ల విద్యుత్‌శక్తి అవసరం. హెచ్‌సీసీబీకి అవసరమైన సౌరశక్తిని సరఫరా చేసేందుకు వైబ్రెంట్ ఎనర్జీ అంగీకరించింది. ఈ మూడు యూనిట్లకు 1.2 కోట్ల యూనిట్లు పొందుతుంది. దేశంలోని 21 ఫ్యాక్టరీల్లో ఇకపై ఎల్ఈడీ బల్బులనే వినియోగిస్తుంది. కర్ణాటకలోని తమ యూనిట్లల్లోనూ సోలార్ పవర్ వినియోగానికి హెచ్‌సీసీబీ ప్రయత్నాలు ప్రారంభించింది. ఇదిలా ఉంటే హిందుస్థాన్ కోకాకోలా బేవరేజెస్ సీఈవో క్రిస్టినా రుగిరో, అహానా రెన్యువబుల్స్ మేనేజింగ్ డైరెక్టర్ మార్విన్ టీన్ ఫ్యాక్టరీ అవరణలో సోలార్ పవర్ వినియోగాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్‌సీసీబీ సీఈవో క్రిస్టినా రుగిరో మాట్లాడుతూ పర్యావరణాన్ని సంరక్షించే బాధ్యతను ప్రముఖంగా భావిస్తున్నామని, 2030 నాటికి శిలాజేతర ఇంధన వనరుల సంచిత విద్యుత్ శక్తి సామర్థ్యాన్ని 40 శాతానికి పెంచాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని స్ఫూర్తిగా తీసుకున్నట్టు తెలిపారు. అహానా రెన్యువబుల్స్ మేనేజింగ్ డైరెక్టర్ మార్విన్ టిన్ గ్రీన్ గోల్స్ సాధనలో హెచ్‌బీబీసీతో కలిసి ప్రయాణం చేయటం తమకు ఆనందంగా ఉందన్నారు. ఈ రెండు సంస్థల పరస్పర ప్రయోజనానికి కట్టుబడి ముందుకు సాగుతామన్నారు.

అందుబాటులో సినిమా టికెట్ ధరలు

మంత్రుల బృందం సమావేశంలో చర్చ

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 31: సినిమా టికెట్ ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని బుధవారం సచివాలయంలో జరిగిన గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ సమావేశంలో అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు, రాష్ట్ర హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్ప, రోడ్డు భవనాల శాఖ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబు సమావేశంలో పాల్గొన్నారు. సినిమా టికెట్ ధరలపై అధఇకారులతో మంత్రుల బృందం చర్చించింది. టికెట్ ధరలపై ఒక నిర్ణయానికి వచ్చే ముందు ఫిబ్రవరి 14వ తేదీన నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్ల సంఘాల ప్రతినిధులతో భేటీ కావాలని సమావేశంలో నిర్ణయించారు. ఆన్‌లైన్ టికెట్ అమ్మకాలపై కూడా మంత్రుల బృందం చర్చించింది.

కోడి పందేలరాయుళ్లకు జైలుశిక్ష

- నిడదవోలు కోర్టు సంచలన తీర్పు -

నిడదవోలు, జనవరి 31: సంక్రాంతి పర్వదినాల్లో చట్టవిరుద్ధంగా కోడి పందేల్లో పాల్గొన్న 95మంది కోడి పందేలరాయుళ్లకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలు అదనపు జూనియర్ సివిల్ జడ్జి వై శ్రీలక్ష్మి బుధవారం తీర్పుచెప్పారు. నిందితులకు మూడు రోజులు సాధారణ జైలుశిక్ష, వంద రూపాయల జరిమానా విధించారు. వివరాలిలావున్నాయి...సంక్రాంతి సందర్భంగా కోడిపందాలు నిర్వహించరాదని, కోళ్లకు కత్తులు కట్టి హింసించరాదని, ఇటువంటి చర్యలకు పాల్పడితే శిక్షార్హులని హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. అయితే పందెంరాయుళ్లు వీటిని ఖాతరు చేయకుండా పందేలు యథేచ్ఛగా నిర్వహించారు. ఈ పందేలకు సంబంధించి నిడదవోలు పోలీసు సర్కిల్ పరిధిలో 95 మందిపై పోలీసులు కేసులు నమోదుచేశారు. వారందరినీ బుధవారం నిడదవోలు కోర్టుకు తరలించగా మూడు రోజులు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పుచెప్పారు. సాధారణంగా కోడిపందేల కేసుల్లో వందో రెండొందలో జరిమానా చెల్లించేసి వెళ్లిపోవచ్చని అంతా భావిస్తుంటారు. అనూహ్యంగా జైలు శిక్ష విధించడంతో వారంతా లబోదిబోమన్నారు. తీర్పు అనంతరం దీనితో నిందితులను రెండు ఆర్టీసీ బస్సుల్లో తణుకు, తాడేపల్లిగూడెం, ఏలూరు సబ్ జైళ్లకు తరలించారు.

‘అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్ బాబు’

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, జనవరి 31: అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్ అయితే అరాచకానికి వైసీపీ అధ్యక్షుడు జగన్ బ్రాండ్ అంబాసిడర్‌లా మారారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి లంకా దినకర్ ఎద్దేవా చేశారు. ఈడీ కేసులు, ఆస్తుల అటాచ్‌మెంట్, జైలు జీవితం అనుభవించిన జగన్ వెంట ప్రజలు నడవాలా అని ఆయన ప్రశ్నించారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో దినకర్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి రావాల్సిన గ్రాంట్లు, పెండింగ్ ప్రాజెక్టులు, విభజన హామీలను చేర్చాలని కేంద్రాన్ని కోరారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సర్వే ప్రకారం సగటున 6.5 శాతం భారతదేశ వృద్ధి నమోదవుతుంటే దీనికి దాదాపు రెండు రెట్లు అనగా 12 నుంచి 13 శాతం వరకు ఏపీలో నమోదవుతుందన్నారు. ఒక వైపు గడచిన 4 సంవత్సరాలను భారతదేశ వృద్ధి రేటు వివిధ రంగాల్లో క్షీణిస్తున్నప్పటికీ ఆంధ్రప్రదేశ్ వృద్ధి రేటు దేశానికే తలమానికంగా ఉందని గుర్తు చేశారు. నోట్ల రద్దు, జీఎస్‌టీకి సంబంధించిన అంశాలు దేశ ఉపాధి, ఉద్యోగ అవకాశాలపై ప్రభావం చూపించాయనీ, అసంఘటిత రంగాల్లో అధికార లెక్కల ప్రకారం దాదాపు 15 నుంచి 20 లక్షల ఉద్యోగాలు కోల్పోవాల్సి వచ్చిందన్నారు.

నిరుద్యోగులతో సర్కార్ చెలగాటం

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 31: శుష్క వాగ్దానాలు, శూన్యహస్తాలతో అరచేతిలో వైకుంఠం చూపిస్తూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం నిరుద్యోగ యువత జీవితాలతో చెలగాటమాడడం శోచనీయమని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసీ రెడ్డి ఓ ప్రకటనలో విమర్శించారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా నిరుద్యోగుల సంఖ్య తగ్గుతుండగా భారత్‌లో పెరుగుతోందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా నిరుద్యోగుల సంఖ్య 2017లో 19.27 కోట్లు కాగా 2018లో 19.23 కోట్లు ఉంటోందని ఐఎల్‌ఓ చెప్పిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ప్రభుత్వం యువత కోసం తన ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న వాగ్దానాలను గాలికొదిలేసిందన్నారు. ఉద్యోగ మిత్ర పథకాన్ని ప్రవేశపెట్టి ఇంటికొక ఉద్యోగం ఇస్తారా అంటే ఆ ఊసే లేదన్నారు.

మున్సిపల్ టీచర్ల పదోన్నతులకు షెడ్యూల్

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 31: రాష్ట్రంలోని మున్సిపల్ ఉపాధ్యాయులకు తాజాగా పదోన్నతుల షెడ్యూల్ విడుదలైంది. ఫిబ్రవరి 5 నుండి 7వ తేదీ వరకు సీనియార్టీ జాబితాల తయారీ, 8 నుండి 14వ తేదీ వరకు సీనియార్టీ జాబితాలపై అభ్యంతరాలు, 15 నుండి 16వ తేదీ వరకు అభ్యంతరాల పరిష్కారం, 17 నుండి 20వ తేదీ వరకు ప్యానల్ కమిటీ మీటింగ్, 21 నుండి 24వ తేదీ వరకు ప్రమోషన్స్ కౌన్సిలింగ్ నిర్వహణ, 25 నుండి 26వ తేదీ వరకు ఉత్తర్వులు జారీ ప్రక్రియ ఎట్టకేలకు షెడ్యూల్ విడుదల పట్ల ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం హర్షం వెలిబుచ్చారు.

పేరూరు, బీటీపీ కింద 50 వేల ఎకరాలకు సాగునీరు

ఆంధ్రభూమి బ్యూరో

అనంతపురం, జనవరి 31: అనంతపురం జిల్లాలోని పేరూరు, బీటీ ప్రాజెక్టు ద్వారా 50 వేల ఎకరాలకు సాగునీరు అందించనున్నామని, ఇందుకు అవసరమైన పనుల నిమిత్తం రూ.1771 కోట్ల నిధులను మంజూరు చేశామని రాష్ట్ర జల వనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తెలిపారు. బుధవారం జిల్లాలోని చెన్నేకొత్తపల్లి, బ్రహ్మసముద్రం మండలాల్లో మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని చెరువులన్నింటినీ కృష్ణాజలాలతో నింపి సస్యశ్యామలం చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారన్నారు. పరిటాల వర్ధంతి సందర్భంగా పేరూరు, బీటీ ప్రాజెక్టు పనుల నిమిత్తం ప్రత్యేక జీఓ జారీ చేశారని, పేరూరు ప్రాజెక్టుకు రూ.802 కోట్లు, బీటీ ప్రాజెక్టుకు రూ.969 కోట్లు విడుదల చేశారన్నారు. ఫిబ్రవరిలో వీటి నిర్మాణ పనులకు టెండర్లు పిలిచి ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేసి నీటిని నింపుతామని అన్నారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ విజ్ఞప్తి మేరకు లేపాక్షికి నీరందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. పెనుకొండ, పుట్టపర్తి, మడకశిర నియోజకవర్గాల్లోని చెరువులన్నింటినీ కృష్ణాజలాలతో నింపుతామని మంత్రి చెప్పారు.

రొయ్యల సాగులో యాంటీ బయాటిక్స్ నిరోధించాలి

- ★ అనధికార చెరువులను రిజిస్టర్ చేయాల్సిందే
- ★ త్వరలో మత్స్య విశ్వవిద్యాలయం ఏర్పాటు
- ★ రొయ్యల రైతు సమాఖ్య సమావేశంలో మంత్రి ఆదినారాయణరెడ్డి

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 31: దేశంలోనే రొయ్యల ఎగుమతిలో ప్రథమ స్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో ఉత్పత్తి అవుతున్న రొయ్యల్లో ఎలాంటి యాంటీ బయోటిక్స్ అవశేషాలు లేకుండా పటిష్ఠ చర్యలు తీసుకొనేలా రాష్ట్ర ప్రభుత్వం సమాయత్తం అవుతోందని రాష్ట్ర మార్కెటింగ్, గిడ్డంగులు, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ, మత్స్య పరిశ్రమ, సహకార శాఖల మంత్రి ఆదినారాయణరెడ్డి చెప్పారు. రాష్ట్రంలో రూ. 20వేల కోట్ల విలువైన రొయ్యలు, రూ. 40 కోట్ల విలువ మేరకు చేపల ఉత్పత్తి అవుతున్నాయని మంత్రి వివరించారు. అనధికారికంగా ఉన్న రొయ్యల చెరువుల్ని గుర్తించి వాటన్నింటినీ రిజిస్టర్ చేయాలని మంత్రి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఎక్కడా రిజిస్టర్ కాని రొయ్యల చెరువులు ఉండరాదని స్పష్టం చేశారు. లైసెన్సుల రెన్యూవల్ పరిధిని ఏడాదికి కాకుండా గడువు పెంచాలని మంత్రి అధికారులకు సూచించారు. రొయ్యలు, మత్స్య ఉత్పత్తులను మరింతగా పెంచాలన్నది లక్ష్యమని తెలిపారు. రొయ్యల ఎగుమతుల్లో మనే రాష్ట్రానికి సంబంధించి రిజక్షన్ శాతం తక్కువే అయినా, అది కూడా లేకుండా చేసేందుకు చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. కేంద్రం ఆధ్వర్యంలోని ఎగుమతి తనిఖీ మండలి, ఎంపెడాతో పాటు మన రాష్ట్ర అధికారులు ఒక కమిటీగా ఏర్పాటై రొయ్యల్లో ఏలాంటి అవశేషాల్లేవని సర్టిఫై చేసేలా ఏర్పాట్లు ఉండాలంటే ఏం చేయాలనే అంశంపై పరిశీలించాలని మంత్రి అధికారులను కోరారు. ఈ సందర్భంగా సచివాలయంలో మంత్రి బుధవారం అఖిల భారత రొయ్యల సాగు రైతుల సమాఖ్య ప్రతినిధులు, మత్స్యశాఖ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈక్వెడార్‌లో యాంటీ బయోటిక్స్ వినియోగించకుండా రొయ్యల సాగు ఏళ్ల తరబడి సాగుతోందని, ఇందుకు శాస్త్రవేత్త యహీరా సలహా సంప్రదింపులతో పాటు ఆమె పర్యవేక్షణే కారణమని సమాఖ్య ప్రతినిధులు ఈ సమావేశంలో వివరించారు. ఆమె సలహా, సంప్రదింపులు రాష్ట్ర ప్రభుత్వం కూడా తీసుకోవాలని సమాఖ్య కోరింది. రొయ్య పిల్లల పెంపకంలో యాంటి బయోటిక్స్ అవశేషాలు 37 శాతం వరకు ఉంటుండగా, రొయ్యల సాగులో ఈ శాతం 0.25గా ఉంటోందని సమాఖ్య ప్రతినిధులు తెలిపారు. రొయ్యల సాగులో యాంటీ బయోటిక్స్ వినియోగం పూర్తిగా నిషేధించాలన్నది తమ కృతనిశ్చయమని కార్యాచరణ కూడా రూపొందించి అమలు చేయనున్నామని అన్నారు. ప్రైవేట్ ఆధ్వర్యంలో ప్రయోగశాలలు ఏర్పాటయ్యేలా చూసి ఆ సిబ్బందికి ప్రభుత్వం తమ డ్రగ్ కంట్రోలర్ ద్వారా శిక్షణ ఇవ్వాలని సమాఖ్య ప్రతినిధులు ప్రతిపాదించారు. సమాఖ్య ప్రతిపాదనలన్నింటినీ మరింత లోతుగా పరిశీలించి అమలు సాధ్యాసాధ్యాలను నిర్ణయించి తగు చర్యలు తీసుకుంటామని మంత్రి అన్నారు. మత్స్య విశ్వవిద్యాలయాన్ని ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంలో ఏర్పాటు చేయనున్నామని మంత్రి చెప్పారు. రొయ్యలు, చేపల సాగును విస్తృతం చేయడం వల్ల ఉపాధి అవకాశాలు పెరగడంతోపాటు ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని, రాష్ట్ర జీడీపీ కూడా పెరుగుతుందని అందుకే తాము ఇప్పుడీ విషయమై మరింత శ్రద్ధ తీసుకుంటున్నామని వివరించారు. మత్స్య విశ్వవిద్యాలయం ఏర్పాటైతే పరిశోధనలకు అవకాశంతోపాటు ఆక్వా రంగంలో శాస్త్రవేత్తల కొరత కూడా తీరుతుందని అన్నారు. అంతర్వేదిలో షిపింగ్ హార్బర్ ఏర్పాటులో జరుగుతున్న జాప్యం పైన మంత్రి సమీక్షించి ఆగిన పనులు త్వరగా చేపట్టడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పశుసంవర్ధక, మత్స్య శాఖల ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, మత్స్యశాఖ కమిషనర్ రాంశంకర్ నాయక్, మత్స్యశాఖ అదనపు కమిషనర్ సీతారాంరాజు, అఖిల భారత రొయ్యల రైతు సమాఖ్య అధ్యక్షుడు ప్రసాద యోహన్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాలసుబ్రమణ్యం సమావేశంలో పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆదినారాయణరెడ్డి

పంటల ధ్వంసానికి యత్నం..ఉద్రిక్తత



బ్లేడ్ ట్రాక్టరు ముందు బైఠాయించిన రైతులు, రైతుకూలీలు

జంగారెడ్డిగూడెం/జీలుగుమిల్లి, జనవరి 31: పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు ఇళ్ల నిర్మాణానికి సేకరించిన భూముల్లో సాగుచేస్తున్న పంటలను ధ్వంసం చేయడానికి అధికారులు చేసిన ప్రయత్నాలను రైతులు అడ్డుకోవడంతో బుధవారం పశ్చిమ గోదావరి జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. జీలుగుమిల్లి మండలం దర్భగూడెం గ్రామంలో సాగుచేస్తున్న పొగాకు, మొక్కజొన్న పంటలను ధ్వంసం చేయడానికి అధికారులు చేసిన ప్రయత్నాలను రైతులు, రైతుకూలీలు అడ్డుకున్నారు. దీనితో పోలీసులు లాఠీలకు పని చెప్పి, అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలావున్నాయి... పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కోసం జీలుగుమిల్లి మండలంలోని దర్భగూడెం, పి.నారాయణపురం, రాచన్నగూడెం, ములగలంపల్లి, స్వర్ణవారిగూడెం పంచాయతీల్లో ప్రభుత్వం నాలుగు వేల ఎకరాల భూమి సేకరించింది. ఈ భూముల్లో కొంతమేర పునరావాస కాలనీలు నిర్మించడానికి ఉద్దేశించగా, మిగిలిన భూమిని నిర్వాసిత గిరిజనులకు భూమికి భూమిగా పంపిణీచేయాలని నిర్దేశించారు. ఇందులో కొంత భూమిని వేలేరుపాడు మండలం కొయిదా గ్రామానికి చెందిన నిర్వాసిత గిరిజనులకు భూమికి భూమిగా పట్టాలిచ్చారు. అలాగే ఇక్కడ మోడల్ కాలనీ నిర్మించాలని నిర్ణయించారు. అయితే, ఈ భూమిని నిర్వాసితులు కౌలుకు ఇవ్వడంతో కౌలు రైతులు పొగాకు, మొక్కజొన్న పంటలువేశారు. నిబంధనల ప్రకారం నిర్వాసితులకు పంపిణీచేసిన భూమిని కౌలుకు ఇవ్వకూడదు. అలాగే మోడల్ కాలనీ నిర్మించతలపెట్టిన భూమిలో కూడా పంటలు వేయడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు బుధవారం పంటలను ధ్వంసం చేయడానికి ట్రాక్టర్లతో అక్కడకు చేరుకున్నారు. అయితే ఒక నెల గడువు ఇస్తే పంటలు చేతికివస్తాయని, అప్పుడు ఖాళీచేసి భూములు అప్పగిస్తామని రైతులు కోరారు. అధికారులు సమ్మతించకపోవడంతో రైతులు వారితో వాగ్వివాదానికి దిగి, ఆందోళన చేపట్టారు. పంటలు ధ్వంసం చేయడానికి తీసుకొచ్చిన ట్రాక్టర్‌ను అడ్డుకున్నారు. దీనితో పోలీసులు లాఠీఛార్జి చేశారు.

పోలవరం నిర్వాసితులకు పరిహారం చెల్లించాలి:గిడుగు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 31: పోలవరం నిర్వాసితులకు పరిహారం చెల్లించాలని మాజీ ఎమ్మెల్సీ, ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి గిడుగు రుద్రరాజు బుధవారం డిమాండ్ చేశారు. పోలవరం ఆర్ ఆర్ ప్యాకేజీ వల్ల నిర్వాసితులు తీవ్రంగా నష్టపోయారంటూ, 18 ముంపు గ్రామాల నిర్వాసితుల సమస్యలపై కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని స్పష్టం చేశారు. నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పోలవరం పనులపై సమీక్షించి, పనులను కొత్త కాంట్రాక్టర్‌కు అప్పగించే అంశంపై ఒక స్పష్టత ఇవ్వడం కాంగ్రెస్ పార్టీ పోరాటాల ఫలితమేనని రుద్రరాజు పేర్కొన్నారు. 7 నుంచి పోలవరం నిర్మాణం సత్వరం జరగాలని కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మహాపాదయాత్రను, 10న సామూహిక సత్యాగ్రహం నిర్వహించిన విషయం గుర్తు చేశారు. కాంట్రాక్టర్ విషయంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కీలక నిర్ణయం తీసుకున్నారని అన్నారు.



కడప పెద్ద దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఏఆర్ రెహ్మాన్

కడప పెద్ద దర్గాను సందర్శించిన సంగీత దర్శకుడు ఏఆర్ రెహ్మాన్

కడప కల్చరల్, జనవరి 31: కడప నగరంలోని ప్రఖ్యాతి గాంచిన అమీన్ పీర్ దర్గా (పెద్దదర్గా)ను సినీ సంగీత దర్శకుడు ఏఆర్.రెహ్మాన్ బుధవారం తెల్లవారుజామున సందర్శించారు. పెద్దదర్గా ఉరుసు జరుగుతున్నందున కుటుంబసభ్యులతో కలిసి వచ్చిన రెహ్మాన్ తొలుత దర్గా పీఠాధిపతి ఆరిఫుల్లా ఆశీస్సులు పొందారు. అనంతరం గంధం ఉత్సవంలో పాల్గొన్నారు. ప్రధాన గురువుల మజార్ల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా దర్గాపీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరిఫుల్లా హుస్సేని సాహెబ్ ఆధ్వర్యంలో ముషాయిరా హాల్‌లో జరిగిన ఖవ్వాలి కార్యక్రమంలో రెహ్మాన్ పాల్గొన్నారు.

1వ పేజీ తరువాయి

ఆపన్నులా.. సంపన్నులా?

ఉన్నారని బీజేపీ భావిస్తోంది. వీరి కోపాన్ని తగ్గించే దిశగా అరుణ్ జైట్లీ కొన్ని నిర్ణయాలు తీసుకోవలసి ఉంటుందని బీజేపీ నాయకులు చెబుతున్నారు. ఇదిలాఉంటే దేశంలో ఉపాధి అవకాశాల పెరుగుదల, పారిశ్రామికాభివృద్ధి పుంజుకునేందుకు అవసరమైన చర్యలను బడ్జెట్‌లో పొందుపరిచే అవకాశాలున్నాయని అటున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ ముడి చమురు ధర 70 డాలర్లకు చేరుకోవటంతో ఆర్థిక ఇరకాటంలో పడిన నరేంద్ర మోదీ ప్రభుత్వం 2018 వార్షిక బడ్జెట్‌లో ఏ మేరకు రాయితీలు ప్రకటించ గలుగుతుందనేది చర్చనీయాంశంగా మారింది. ఇది ఎన్నికల సంవత్సరమైనందున అరుణ్ జైట్లీ రేపటి బడ్జెట్‌లో కొన్ని రాయితీలైనా ప్రకటించకతప్పదని అంటున్నారు. మార్కెట్ సంస్కరణలు చేపట్టటం ద్వారా రైతులకు గిట్టుబాటు ధరలు లభించేలా చూసేందుకు కొన్ని చర్యలు ప్రకటించవచ్చునని అంటున్నారు. రైతులకు పెద్దఎత్తున రుణ సౌకర్యాలు ప్రకటించటంతోపాటు పంటల బీమా పథకం పరిధిని విస్తరించటం ద్వారా రైతుల మెప్పు పొందేందుకు ప్రయత్నించవచ్చుననే మాట వినిపిస్తోంది. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి దేశంలోని వివిధ వర్గాల ప్రజలకు ఇచ్చే రాయితీల శాతం 15.50 శాతం నుండి 11.20 శాతానికి పడిపోయింది. అయితే మోదీ ప్రభుత్వం వివిధ రాష్ట్రాల శాసనసభల ఎన్నికలు, ఆ తరువాత వచ్చే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రాయితీల శాతాన్ని కొంతైనా పెంచకతప్పదని చెబుతున్నారు.

ఆయనే పెద్ద కమర్షియల్!

రెండు మారుతీ కార్లు, ఒక ఎకోస్పోర్ట్స్ కారు, రెండు ద్విచక్ర వాహనాలు లభ్యమైనట్టు ఏసీబీ అధికారులు వెల్లడించారు. ఆదాయానికి మించి ఆరు కోట్ల రూపాయల అక్రమాస్తులు వెలుగు చూశాయని ఏసీబీ అధికారులు చెపుతున్నారు. మార్కెట్ ధరతో పోల్చి చూస్తే 60 కోట్లకు పైమాటేనని తెలుస్తోంది.

లక్ష్మీప్రసాద్ ప్రస్తుతం విజవాయడలోని కమర్షియల్ టాక్స్ కార్యాలయంలో చీఫ్ కమిషనర్‌గా పనిచేస్తున్నాడు. లక్ష్మీ ప్రసాద్‌ను అరెస్ట్ చేసి విశాఖకు తీసుకువస్తున్నామని కేసు దర్యాప్తు జరుపుతున్న విశాఖ రేంజ్ డీఎస్పీ రామకృష్ణప్రసాద్ వెల్లడించారు. గురువారం అతనిని ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్టు రామకృష్ణ ప్రసాద్ వెల్లడించారు.

దేశంలోనే తొలిసారి ఈ-భూసేవ

సమాచారం రెవెన్యూ, రిజిస్ట్రేషన్, సర్వే, మున్సిపల్, పంచాయతీరాజ్, అటవీశాఖకు సంబంధించిన సమాచారాన్ని అందుబాటులో ఉంచుతామన్నారు. మొత్తం 2.84 లక్షల వ్యవసాయ భూముల వివరాలతోపాటు 50 లక్షల పట్టణ ఆస్తులు, 85 లక్షల గ్రామీణ ఆస్తుల వివరాలను దీని ద్వారా పొందవచ్చన్నారు. జగ్గయ్యపేట మండలంలోని 24 గ్రామాలు, ఉయ్యూరు మున్సిపాల్టీలో ప్రయోగాత్మకంగా పైలెట్ ప్రాజెక్టు చేపట్టామని, అది ఫిబ్రవరి 15 నాటికి పూర్తవుతుందని, అక్టోబర్ నాటికి రాష్ట్రమంతటా ప్రాజెక్టుని అమలు చేస్తామన్నారు. దేశంలోనే ఈ తహాలో ప్రాజెక్టు ఎక్కడా అమలులో లేదని, రాష్ట్రంలోనే తొలిసారిగా అమలు చేస్తున్నామని తెలిపారు. రైతుల సమయం, డబ్బు ఆదా చేయాలనే ఉద్దేశ్యంతోనే ఆటోమ్యాటేషన్ ప్రక్రియకు శ్రీకారం చుట్టామని ఉప ముఖ్యమంత్రి అన్నారు. ఇందుకోసం రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల అనుసంధానం చేస్తున్నామన్నారు. వ్యవసాయ భూముల కొనుగోలు, అమ్మకాలు జరిగిన వెంటనే రెవెన్యూ రికార్డుల్లో ఆటోమేటిక్‌గా కొత్త యజమాని పేరు నమోదయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆటోమ్యూటేషన్ అయిన వెంటనే రైతుకు లేదా భూ యజమానికి ఎస్‌ఎంఎస్, ఈ మెయిల్ ద్వారా వివరాలు తెలియజేస్తామన్నారు. రికార్డుల్లో పేరు నమోదైనప్పటికీ 30 రోజుల వరకు ఎలాంటి లావాదేవీలు జరగకుండా, దీనికి నోషనల్ ఖాతా నెంబర్ ఇస్తామన్నారు. రిజిస్ట్రేషన్ జరిగిన తరువాత సంబంధిత భూమి రిజిస్ట్రేషన్‌కి సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదు చేయవచ్చని, అన్ని అభ్యంతరాలు పరిష్కారమైన తరువాత రెవెన్యూ రికార్డుల్లో శాశ్వత ఖాతా ఇస్తామన్నారు. గడచిన మూడు సంవత్సరాల్లో రెవెన్యూ శాఖలో అనేక సంస్కరణలు తీసుకువచ్చామన్నారు. రెవెన్యూ శాఖలో తాము తీసుకొచ్చిన ఈ-పంట, లోన్‌ఛార్జ్ క్రియేషన్ మాడ్యూల్ ఈ-పట్టాదారు పాసుపుస్తకం, టైటిల్ డీడ్‌కు జాతీయ స్థాయిలో ఈ గవర్నెన్స్ క్యాటగిరీ కింద అవార్డులు వచ్చాయని ఉప ముఖ్యమంత్రి వివరించారు.

60 ఏళ్ల తర్వాత అరుదైన వైభవం

నామ సంవత్సరంలోనే జన్మించడంతో ఈసారి జరిగే కల్యాణానికి ఈ ప్రత్యేకత ఉంది. చివరిగా 1958లో ఈ అరుదైన ఘట్టం చోటు చేసుకోగా తిరిగి 60 ఏళ్లకు భక్తులకు ఈ భాగ్యం దక్కనుందని భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అర్చకులు పొడిచేటి జగన్నాథాచార్యులు తెలిపారు.

మార్చి 26న శ్రీరామనవమి

దేశంలో శ్రీరామ నవమి తేదీకి కొలమానం భద్రాచల శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం వైదిక కమిటీదే. ఈసారి మార్చి 26న తేదీన శ్రీ రామనవమి శ్రీ సీతారాముల కల్యాణం నిర్వహించాలని దేవస్థానం వైదిక కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు సీతారామచంద్రస్వామి వసంత పక్ష ప్రయుక్త నవాహ్నిక శ్రీరామ నవమి తిరు కల్యాణ బ్రహ్మోత్సవాలు మార్చి 18వ తేదీ నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు నిర్వహించనున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో మార్చి 18న ఉగాది వేళ బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానుండగా మార్చి 22న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ, 23న ధ్వజపట భద్రక మండల చిత్ర లేఖనం, 24న అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం, 25న ఎదుర్కోలు, 26న శ్రీరామనవమి, 27న మహాపట్టాభిషేకం, 28న సదస్యం, 29న చోరోత్సవం, 30న ఊంజల్ సేవ, 31న వసంతోత్సవం, ఏప్రిల్ 1న చక్రతీర్థంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ అర్చకులు వివరించారు.

అంబరవీధిలో అద్భుతం!

చందమామ త్రిపాత్రాభినయం ▪ మూడు రంగుల్లో పండువెన్నెల

న్యూఢిల్లీ, జనవరి 31: ఆకాశవీధిలో బుధవారం రాత్రి అరుదైన అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. పౌర్ణమి రోజున పండువెన్నెలను పంచే చంద్రుడు మూడు రంగుల్లో దర్శనం ఇచ్చి వీక్షకులకు కనువిందు చేశాడు.. మరపురాని మధురానుభూతిని మిగిల్చాడు.. ‘సూపర్ మూన్’, ‘బ్లడ్ మూన్’, ‘బ్లూ మూన్’ల పేరిట చంద్రుడు త్రిపాత్రాభినయం చేశాడు. అంబర వీధిలో ఈ ఘట్టాన్ని ‘సూపర్ బ్లూ బ్లడ్ మూన్’గా శాస్త్రవేత్తలు అభివర్ణించారు. 1982లో ఇలాంటి పరిణామం చోటు చేసుకుందని, మరలా 2037 వరకూ ఇలాంటి సందర్భం రాదని వారు తెలిపారు. భ్రమణ సమయంలో భూమికి చేరువగా వచ్చినపుడు సంభవించే పున్నమిని ‘సూపర్ మూన్’గా పిలుస్తారు. ఈ సమయంలో చంద్రుడు సాధారణ పౌర్ణమి నాడు కంటే పెద్దగా కనిపిస్తాడు. ఈ ఘట్టాన్ని స్పష్టంగా వీక్షించే అవకాశం ఉత్తర అమెరికా, తూర్పు ఆసియా వాసులకు దక్కింది. చంద్ర గ్రహణం సందర్భంగా ఆవిష్కృతమైన ఈ అరుదైన దృశ్యాన్ని వీక్షించి భారత్ సహా అనేక దేశాల్లో జనం మైమరచిపోయారు.



అమెరికాలోని స్టాట్యూ ఆఫ్ లిబర్టీ నుంచి కనువిందు చేసిన చంద్రగ్రహణం

రామచంద్రారెడ్డి ఎన్నిక పిటిషన్‌పై తీర్పు రిజర్వ్

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 31: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎన్నికను సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. 2014 ఎన్నికల్లో సమీప ప్రత్యర్థి అయిన మాదిరాజు వెంకట రమణ రాజు దాఖలు చేసిన పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని త్రిసభ్య బెంచ్ విచారణ ముగించి తీర్పును రిజర్వ్ చేసింది. రామచంద్రారెడ్డి దాఖలు చేసిన నామినేషన్ పత్రాల్లో పూర్తి వివరాలను పొందుపరచలేదని, అన్ని పేజీలపై సంతకం చేయలేదని ఆరోపించారు.

యాదాద్రికి గోల్డెన్ టచ్

భక్తులు సమర్పించిన 27 కిలోల బంగారంతో నర్సింహుడికి గోపురం

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 31: తెలంగాణ రాష్ట్రంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం గర్భగుడిని బంగారు రేకుతో అలంకరించాలని యాదగిరి టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ (వైటిడిఎ) నిర్ణయించింది. భక్తులు ఆలయానికి సమర్పించిన 37 కిలోల బంగారు ప్రస్తుతం అందుబాటులో ఉంది. ఈ బంగారాన్ని ఆలయ నిర్మాణానికి వినియోగించేందుకు దేవాదాయ శాఖ అంగీకరించింది. అందుబాటులో ఉన్న మొత్తం బంగారంలో 27 కిలోల బంగారాన్ని గర్భాలయం కోసం, మిగతా బంగారాన్ని ధ్వజస్తంభం, స్వామివారి శయనమందిరం కోసం వాడాలని నిర్ణయించారు. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి గర్భాలయాన్ని బంగారుతో తయారు చేసిన విషయం ఈ సందర్భంగా గమనార్హం. తెలంగాణలో ఇప్పటి వరకు ఏ ఆలయానికి కూడా బంగారుతో తయారు చేసిన గర్భగుడి లేదు. యాదగిరి నర్సింహస్వామి ఆలయం తెలంగాణలో మొట్టమొదటి బంగారు గర్భాలయం అవుతుంది. గర్భాలయంతో పాటు మొత్తం ఏడుగోపురాలు ఈ ఆలయానికి ఉంటాయి. 47 ఫీట్ల ఎత్తు ఉండే గర్భాలయం మొత్తం 32 లేయర్లతో నిర్మిస్తున్నారు. కె. చంద్రశేఖరరావు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత యాదగిరి లక్ష్మీనర్సింహస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఈ నిర్ణయంలో భాగంగా వైటిడిఎ ఏర్పాటు చేశారు. దీనికి మాజీ ఐఎఎస్ అధికారి జి. కిషన్‌రావును వైస్-చైర్మన్‌గా, మరికొందరు ప్రముఖులను సభ్యులుగా నియమించారు. వైటిడిఎ, దేవాదాయ, గనులు తదితర శాఖల అధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఆలయ నిర్మాణానికి కావలసిన మెటల్‌ను ఈ కమిటీ ఎంపిక చేస్తుంది. గతంలో ఉన్న ప్రధాన గుడిని పూర్తిగా అభివృద్ధి చేస్తున్నారు. యాదగిరి గుట్టను 100 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తున్నారు. కెసిఆర్ స్వయంగా ఈ ఆలయ అభివృద్ధి పనులను తరచూ పర్యవేక్షిస్తున్నారు. దేవాదాయ శాఖ ప్రమేయం ఏమీ లేకుండా ఆలయ అభివృద్ధిని వైటిడిఎకు అప్పగించారు. గర్భాలయంతో పాటు ఆలయం ఎదుట ఉండే ధ్వజస్తంభం, శయనశాలను కూడా బంగారు రేకుతో అలంకరిస్తున్నారు. ఆలయ ప్రధాన ద్వారాలను వెండితో తయారు చేస్తున్నారు. యాదాద్రి ఆలయం పునర్నిర్మాణంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు తదితర రాష్ట్రాలకు చెందిన సుమారు 500 మంది శిల్పులు పాల్గొంటున్నారు.



క్రీడ

కొత్త ఫార్మాట్‌లో.. కొత్త ఉత్సాహంతో..

నేడు దక్షిణాఫ్రికాతో మొదటి వన్డే



నెట్స్‌లో భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ

దర్బన్, జనవరి 31: వన్డే ఇంటర్నేషనల్స్‌లో చెప్పుకోదగ్గ స్థాయిలో ఆడగలమన్న నమ్మకం... జొహానె్నస్‌బర్గ్‌లో జరిగిన చివరి టెస్టులో విజయం సాధించడంతో వచ్చిన రెట్టించిన ఆత్మవిశ్వాసం భారత క్రికెట్ జట్టులో కొత్త ఉత్సాహాన్ని నింపింది. దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌ను 1-2 తేడాతో చేజార్చుకున్నప్పటికీ, ఆరు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను కైవసం చేసుకోవడం ద్వారా ప్రతీకారం తీర్చుకోవాలని విరాట్ కోహ్లీ నాయకత్వంలోని టీమిండియా పట్టుదలతో ఉంది. అంతేగాక, రాబోయే టూర్లు, సిరీస్‌లను కూడా దృష్టిలో ఉంచుకొని, ఈ సిరీస్‌ను సన్నాహక ఈవెంట్‌గా తీసుకుంది. గురువారం ఇక్కడ జరిగే మొదటి వన్డేతోనే విజయ పరంపరలకు శ్రీకారం చుట్టాలని ఆశిస్తున్నది. దక్షిణాఫ్రికాలో ఆరు వన్డేలతోపాటు, మరో మూడు టీ-20 మ్యాచ్‌లను కూడా భారత్ ఆడుతుంది. ఆతర్వాత శ్రీలంకలో జరిగే టీ-20 ముక్కోణపు టోర్నీలో ఆడుతుంది. అనంతరం ఇంగ్లాండ్, ఐర్లాండ్ పర్యటనకు వెళ్లి, మూడు వన్డేలు, మరో మూడు టీ-20 ఇంటర్నేషనల్స్‌లో పోటీపడుతుంది. అదే సమయంలో ఈఏడాది ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎస్) సీజన్ మొదలవుతుంది. ఆ తర్వాత ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ కోసం ఇంగ్లాండ్ వెళుతుంది. 2019 ప్రపంచ కప్ టోర్నీని దృష్టిలో ఉంచుకొని, పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో టీమిండియా ఎక్కువ మ్యాచ్‌లు ఆడేలా బీసీసీఐ షెడ్యూల్‌ను ఖరారు చేసింది. చాలాకాలంగా ఇబ్బంది పెడుతున్న కొద్ది స్థానాల్లో సరైన ఆటగాళ్లను అన్వేషించడానికి లేదా ఎంపిక చేసి, ఇప్పటి నుంచి ఆ దిశగా తగినన్ని అవకాశాలు ఇవ్వడానికి దక్షిణాఫ్రికాతో జరిగే వన్డే, టీ-20 సిరీస్‌లను మించిన ప్రారంభం మరొకటి ఉండదని బీసీసీఐ అభిప్రాయపడుతున్నది. టీమిండియా టెస్టుల్లో అంతగా రాణించలేకపోయిన టీమిండియా కూడా కొత్త ఫార్మాట్‌లో సిరీస్‌లకు అన్ని విధాలా సిద్ధమైంది. వన్డేల్లో తిరుగులేని రికార్డులు నెలకొల్పిన రోహిత్ శర్మ టెస్టుల్లో విఫలమైనప్పటికీ, ఈ సిరీస్‌లో మళ్లీ సత్తా చాటుతాడని అటు జట్టు మేనేజ్‌మెంట్, ఇటు అభిమానులు ఆశిస్తున్నారు. మిగతా ఆటగాళ్లకు కూడా వన్డే ఫార్మాట్‌లో మంచి ట్రాక్ రికార్డే ఉంది. అందుకే, సరికొత్త ఫార్మాట్‌లో సరికొత్త ఉత్సాహంతో విరుచుకుపడి, దక్షిణాఫ్రికాను చిత్తు చేసేందుకు కోహ్లీ సేన సంసిద్ధమైంది.

దక్షిణాఫ్రికాలో భారత క్రికెట్ జట్టు అద్భుతాలు ప్రదర్శించిన సందర్భాలు లేవు. వన్డేల్లో రికార్డు మరింత అధ్వాన్నంగా ఉంది. 1992-93లో ఏడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-5 తేడాతో చేజార్చుకుంది. 2006-07లో 0-4, తిరిగి 2010-11లో 2-3 తేడాతో పరాజయాలను చేజార్చుకుంది. 2013-14లో చివరిసారి దక్షిణాఫ్రికాలో వన్డే సిరీస్ ఆడినప్పుడు 0-2 తేడాతో ఓటమిపాలైంది. కాగా, 1996=97లో తిరిగి 2001-02లో అక్కడ జరిగిన ముక్కోణపు వన్డే సిరీస్‌ల్లో కూడా టీమిండియా ఆడింది. జింబాబ్వే, కెన్యా జట్లపై విజయాలను నమోదు చేసినప్పటికీ, దయిణాఫ్రికాను ఓడించలేకపోయింది. ఆ రెండు ట్రై సిరీస్‌ల్లోనూ దక్షిణాఫ్రికా విజేతగా నిలిచింది. మొత్తం మీద, జాత్యాహంకాన్ని ప్రదర్శిస్తున్న కారణంగా నిషేధానికి గురై, 1992లో సస్పెన్షన్‌ను ఐసీసీ ఎత్తివేయడంతో తిరిగి అంతర్జాతీయ క్రికెట్‌లోకి దక్షిణాఫ్రికా అడుగుపెట్టింది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ దక్షిణాఫ్రికాలో భారత జట్టు మొత్తం 26 వన్డేలు ఆడింది. వాటిలో కేవలం ఐదింటిని మాత్రమే గెల్చుకుంది. మిగతా 21 వన్డేల్లో పరాజయాలను చవిచూసింది. ఈ అంశం కూడా కోహ్లీ బృందాన్ని వేధిస్తున్నది. పరాజయాల బాట నుంచి బయటపడి, దక్షిణాఫ్రికాలో తొలిసారి వన్డే సిరీస్‌ను సాధించాలని ఆశిస్తున్న టీమిండియా ఆ స్థాయిలో పోరాడుతుందో, లేదో చూడాలి.

శ్రీలంకతో జరిగిన వన్డే, టీ-20 సిరీస్‌ల నుంచి విశ్రాంతి తీసుకున్న కెప్టెన్ విరాట్ కోహ్లీ మళ్లీ పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో పగ్గాలు చేపట్టడంతో, మిడిల్ ఆర్డర్‌లో కేవలం ఒక స్థానం మాత్రమే ఖాళీగా కనిపిస్తున్నది. శ్రీలంకతో జరిగిన సిరీస్‌లో ఆడిన శ్రేయాస్ అయ్యర్ మూడు మ్యాచ్‌ల్లో రెండు అర్ధ శతకాలు సాధించి తనను తాను నిరూపించుకున్నాడు. ఈ స్థానానికి అతనితోపాటు దినేష్ కార్తీక్, మనీష్ పాండే తీవ్రంగా పోటీపడుతున్నారు. వీరిలో ఎవరికి ప్లేయింగ్ ఎలెవెన్‌లో ఆడే అవకాశం దక్కుతుందనేది ఆసక్తి రేపుతున్నది.

దర్బన్ స్టేడియంలో భారత జట్టు ఇంత వరకూ ఒక్క వన్డేను కూడా గెల్చుకోలేకపోయింది. ఇక్కడ దక్షిణాఫ్రికాతో ఏడు మ్యాచ్‌లు ఆడిన టీమిండియా ఆరు పరాజయాలను చవిచూసింది. ఒక మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. ఇప్పుడు కోహ్లీ సేన కొత్త శకానికి శ్రీకారం చుట్టాలని అభిమానులు కోరుకుంటున్నారు. కోహ్లీ, రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, అజింక్య రహానే, మహేంద్ర సింగ్ ధోనీ, భువనేశ్వర్ కుమార్, కుల్దీప్ యాదవ్ వంటి హేమాహేమీలు ఉన్న భారత జట్టు వారి ఆశయాలను నెరవేర్చే దిశగా ఎంత వరకూ ప్రయత్నం చేస్తుందనేదే ప్రశ్న. 2003 వరల్డ్ కప్‌లో భాగంగా ఈ మైదానంలో ఇంగ్లాండ్, కెన్యా జట్లను ఓడించిన అనుభవం భారత్‌కు ఉంది. ఇక్కడ టీమిండియా సాధించిన విజయాలు ఈ రెండే. దక్షిణాఫ్రికాను గురువారం నాటి మొదటి వన్డేలో ఓడిస్తే, కోహ్లీ సేన ఒక కొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతుంది.

∷ ఆస్ట్రేలియా చేతిలో 2016లో 1-4 తేడాతో పరాజయాన్ని ఎదుర్కొన్న తర్వాత, భారత్ ఇప్పటి వరకూ స్వదేశంలోగానీ, విదేశాల్లోగానీ ఒక్క ద్వైపాక్షిక సిరీస్‌ను కూడా కోల్పోలేదు. న్యూజిలాండ్, శ్రీలంక జట్లను రెండేసి పర్యాయాలు వన్డే సిరీస్‌ల్లో ఓడించింది. అదే విధంగా జింబాబ్వే, ఇంగ్లాండ్, వెస్టిండీస్, ఆస్ట్రేలియాపై ఒక్కో వన్డే సిరీస్‌ను సొంతం చేసుకుంది. మొత్తం మీద 2016 నుంచి ఇప్పటి వరకూ 32 ద్వైపాక్షిక వన్డే మ్యాచ్‌లు ఆడి, 24 మ్యాచ్‌ల్లో విజయభేరి మోగించింది. గత ఏడాది ఇంగ్లాండ్‌లో జరిగిన చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో పాకిస్తాన్ చేతిలో ఓడడాన్ని మినహాయిస్తే, ఏ టోర్నీలోనూ పరాజయాన్ని ఎదుర్కోలేదు. ఈ అద్భుతమైన రికార్డును కొనసాగించడమే ప్రధాన లక్ష్యంగా టీమిండియా బరిలోకి దిగనుంది.

∷ ప్రపంచ వన్డే ర్యాంకింగ్స్‌లో దక్షిణాఫ్రికా 120 పాయింట్లతో మొదటి స్థానంలో ఉండే, 119 పాయింట్లు సంపాదించిన భారత్‌ది రెండో స్థానం. ప్రపంచ మేటి జట్ల మధ్య జరిగే పోరు కాబట్టే వన్డే సిరీస్‌పై అభిమానుల్లో విపరీతమైన అంచనాలు ఉన్నాయి. ఈ సిరీస్‌ను కనీసం 4-2 తేడాతో కైవసం చేసుకుంటే, టీమిండియా నంబర్ వన్ స్థానానికి దూసుకెళుతుంది. ఈ అంశం కూడా కోహ్లీ సేన దృష్టిలో ఉంది.

రాయుడిపై వేటు

రెండు మ్యాచ్‌ల నుంచి సస్పెండ్ చేసిన బీసీసీఐ



న్యూఢిల్లీ, జనవరి 31: హైదరాబాద్ క్రికెట్ జట్టు కెప్టెన్ అంబటి రాయుడుపై భారత క్రికెట్ నియంత్రణ బోర్డు (బీసీసీఐ) సస్పెన్షన్ వేటు వేసింది. అతనిని రెండు మ్యాచ్‌ల నుంచి నిషేధిస్తున్నట్టు ప్రకటించింది. ముస్తాక్ అలీ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా కర్నాటకతో జరిగిన మ్యాచ్‌లో చోటు చేసుకున్న సంఘటనపై ఫీల్డ్ అంపైర్లు అభిజిత్ దేశ్‌ముఖ్, ఉల్హాస్ విఠల్‌రావు గాంధే, థర్డ్ అంపైర్ అనీల్ దండేకర్ చేసిన ఫిర్యాదుపై బీసీసీఐ స్పందిస్తూ ఈ నిర్ణయం తీసుకుంది. ఆ మ్యాచ్‌లో కర్నాటక బ్యాట్స్‌మన్ కరుణ్ నాయర్ డీప్ మిడ్ వికెట్ దిశగా కొట్టిన బంతి ఫోర్‌గా వెళ్లకుండా అడ్డుకునే ప్రయత్నంలో అక్కడ ఫీల్డింగ్ చేస్తున్న మెహదీ హసన్ కాలి బౌండరీ లైన్ రోప్‌కు తగిలింది. అయితే, ఫీల్డ్ అంపైర్లు ఈ విషయాన్ని గమనించలేదు. దానిని ఫోర్‌గా పరిగణించలేదు. నాయర్ రెండు పరుగులు చేయడంతో, వాటిని మాత్రమే స్కోరులోకి చేర్చారు. కర్నాటక ఐదు వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లకు 203 పరుగులు చేసింది. అయితే, హసన్ కాలు బౌండరీ లైన్‌కు తగిలిన విషయాన్ని మ్యాచ్ రిఫరీ దృష్టికి కర్నాటక కెప్టెన్ వినయ్ కుమార్ తీసుకెళ్లాడు. వీడియో రీప్లేను పరిశీలించిన తర్వాత, అతని వాదనతో ఏకీభవించిన అనీల్ దండేకర్ కర్నాటక ఖాతాలో మరో రెండు పరుగులను చేర్చి, హైదరాబాద్ లక్ష్యాన్ని 205 పరుగులుగా నిర్ధారించాడు. ఫలితంగా ఆ జట్టు రెండు పరుగుల తేడాతో పరాజయాన్ని చవిచూసింది. చివరి క్షణాల్లో లక్ష్యాన్ని మార్చడంపై అంబటి రాయుడు నిరసన వ్యక్తం చేశాడు. ఫీల్డ్ అంపైర్లపై ఆగ్రహించాడు. నిబంధనల ప్రకారం ఈ విధంగా ప్రవర్తించడం నేరం. మ్యాచ్ అంపైర్ల ఫిర్యాదు మేరకు ఈ సంఘటన వివరాలు తెలుసుకున్న బీసీసీఐ అంబటి రాయుడును రెండు మ్యాచ్‌ల నుంచి సస్పెండ్ చేసింది. ఈ కారణంగా అతను ఈనెల 5 నుంచి మొదలయ్యే విజయ్ హజారే టోర్నీలో సర్వీసెస్, జార్ఖండ్ జట్లతో జరిగే మ్యాచ్‌ల్లో అవకాశాన్ని కోల్పోయాడు.

విజయ్ హజారే ట్రోఫీలో

యువ సంచలనం పృథ్వీ షా



ముంబయి, జనవరి 31: భారత అండర్-19 కెప్టెన్, యువ సంచలన ఆటగాడు పృథ్వీ షా విజయ్ హజారే ట్రోఫీలో చోటు దక్కించుకున్నాడు. ఫిబ్రవరి 5 నుండి చెన్నైలో జరిగే ఇంటర్-స్టేట్ వన్డే ఇంటర్నేషనల్ టోర్నమెంటులో ఆడే 16 మంది సభ్యులు గల జట్టులో ఒకడిగా ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని ముంబయి క్రికెట్ అసోసియేషన్ ప్రకటించింది. ఈ జట్టుకు వికెట్ కీపర్, బ్యాట్స్‌మన్ అయిన ఆదిత్య థారే నాయకత్వం వహించనున్నాడు. ఇటీవల జరిగిన రంజీ ట్రోఫీ, సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నమెంట్ (టీ-20 ఫార్మాట్)లో ఓటమి చెందిన ముంబయి ఆటగాళ్లు ఇపుడు ఆడనున్న విజయ్ హజారే ట్రోఫీ ప్రతిష్టాత్మకం కానుంది. ఫిబ్రవరి 14వరకు ఈ టోర్నీ జరుగుతుంది. ముంబయి జట్టు తొలుత ఫిబ్రవరి 5న జరిగే తొలిమ్యాచ్‌లో మధ్యప్రదేశ్‌తో తలపడుతుంది.



న్యూఢిల్లీలో జరుగుతున్న ఇండియా ఓపెన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో మహిళల 48 కిలోల విభాగంలో ఫైనల్‌కు దూసుకెళ్లిన ప్రపంచ మాజీ చాంపియన్ మేరీ కోమ్ (కుడి). సెమీస్‌లో ఆమె మంగోలియాకు చెందిన అట్లాన్‌సెట్సెంగ్ లుసైకాన్‌ను ఓడించింది. కాగా, శివ థాపా, మనోజ్ కుమార్ తమతమ సెమీ ఫైనల్ ఫైట్స్‌లో పరాజయాలను ఎదుర్కొని, కాంస్య పతకాలతో సంతృప్తి చెందారు.



సైనా నెహ్వాల్

కాస్త విశ్రాంతినివ్వండి

బాడ్మింటన్ అధికారులకు సైనా లేఖ

న్యూఢిల్లీ, జనవరి 31: అవిశ్రాంతంగా టోర్నీలు, సిరీస్‌లు ఆడడం కష్టంగా ఉందని, తనకు విశ్రాంతి కావాలని భారత బాడ్మింటన్ సంఘం (బాయ్) అధికారులకు సూపర్ స్టార్ సైనా నెహ్వాల్ లేఖ రాసింది. ఫిబ్రవరి 6 నుంచి 11 వరకు మలేసియాలో జరిగే ఆసియా టీం చాంపియన్‌షిప్ పోటీల నుంచి తనను తప్పించాల్సిందిగా ఆమె తన లేఖలో కోరింది. జకార్తాలో ఇండోనేషియా ఓపెన్‌లో పాల్గొన్న ఆమె తగినంత విశ్రాంతి లేకుండానే స్వదేశంలో ఇండియా ఓపెన్ బాడ్మింటన్ టోర్నీలో ఆడుతున్నది. ఈ టోర్నమెంట్ ముగిసిన వెంటనే ఆసియా టీం చాంపియన్‌షిప్స్‌లో ఆడడం కష్టమని బాయ్‌కి రాసిన లేఖలో సైనా స్పష్టం చేసింది. మార్చి 14 నుంచి 18 వరకూ లండన్‌లో జరిగే ప్రతిష్ఠాత్మక ఆల్ ఇంగ్లాండ్ బాడ్మింటన్‌లో ఆడడానికి ముందు విశ్రాంతిని కోరుకుంటున్నట్టు ఆమె వివరించింది.

సోఫీపై గెలుపు

ఇండియన్ ఓపెన్ బాడ్మింటన్‌లో భాగంగా బుధవారం సోఫీ హోమ్‌బొయెదల్‌తో జరిగిన మ్యాచ్‌ని సైనా 21-15, 21-9 తేడాతో గెల్చుకుంది. సైనా విజృంభణకు సోఫీ ఏ దశలోనూ గట్టిపోటీని ఇవ్వలేకపోయింది. మరో మ్యాచ్‌లో పీవీ సింధు 21-10, 21-13 ఆధిక్యంతో నతాలియా కొచ్ రాటేను, రుత్విక శివానీ గద్దె 21-17, 21-10 తేడాతో అమిలీ హాజ్‌ను ఓడించారు. పురుషుల సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్ 21-17, 21-18 స్కోరుతో లీ చెంక్ ఇన్‌పై విజయం సాధించాడు. పారుపల్లి కశ్యప్ 21-14, 21-18 ఆధిక్యంతో హన్స్ క్రిస్టియన్ సోల్ట్‌బెర్గ్ విటింగస్‌ను ఓడించాడు. కాగా, సమీర్ వర్మ, అజయ్ జయరామ్ తమతమ ప్రత్యర్థుల చేతిలో పరాజయాలను చవిచూశారు.

మళ్లీ ఫాంలోకి వస్తా: శ్రీకాంత్

తాను మళ్లీ ఫాంలోకి వస్తానని భారత బాడ్మింటన్ స్టార్, ప్రపంచ మూడో నెంబర్ ఆటగాడస కిడాంబి శ్రీకాంత్ అన్నాడు. చిన్న గాయం కారణంగా ఈ సీజన్‌లో ప్రారంభమైన ఇండియా ఓపెన్‌లో డ్రాగా ముగిసిన నేపథ్యంలో కొద్ది రోజుల్లోనే తాను మళ్లీ పుంజుకుంటానని ధీమా వ్యక్తం చేశాడు. ఇటీవల జరిగిన ప్రీమియర్ బాడ్మింటన్ లీగ్ సందర్భంగా కడుపులో కండరాల నొప్పితో బాధపడిన శ్రీకాంత్ ఇండోనేషియా మాస్టర్ టోర్నీలో సైతం ఆడలేకపోయాడు. అనారోగ్య సమస్య కారణంగా ఈ సీజన్ ప్రారంభంలో సరిగా ఆడలేకపోయినా రానున్న టోర్నీలపై మరింత దృష్టి సారిస్తానని, మునుపటిలా దూసుకుపోతానని ధీమా వ్యక్తం చేశాడు. గత ఏడాది ముగిసిన సీజన్‌లో శ్రీకాంత్ ఆడిన ఐదు ఫైనల్ మ్యాచ్‌లలో నాలుగింటిలో గెలుపొంది టైటిల్స్ సాధించాడు. శ్రీకాంత్ చక్కటి ఆటతో రాణిస్తూ, ప్రపంచ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానం వరకూ వెళ్లగలిగాడు. కొత్త ఏడాది నంబర్ వన్‌గా నిలవడమే అంటున్న ఈ యువ ఆటగాడికి అనుకున్నది సాధించడం అసాధ్యమేమీ కాదు. ఇండోనేషియా సూపర్ సిరీస్ ప్రీమియర్, ఆస్ట్రేలియా ఓపెన్ సూపర్ సిరీస్, డెన్మార్క్ సూపర్ సిరీస్ ప్రీమియర్, ఫ్రెంచ్ సూపర్ సిరీస్ టోర్నీలను గెల్చుకొని, ఒక క్యాలెండర్ ఇయర్‌లో నాలుగు సూపర్ సిరీస్ టైటిళ్లను సాధించిన తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించిన శ్రీకాంత్ ఇకపై కూడాఅదే స్థాయిలో ఆడతాడని అభిమానుల విశ్వాసం.

క్లార్క్‌కు రుణపడి ఉంటా

ఐపీఎల్‌కు ఎంపికైన నేపాల్ యువ క్రికెటర్ సందీప్



సందీప్ లమిచ్‌హనే

న్యూఢిల్లీ, జనవరి 31: త్వరలో జరుగనున్న ఐపీఎల్ మ్యాచ్‌లో 20 లక్షల రూపాయలకు ఢిల్లీ డేర్ డెవిల్ జట్టు కొనుగోలు చేసిన 17 ఏళ్ల నేపాల్ క్రికెటర్ సందీప్ లమిచ్‌హనే ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మైకేల్ క్లార్క్ దృష్టిని ఆకర్షించాడు. లెగ్‌స్పిన్నర్‌గా మంచి పేరు తెచ్చుకున్న సందీప్ బౌలింగ్ ప్రతిభ తనను ఎంతో ఆకట్టుకుంటోందని క్లార్క్ ప్రశంసిస్తున్నాడు. కాగా, తనకు అండగా నిలిచిన క్లార్క్‌కు రుణపడి ఉంటానని సందీప్ చెప్పాడు. మేటి ఆటగాడైన స్మిత్ దీవెనలు తన ఎదుగుదలకు ఎంతో దోహదపడతాయని ఈ యువ సంచలనం పేర్కొన్నాడు. వాస్తవానికి ఐపీఎల్ మ్యాచ్‌లలో ఆడే తమ దేశ క్రికెటర్లను ఆటతీరును ఎప్పుడూ పొగడని క్లార్క్ ఒక యువ క్రికెటర్ ఆటతీరును అన్నివిధాల ప్రశంసిస్తున్నాడు. తన ఎదుగులకు మైకేల్ క్లార్క్ ప్రభావం చాలా ఉందని సందీప్ అన్నాడు. హాంకాంగ్ సిక్సెస్ మ్యాచ్ సందర్భంగా తన బౌలింగ్ తీరును స్వయంగా చూసిన క్లార్క్ గొప్ప మనిషని, ఒక క్రికెటర్‌గా తన ఎదుగుదలకు పరోక్షంగా సహకరిస్తున్నందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపాడు. తన బౌలింగ్‌ను చూసినప్పుడల్లా అతని ఆటతీరు తనెంతో ఆకట్టుకుంటోందని క్లార్క్ చెబుతుండగా అదంతా అతని పుణ్యమేనని సందీప్ అంటున్నాడు. ఇదిలావుండగా ఇటీవల జరిగిన ఐపీఎల్‌లో క్రికెటర్ల వేలం సందర్భంగా మైకేల్ క్లార్క్‌తో సంప్రదింపులు జరిపిన సందర్భంగా ఇచ్చిన సూచనలు ప్రశాంతంగా ఉండేందుకు దోహదపడ్డాయని సందీప్ అన్నాడు. సిడ్నీలోని వెస్టర్న్ సుబర్బ్స్ క్రికెట్ క్లబ్‌లో కొన్నాళ్ల కిందట తాను ఆడిన లీగ్ మ్యాచ్ తన జీవితంలో మరువలేనినది అన్నాడు. ఆ మ్యాచ్‌లో గెలుపు సాధించడం తనలాంటి యువ క్రికెటర్లకు మంచి మలుపని అభివర్ణించాడు. గుగ్లీ వేయడంలో దిట్టగా పేరుగాంచిన సందీప్ తమ జాతీయ కోచ్ రాజు ఖద్కా ఆధ్వర్యంలో ఈ దిశగా మరింత పరిణితి చెందానని అన్నాడు.

ఇదిలావుండగా ఐపీఎల్‌లో ఢిల్లీ డేర్ డెవిల్స్ జట్టుకు ఎంపికైన సందీప్ తనను ట్రయల్స్‌కు ఆహ్వానించిపుడు కోచ్‌లను సైతం తన ఆటతీరుతో ఆకట్టుకున్నాడు. ఏ సందర్భంలోనైనా ఆత్మవిశ్వాసం లేనపుడు ముందుకు సాగడం కష్టమన్న నానుడిని తాను ఆచరిస్తానని గట్టి నమ్మకంతో చెబుతున్నాడు సందీప్. తమ దేశంలో అన్ని సౌకర్యాలు కలిగిన స్టేడియం ఒకే ఒకటని ఉందని, అయినా తమలాంటి యువకులు పట్టుదలతో ఎంతో నేర్చుకుంటున్నామని అన్నాడు. తన ఎదుగుదలకు ఎంతో సహకరించిన తమ దేశానికి ఎంతో రుణపడి ఉంటానని అన్నాడు. ఢిల్లీ డేర్ డెవిల్స్ జట్టుకు ఎంపికైన తాను జాతీయ జట్టులో చోటు కోసం దక్కించుకోవడం తన ధ్యేయమని పేర్కొన్నాడు. ప్రముఖ క్రికెటర్లు సచిన్ తెండూల్కర్, షేన్ వార్న్ తనకు స్ఫూర్తిదాతలని, వారు గొప్ప క్రికెటర్లని అన్నాడు. ఈ ఇద్దరు మేటి ఆటగాళ్ల ఆటతీరును తాను వీక్షించేవాడినని అన్నాడు.

అండర్-19 క్రికెట్ వరల్డ్ కప్

దక్షిణాఫ్రికాకు ఐదో స్థానం



రేనార్డ్ వాన్ టోన్డర్ (82 పరుగులు)

క్వీన్స్‌లాండ్ (న్యూజిలాండ్), జనవరి 31: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఆధ్వర్యంలో జరుగుతున్న అండర్-19 క్రికెట్ వరల్డ్ కప్‌లో దక్షిణాఫ్రికా ఐదో స్థానం దక్కించుకుంది. బుధవారం బంగ్లాదేశ్‌తో జరిగిన క్లాసిఫికేషన్ మ్యాచ్‌లో ఈ జట్టు 8 వికెట్ల తేడాతో ఘన విజయాన్ని నమోదు చేసింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ 41.4 ఓవర్లలో 178 పరుగులకు ఆలౌటైంది. మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మన్ అఫిఫ్ హొస్సేన్ (63), వికెట్‌కీపర్ షకీల్ హొస్సేన్ (61) అర్ధ శతకాలు సాధించినప్పటికీ, మిగతా ఆటగాళ్లు విఫలం కావడంతో ప్రత్యర్థి ముందు బంగ్లాదేశ్ భారీ లక్ష్యాన్ని ఉంచలేకపోయింది. దక్షిణాఫ్రికా బౌలర్లను, ప్రత్యేకించి ఫ్రేజర్ జోన్స్‌ను సమర్థంగా ఎదుర్కోలేకపోయిన బంగ్లా బ్యాట్స్‌మెన్ పెవిలియన్‌కు క్యూ కట్టారు. జోన్స్ 52 పరుగులకు ఐదు వికెట్లు సాధించాడు. అఖోనా మకా 27 పరుగులిచ్చి మూడు వికెట్లు తీశాడు. కాగా, గెలవడానికి అవసరమైన 179 పరుగులను దక్షిణాఫ్రికా కేవలం రెండు వికెట్లు కోల్పోయి పూర్తి చేసింది. మాథ్యూ బ్రెడ్‌లిజ్ 36, జీవేష్ పిళ్లై 12 పరుగులు చేసి ఔటయ్యారు. అయితే, రేనార్డ్ వాన్ టోన్డర్ (99 బంతుల్లో 82 పరుగులు), హెర్మన్ రోల్ఫెస్ (51 బంతుల్లో 44) చక్కటి బ్యాటింగ్ ప్రదర్శనతో రాణించి, మరో వికెట్ కూలకుండా జాగ్రత్త పడుతూ, దక్షిణాఫ్రికాకు సునాయాస విజయాన్ని అందించారు.

సంక్షిప్త స్కోర్లు

__బంగ్లాదేశ్ అండర్-19 ఇన్నింగ్స్:__ 41.4 ఓవర్లలో 178 ఆలౌట్ (ఆఫిఫ్ హొస్సేన్ 63, షకీల్ హొస్సేన్ 61, టిపూ సుల్తాన్ 18 నాటౌట్, ఫ్రేజర్ జోన్స్ 5/52, అఖోనా మకా 3/27).

__దక్షిణాఫ్రికా అండర్-19 ఇన్నింగ్స్:__ 38.3 ఓవర్లలో 2 వికెట్లకు 180 (రేనార్డ్ వాన్ టోన్డర్ 82 నాటౌట్, హెర్మన్ రోల్ఫెస్ 44 నాటౌట్, రోనీ హొస్సేన్ 1/27, ఖాజీ ఒనిక్ 1/31).

మోమినుల్ అజేయ సెంచరీ

బంగ్లాదేశ్ 4/374 ● శ్రీలంకతో మొదటి టెస్టు

చిట్టగాంగ్, జనవరి 31: మోమునుల్ హక్ 175 పరుగులతో నాటౌట్‌గా నిలవడంతో, శ్రీలంకతో బుధవారం ఇక్కడ మొదలైన మొదటి టెస్టు మ్యాచ్ మొదటి రోజు ఆట ముగిసే సమయానికి బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్లకు 374 పరుగుల భారీ స్కో చేయగలిగింది. ఓపెనర్ తమీమ్ ఇక్బాల్ (52), ముష్ఫికర్ రహీం (92) అర్ధ శతకాలతో రాణించి, ఈ భారీ స్కోరుకు సహకరించారు. మొదటి వికెట్‌కు 72 పరుగులు జోడించిన తమీమ్ ఇక్బాల్, ఇమానుల్ కయాస్ బంగ్లా ఇన్నింగ్స్‌కు బలమైన పునాది వేశా. 40 పరుగులు సాధించిన కయాస్‌ను లక్షన్ సండాకన్ ఎల్‌బిగా ఔట్ చేయడంతో బంగ్లాదేశ్ తొలి వికెట్ కోల్పోయింది. కాస్ 53 బంతుల్లోనే 52 పరుగులు సాధించి, దల్‌రువాన్ పెరెరా బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ అయ్యాడు. 120 పరుగుల వద్ద రెండో వికెట్ కూలగా, మోమినుల్ హక్, ముష్ఫికర్ రహీం శ్రీలంక బౌలర్లపై విరుచుకుపడి, స్కోరుబోర్డును ముందుకు దూకించారు. మూడో వికెట్‌కు 230 పరుగులు జత చేసిన తర్వాత, సురంగ లక్మల్ బౌలింగ్‌లో వికెట్‌కీపర్ నిరోషన్ డిక్‌విల్లా క్యాచ్ పట్టగా మోమినుల్ హక్ ఔటయ్యాడు. 192 బంతులు ఎదుర్కొని, 10 ఫోర్లతో 92 పరుగులు సాధించిన అతను దురదృష్టవశాత్తు ఎనిమిది పరుగుల తేడాతో సెంచరీ చేజార్చుకున్నాడు. ఆ తర్వాతి బంతికే వికెట్‌కీపర్ లింటన్ దాస్ (0)ను లక్మల్ క్లీన్ బౌల్డ్ చేశాడు. ఫోర్త్ డౌన్‌లో బ్యాటింగ్‌కు దిగిన మహమ్మదుల్లా (9)తో కలిసి, మరో వికెట్ కూలకుండా మొదటి రోజు ఆటను ముగించిన మోమినుల్ హక్ 203 బంతులు ఎదుర్కొని, 18 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 175 పరుగులు సాధించాడు. గురువారం నాటి ఆటలో అతను డబుల్ సెంచరీ సాధించే అవకాశాలున్నాయి.

ద్రవిడ్‌లాంటి కోచ్ కావాలి: రమీజ్ రాజా

కరాచీ, జనవరి 31: భారత్ క్రికెట్ జట్టు కోచ్ రాహుల్ ద్రవిడ్ వంటి కోచ్ తమ దేశానికి కూడా అవసరమని పాకిస్తాన్ మాజీ కెప్టెన్ రమీజ్ రాజా వ్యాఖ్యానించాడు. భారత యువ క్రికెటర్లు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు చేసిన కృషిలో ద్రవిడ్ పాత్ర ఎంతో ఉందని అన్నాడు. మంగళవారం జరిగిన అండర్-19 సెమీఫైనల్స్‌లో భారత్ 203 పరుగులతో పాక్‌కు మట్టికరిపించిన సంగతి తెలిసిందే. సెమీస్‌లో తమ జట్టు నిర్ణీత స్కోరును సాధించలేక అతితక్కువ స్కోరుకే పెవిలియన్ దారి పట్టడం షాక్‌కు గురిచేసిందని అన్నాడు. తమ దేశ ఆటగాళ్లు బ్యాటింగ్, బౌలింగ్‌లో వ్యవహరించిన తీరు ఆక్షేపణీయమని అన్నాడు. భారత ఆటగాళ్లు ఒత్తిడిని సైతం ఎదుర్కొని విజయతీరాలకు చేరుకున్నారని, ఇందులో శుభ్‌మాన్ గిల్ వంటి వారి ఆట తీరు తననెంతో ఆకట్టుకుందని పేర్కొన్నాడు. భారత యువ బ్యాట్స్‌మెన్ అద్భుత ఆటతీరుతో అలరించడం వెనుక ఆ జట్టు కోచ్ పాత్ర ఎంతో ఉందని, ఆ గౌరవం అతనికే దక్కుతుందని రమీజ్ పేర్కొన్నాడు. కోచ్, మెంటర్‌గా బాధ్యతలు నిర్వహించిన రాహుల్ ద్రవిడ్ వల్లే భారత్ యువ సేన పెద్ద విజయం దక్కించుకుందని వ్యాఖ్యానించాడు. క్రికెట్ మాత్రమే కాకుండా ఎన్నో విషయాలను ద్రవిడ్ నుంచి భారత యువ క్రికెటర్లు నేర్చుకుంటున్నారని అన్నాడు. పాక్ క్రికెట్ విధానాన్ని ప్రక్షాళన చేయాలని, యువ జట్టుపై క్రికెట్ బోర్డు మరింత దృష్టి సారించాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన వ్యాఖ్యానించాడు. ఇకనైనా యువ క్రికెటర్లు మరింత బాధ్యతాయువతంగా ఆడాలని, ఇందుకు తమ దేశం తగిన చర్యలు తీసుకోవాలని రమీజ్ రాజా సూచించాడు. భారత్ మాదిరిగానే తమ దేశ క్రికెట్ జట్టు తీరు మెరుగుపడేందుకు రాహుల్ ద్రవిడ్ లాంటి వ్యక్తులు బాధ్యతలు తీసుకోవాలని అన్నాడు.

Printed and Published from Vijayawada by **K.Sudhakar** on behalf of Deccan Chronicle Holdings Limited at Deccan Chronicle Holdings Press, No.C 3 & 4, Patamata, Industrial Estate, Vijayawada. Chief Editor **T.V.Ravi Reddy**, Phones:2555284,2555185,2555287 Regd. No.AP/VJA/41/51/2000. RNI Registration No.52743/90

మాతృభూమి
ఆంధ్రభూమి
గురువారం
1 ఫిబ్రవరి, 2018



నెయ్యితో కురులకు మెరుపులు..

ఇరవై సంవత్సరాల వెనక్కి వెళితే.. ఆనాడు మహిళలు ఒత్తైన కురులతో వాలు జడ వేసుకుంటే చూపు తిప్పుకునేవారు కాదు. కాని నేడు కాలుష్యం పెరిగిపోయి, వాతావరణం వేడెక్కిపోవటం వల్ల ఆ సౌందర్యం కానరావటం లేదు. తలస్నానం చేసి తలదువ్వుకుంటే జుట్టు విపరీతంగా ఊడి చేతుల్లోకి వచ్చేస్తుంది. దీనికితోడు తెల్ల వెంట్రుకల సమస్య మరీ వేధిస్తోంది. సాధారణంగా జుట్టు సంరక్షణ కోసం రకరకాల నూనెలు వాడుతుంటాం. అయితే నెయ్యి కూడా జట్టు సంరక్షణకు ఉపయోగపడుతుందని ఆయుర్వేద నిపుణులు నొక్కి వక్కాణిస్తున్నారు. నెయ్యి ఎలా రాసుకుంటాం అని ఆశ్చర్యపోతున్నారా?. దేశీయ నెయ్యి శిరోజాలకు మంచి కండీషనర్‌గా నిగనిగలాడేలా చేస్తుందట. రెండు చెంచాల నెయ్యిని ఒక చెంచా ఆలివ్ ఆయిల్‌తో కలిపి తల వెంట్రుకలకు రాసి ఇరవై నిమిషాలు పాటు అలా ఉంచెయ్యాలి. తర్వాత మైల్డ్ షాంపూతో తలస్నానం చేస్తే సరిపోతుంది.

అమ్మ ప్రేమ అనంతం

అక్కున చేర్చుకొని తల నిమురుతూ నుదుట ముద్దు పెట్టుకునే అమ్మ అద్భుతమైన స్పర్శ ఎంత గొప్పది. అంతటి అనుభూతిని భావవ్యక్తీకరణ చేయడానికి పదాలు దొరుకునా, అమ్మ గురించి రాయడానికి కలం కదులునా, అమ్మ యావత్ విశ్వమండలమంతా వెలిగే అఖండ ప్రేమ జ్యోతి అని తెలుపుటకు స్థాయి సరిపోవునా, వీచే చల్లని గాలిలో అమ్మ పలకరింపులు పున్నమినాటి చంద్రుని కాంతిలో అమ్మ దీవెనల వెలుగులు ఇలా అమ్మను వర్ణించుటకు భాష సరిపోవునా...!!

అమ్మ ఉన్నంత కాలం తన విలువ తెలియదు, తను శాశ్వతంగా దూరమైతే తెలుస్తుంది నిజమైన ఒంటరితనం యొక్క ప్రభావం మనిషిని మనసుని ఏవిధంగా ఎంతలా దుఃఖించేలా చేస్తుందో అనుభవించే వాళ్లకే తెలుస్తుంది. నలుగురిలో ఎలా బ్రతకాలో నేర్పిన అమ్మ పాఠాల మాటలు పిలుపే అందని దూరాలలో, వెతికినా దొరకక చూసిన కనపడక, తిరిగిరాని లోకాలకు అమ్మ ప్రయాణమైతే ఆ ఇల్లు దీపం వెలుగుతూ కనపడినా జీవకళ లేని అంధ గృహమే కదా, భగవంతుడు లేని చీకటి దేవాలయమే కదా ఎంత బలం బలగం వున్నా ఏమి? అమ్మలేని జీవితం శూన్యమే కదా.

దేవత లాంటి అమ్మను అందరికీ ఇచ్చిన భగవంతుడు కొందరు పిల్లలు ఎదిగి ప్రయోజకులయ్యే వయసులో అకారణంగా అమ్మను తన వద్దకు తీసుకొని వెళ్లిపోతుంటాడు, గతి తప్పిన గమ్యాలై గూడు చెదిరిన పక్షులవలె అందరు వున్నా అనాధలుగా మిగిలిపోతుంటారు. అమ్మను దూరం చేసి గమ్యమెరుగని ప్రయాణం చేయమంటే చిన్ని గుండెలు ఎలా తట్టుకొనగలవు. ఇది వారి నుదుట రాసిన కర్మ ఫలమా లేక విధి ఆడే వింత వినోద నాటకంలో పాత్రలమా, ఇలా ఎందరో మరెందరో అభాగ్యుల జీవితాలు అమ్మ ప్రేమ మరియు అమ్మ తోడు లేక దారం తెగిన పతంగివలె చెట్టుకో పుట్టకో చిక్కి చెదిరిపోవాల్సిందేనా! అమ్మకు సరిసాటి రాగల వారెవరు. అమ్మ చూపే కల్మషమెరుగని ప్రేమను ఈ లోకంలో ఎవరు చూపగలరు.. అమ్మలేని ప్రతి ఒక్కరి హృదయంలో కలిగే ఆవేదనను ఎవరు ఓదార్చగలరు.. అమ్మ వదనం ప్రశాంత నందనవనం, అమ్మ హృదయం సూర్యచంద్రులు దాగిన నీలాకాశం, అమ్మ చిరుకోపం మెరిసే మేఘం, కురిసే వర్షం, అమ్మ లేని జీవితం నిశిరాత్రి చీకటి శ్మశానం అని నా భావన. ఇంకా వివరించటానికి మాటలు లేవు రాయడానికి అక్షరాలు చాలవు..!!

ఇకపోతే అమ్మ కొందరి మనుషుల వ్యధ, కొడుకులు తల్లిని ప్రేమించడం గౌరవించడం పూజించడం సేవలు చేయడం అనేది తరువాత విషయం అనుకుందాం కాని ఎందుకు అంత హీనంగా చూస్తున్నారు. దగ్గినా తుమ్మినా నీరసంగా వున్నా ఎందుకు అంత వింతగా చూస్తున్నారు? వేళకు పట్టెడు అన్నం పెడుతున్నారా? నవమాసాలు మోసి జన్మనిచ్చిన తల్లిని నీచమైన పదాలతో దుర్భాషలాడుతున్నారు, మానసికంగా హింసలు పెడుతూ వెట్టిచాకిరీ చేయిస్తూ ఆవేశంతో చేయి చేసుకుంటున్నారు. చివరికి తల్లిని మెడపట్టి గడప బయటకు తోసేస్తున్నారు? సభ్య సమాజం సిగ్గుతో తల వంచుకునేలా దిగజారిపోతున్నారు ఏమి ఈ దౌర్భాగ్యం.వృద్ధులైన తల్లులకు సేవ చేయలేని దుర్మార్గులు అడవులలో వదలడం, అంతస్తుల మీద నుంచి తోసేయడం ఇలా కనపడకుండా హత్యలు చేస్తున్నారు. కొందరు వృద్ధాశ్రమంలో వదిలి దిక్కులేనివారిగా చేస్తున్నారు.

అయినప్పటికీ సహన ధారిణి బహుపాత్ర రూపిణి అయిన అమ్మ ఎన్ని బాధలు, అవమానాలు పడినా తన చివరి శ్వాస వరకు కన్న బిడ్డలపై ఎనలేని మమకారం చూపుతూనే వుంటుందనేది పరమ సత్యం. అమ్మ ఒక గంభీరమైన నిరంతర ప్రవాహం. కొలవలేని లోతైన మహా సముద్రం. అమ్మ తన బిడ్డలపై స్వచ్ఛమైన చల్లనైన ప్రేమామృత వర్షం కురిపిస్తూనే వుంటుంది.. ఎందరో మాతృమూర్తుల పాదాలకు వందనాలు.

-డా. శారదారెడ్డి వకుల

రెండేళ్ల క్రితం అమెరికాలో అమ్మ సేవలకు గంటల ప్రకారం లెక్కలు కట్టారు. ఆమె సేవలకు కట్టిన విలువ ఎంతో తెలుసా? సంవత్సరానికి అక్షరాలా 70 లక్షల రూపాయలు అని తేల్చారు. అంటే నెలకు ఐదు లక్షలన్నమాట. కాని బిడ్డకు పెన్నిధి లాంటి అమ్మ ప్రేమకు వెలకట్టడం హరిహర బ్రహ్మదులకు కూడా సాధ్యం కాదు.

అమ్మతో మంచి అనుబంధం ఉన్న పిల్లల మెదడు ఆరోగ్యంగా ఎదుగుతుందని పరిశోధనల్లో వెల్లడైంది. మెదడులో వుండే హిప్పోకాంపస్ అనే భాగం మన జ్ఞాపకశక్తికీ, తెలివితేటలకూ, ఒత్తిడిని తట్టుకునే శక్తికీ ఆధారభూతమైంది. అమ్మ ప్రేమ లభించేవారిలో అది దాదాపు పదిశాతం పెద్దదిగా ఉన్నట్లు తేలింది.



అమ్మ లేదని కొందరికి బాధ. అమ్మ ఉందని మరికొందరికి వ్యధ. ఎంతటి వ్యత్యాసం ఎంతటి దౌర్భాగ్యం.. అమ్మలేని కొందరి జీవితాలను పరిశీలిస్తే కళ్లలో నీళ్లు ఘనీభవించి కళ్లు మసకబారిపోతాయి. అమ్మ వున్న కొందరి ఉన్మాదుల జీవితాలను చూస్తే గుండె రగిలిపోతుంది. ఇంతటి ఘోరాతి ఘోరమా అని రక్తం ఉడికిపోతుంది.



అక్షర బలిపీఠం..

అమ్మ!
వినిపిస్తోందామ్మా..?
నన్ను కనకుండానే
ఖరీదైన కాన్వెంట్‌లో సీటు కొన్నావు..
"అమ్మా" అని పిలవబోతే
"మమ్మీ" అనమని కన్నెర్రజేసావు
"నాన్న"ని డాడీ అని పిలవమన్నావు..
మమ్మల్ని మీరే డెడ్ పర్సన్స్‌గా పరిచయం చేసుకున్నారు..

పుట్టగానే అక్షర బలిపీఠాల్ని ఎక్కించి
ఆకాశంలోంచి నక్షత్రాలు తెంపుకు రమ్మన్నావు!
కార్పొరేట్ చదువులపై కూర్చోపెట్టి
టార్గెట్ అనే ట్రిగ్గర్‌ను గురిపెట్టి
జీవితాన్ని త్రిశంకు స్వర్గంలో ఉంచావు
నవమాసాలు మోసింది
నవ నాగరికతను శవంలా మార్చడానికా?
నవ్వు లేక.. ఆట లేక. పాట లేక.. మాట్లాడే సమయం లేక
అందమైన జీవితాల్ని నిర్జీవంగా చేసే హక్కు

మీకెవరు ఇచ్చారు? గురువులకు ఎవరు అందించారు?
మాతృదేవోభవ.. పితృదేవోభవ.. ఆచార్యదేవోభవ అనే పదాలు
భవబంధాల నుంచి దూరం చేస్తాయని నేను ఏనాడూ ఊహించలేదు
ఉదయాస్తమయాలు ఎవరి సొంతం కానట్లే..
ఎవరి జీవితం ఎవరి సొంతం కాదని మరచిపోయారా?

మేము సజీవంగా జన్మించింది
కళ్ళుతెరిచి నిర్జీవంగా నిదురించింది
నేడు కిరోసిన్ జ్వాలలో బూడిద కావడానికా?
బిటెక్.. ఎంటెక్ అంటూ హైటెక్‌కు బందీల్ని చేసి
ఐఐటీలంటూ నేటివిటీకి దూరం చేస్తూ ఉంటే
తల్లిదండ్రుల ప్రేమ టెక్నాలజీకి ఎప్పుడు దగ్గర కావాలి?

మట్టిలో కట్టుకునే బొమ్మరిల్లే నయం
మా ఊహలకు ప్రతిరూపంగా నిలిచాయి

ఇపుడు సాఫ్ట్‌వేర్ ఆకాశహర్మ్యాల ముందు
నువ్వు నేను యోజనాల దూరంలో ఉన్నాము కదామ్మా?
లక్ష జీతం కోసం లక్షణమైన మా జీవితాల్ని బలిపెట్టాము
అమ్మా! నాకు బతకాలని ఉందమ్మా!
నీతో నిత్యం మాట్లాడాలని ఉంది..
స్నేహితులతో నవ్వుతూ పోట్లాడుకోవాలని ఉంది
మారాం చేసి నాన్నతో క్రికెట్ బ్యాట్ కొనిపించాలని ఉంది
చాలీ చాలని జీవితమైనా సరే..
ఇంట్లోనే జీవించాలని ఉంది..
తల్లిగా ఒకనాడు ఊయల వేసి నేడు
మీరు గెలవడం కోసం..
మాకు ఉరితాడు అందిస్తున్నారని మరచిపోతున్నారు!
పదిమందిలో మీ పరువు నిలబెట్టుకోవడం కోసం
మా ఉసురు తీస్తున్నారని గుర్తించలేకపోతున్నారు..
ఇదెక్కడి న్యాయం..?

భావితరాలమైన మేము
బయటకు రాలేని బావిలో చిక్కుకుంటున్నాము

సందేశమిచ్చే ప్రపంచాన్ని ఎదురుచేస్తున్న మేము
సందేహంగా సంధి దశకు చేరుకుంటున్నాము
మెకానిక్ జీవితాలకు అలవాటుపడ్డ మేము
ఆఫీస్ అనే షెడ్‌లో యంత్రాలుగా మారిపోయాము..
అందుకే మీరు మా కంటికి కనిపించడం లేదు
కన్నతల్లి ప్రేమకు, కన్నెపిల్ల ప్రేమకు తేడా తెలియటంలేదు..
పెళ్ళంటే రెండు జీవితాలు.. మూడు బ్యాంక్ ఎకౌంట్లు తప్ప
మాకేమీ కనిపించడంలేదు
మాకు జీవితమంటే జీతమే తప్ప వేరేది గుర్తుకురావడంలేదు..
రిలాక్స్ అవ్వడం అంటే పబ్‌లో డాన్సు చేయడం తప్ప
ఇంట్లో అందరూ కలిసి తినే పప్పన్నం అని తెలియటంలేదు

ప్రతి ఒక్కరూ మొక్కల్ని నాటండి అన్నట్లే..
ప్రతి ఒక్కరూ మీ బిడ్డల్ని కాపాడుకోండి అనే నినాదం కూడా
ప్రభుత్వం అంటే బావుండునేమో అనిపిస్తోందమ్మా!
పచ్చని మా జీవితాల్ని సంపాదనకోసం
పగలూ రాత్రీ తేడా లేకుండా పేరు లేని గ్రహాలుగా మార్చితే..
'భూమి' అనేది మరుభూమిగా మారుతుందేమో..!

-శైలజామిత్ర, ఫోన్ :9290900879



వార్త-వ్యాఖ్య

-వీరాజీ

ప్రేమికులారా!.. దూరం దూరం..!

అసలు నగరాల్లో ఉద్యానవనాలెందుకు వున్నాయి? అంటే ప్రేమకోసం- ప్రేమికులకోసం అంటున్నారు ఆధునిక టీనేజర్స్ కొంతమంది- కానీ ప్రేమంటే గిట్టని కొన్ని పార్కులు సిసి కెమెరాలు పెట్టేస్తున్నాయి. కోయంబత్తూరులోని వ్యవసాయ విద్యాలయ అందాల ఉద్యానవనం (పార్క్) మరో అడుగు ముందుకేసింది. మన తెలుగు వాళ్ళు చాలామంది వున్న పట్టణం అది- నేత చీరలకు పెట్టింది పేరు.. కానీ ఇటీవల ఓ పార్కుమీద దానిమీద బాయ్‌ఫ్రెండ్స్ - గర్ల్‌ఫ్రెండ్స్ మోజుపడ్డారు. ఆ జంటల దాడి ఎక్కువైపోయింది. శృంగార చేష్టల ప్రకోపం తగ్గలేదు. పార్కు గేటుముందు పెద్ద బోర్డు పెట్టారు. కేవలం వివాహిత జంటలకు మాత్రమే- మెడలో తాళిబొట్టు ఉందని చూపెట్టిన అమ్మాయిలకు మాత్రమే ప్రవేశం



అన్నారు. ఆ పార్కు చెట్ల క్రింద మజా మహిమలేమిటో కానీ చిన్నపిల్లలకి ఈ ప్రేమపక్షుల కువకువల బెడద తగ్గలేదు. దీనితో విసిగి 'మ్యారేజ్ సర్టిఫికెట్' తీసుకురండి- లోనికి ప్రవేశం ఇస్తాం.. లేదా ఇక్కడ జంటలకు దేవిడీ మన్నా అని బోర్డెట్టేసేరు.

శంకరాచార్య కూడా నిలబడాల్సిందే..

పోయినవారం చెన్నైలో జరిగిన ఒక పుస్తకావిష్కరణ సమారోహానికి రాష్ట్ర గవర్నర్ భన్వారీలాల్ పురోహిత్ - కంచిపీఠం చిన్నసామి (జూనియర్) శంకర విజయేంద్ర సరస్వతి- ఇంకా ముఖ్య అతిథులు అందరూ వేదికని అలంకరించారు. సందర్భం - తమిళ సంస్కృత నిఘంటువు విడుదల కనుక- జూనియర్ కంచి పీఠాధిపతి రాక ముదావహమే కానీ సభ ప్రారంభంలో తమిళతల్లి పాటని పాడి సభని సంప్రదాయబద్ధంగా మొదలుపెట్టారు. గవర్నర్‌గారు సహా అక్కడున్న ఆబాలగోపాలం లేచి బుద్ధిగా అనగా మొబైల్స్‌ని మడతపెట్టి లోన పెట్టుకుని మరీ నిలబడ్డారు. ఈ నిఘంటువు తయారుచేసినది బిజెపి జాతీయ కార్యదర్శి హెచ్.రాజాగారి తండ్రి హరిహరన్ అవరఘుళ్, కానీ చిన్నస్వాములవారు ధ్యానముద్రలో మునిగిపోయారు. లేచి నిలబడ లేదు- తమిళ ప్రేక్షకులు ఆవేశంతో



ఊగినా, సభలో రభస అని తమాయించుకున్నారు. చివర, జాతీయ గీతాలాపన జరిగింది. అప్పుడు స్వాములవారు దిగ్గున లేచి నిలబడ్డారు- మండిపోయింది. తమిళ ప్రజానీకం సభలోనే కాదు రాష్ట్రం మొత్తంమీద టీవీలలో ఖండనమండన నిందా చర్చలతో మండిపోతున్నాయి బుల్లితెరలు- వక్తలు తిడుతున్నారు.

veeraji.pkm@gmail.com

భూమాతను రక్షించుకుందాం!



నేడు టెక్నాలజీ పేరుతో విలాసవంతమైన జీవితం గడపడానికి అలవాటుపడి, ప్రకృతి ధర్మానికి విరుద్ధంగా పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నాం. పరిశ్రమలు వదిలే వ్యర్థ పదార్థాల వల్ల జల కాలుష్యం, వాహనాలు వదిలే పొగవల్ల వాయు కాలుష్యం పెరిగిపోతోంది. ప్లాస్టిక్ పర్యావరణానికి ముప్పు అని తెలిసినా విచ్చలవిడిగా ప్లాస్టిక్ వస్తువులను వాడుతున్నాం. దాంతో ప్లాస్టిక్ వ్యర్థాలు భూమి పైపొరల్లో పేరుకుపోయి అనేక సమస్యలకు కారణమవుతున్నాయి. అధిక దిగుబడుల కోసం పంట పొలాలపై రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడుతున్నారు. కలప కోసం అడవుల్ని నరికి మూగ జీవులకు నీడ లేకుండా చేస్తున్నారు. పచ్చదనం మీదే ప్రపంచ మనుగడ ఆధారపడి వుందన్న విషయం మరువకూడదు. మనిషికొక చెట్టు నాటి, బిడ్డలా పెంచితే దేశంలో కోట్ల వృక్షాలు పుట్టుకొస్తాయి. పచ్చని చెట్లు కాలనీల నిండా నాటితే భూమాత చల్లగా వుంటుంది. దాంతో వర్షాలు పుష్కలంగా కురుస్తాయి. సర్వజీవకోటికి ప్రాణాధారమైన చెట్లను నరకడం మాని మొక్కలను నాటడం అలవాటు చేసుకోవాలి. పర్యావరణానికి ముప్పు వాటిల్లితే అకాల వర్షాలు పండిన పంటలను మింగేస్తాయి. మండే ఎండలు మనల్ని మాడ్చేస్తాయి. కొత్త కొత్త వ్యాధులు పుట్టుకొచ్చి ప్రజల ప్రాణాలు తీస్తాయి. పర్యావరణాన్ని పరిరక్షించాలంటే, కొండలను కొండలుగా వుంచాలి. నదులను నదులుగా పారనివ్వాలి. చెట్లను చెట్లగానే బ్రతకనివ్వాలి. స్వచ్ఛమైన నీరు, స్వచ్ఛమైన గాలి లభించిననాడే కాలుష్య రహిత సమాజం ఏర్పడుతుంది. తద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుంది. పెరుగుతున్న కాలుష్యంతో జీవన విధానం గతి తప్పుతోంది. నాయకులు కాలుష్య నివారణ గురించి ప్రసంగిస్తారు. మొక్కలు నాటమంటారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించమంటారు. కానీ వాళ్ళు మాత్రం ఇవేమీ చేయరు.

లక్షలాదిగా పెరిగిపోతున్న వాహనాలు, వాటి నుంచి వెలువడుతున్న కాలుష్యం దేశాన్ని కలవరపెడుతున్న సమస్య. నగరాలలో పరిశ్రమలు విడిచిపెడుతున్న పొగ జీవరాసులకు సెగగా మారింది. దీనికితోడు పెరిగిపోతున్న నగరీకరణ మరింత కాలుష్యరహిత సమాజాన్ని వృద్ధి చేస్తోంది. అందువల్ల భూమి, నీరు, గాలి అన్నీ కలుషితమయిపోతున్నాయి. దీనికి తోడు ప్లాస్టిక్ వినియోగం పరిసరాలకు, వాతావరణానికి,




పర్యావరణానికి ప్రమాదకరమని తెలిసినా ప్లాస్టిక్ వస్తువులను విచ్చలవిడిగా వాడుతున్నారు. ఏ నగరంలో చూసినా, ఏ యాత్రా స్థలంలో చూసినా ప్లాస్టిక్ దుర్గంధం పెచ్చరిల్లుతోంది. పెళ్ళిళ్ళలో వందలాది ప్లాస్టిక్ వస్తువులను వాడి పడేస్తున్నారు. విందు వినోదాల పేరిట ప్లాస్టిక్ ప్లేట్లు కూడా వచ్చాయి. మనిషి ఆరోగ్యానికి ప్రమాదమని తెలిసి కూడా ప్లాస్టిక్ వినియోగానికి విపరీతంగా అలవాటుపడటం ధరిత్రికి పెద్ద విపత్తని మనిషి తెలుసుకోలేకపోతున్నాడు. ప్లాస్టిక్ వస్తువులు వీటిని కలుషితం చేస్తూ పరిసరాలను విషపూరితం చేస్తున్నాయి. కాలుష్య కోరల్లో చిక్కుకొని భూమాత అల్లాడుతోంది.

-కాయల నాగేంద్ర

బేకింగ్ సోడాతో పళ్లు మిలమిల..

పెదాల కోసం తీసుకునే జాగ్రత్తలు పళ్ల కోసం తీసుకోం. పళ్లు మిలమిల మెరవాలంటే బేకింగ్ సోడాను ఉపయోగించండి. రాత్రి పడుకునే ముందు బ్రష్ చేసుకునే అలవాటు చేసుకోండి. పేస్ట్‌పై ఈ బేకింగ్ సోడా కొద్దిగా చల్లుకుని తోముకుంటే పళ్ల మీద ఉన్న మరకలు తొలగిపోతాయి. బేకింగ్ సోడా చిగుళ్ల మీద ఉన్న బాక్టీరియాతో సైతం పోరాడుతుంది. అలాగే స్ట్రాబెర్రీ గింజలు సైతం పళ్లను శుభ్రం చేస్తాయి. కాఫీ, టీలు రోజుకు రెండు సార్లు కంటే ఎక్కువగా తాగితే పళ్లమీద మరకలు ఏర్పడి అవి క్రమేణ పసుపు రంగుకి వచ్చేస్తాయి. దంతాలకు ఇన్‌ఫెక్షన్లు సోకితే ఏలకులు వాడండి. కొన్ని ఆహార పదార్థాల వల్ల పళ్లపై మరకలు పడతాయి. ముదురు రంగు ఆహారపదార్థాలు తిన్నవెంటనే నీళ్లతో శుభ్రం చేసుకుంటే మంచిది. ప్రతి ఆరునెలలకు ఒకసారి డెంటిస్ట్‌తో క్లీనింగ్ చేయించుకోవటం ఎంతైనా మంచిది.



నేర్చుకుందాం

సీ. ధరణిలో వేయేండ్లు తనువు నిల్వఁగఁబోదు
ధనమెన్నటికి శాశ్వతంబుగాదు
దారసుతాదులా తన వెంటరాలేరు
భృత్యులు మృతిని తప్పింప లేరు
బంధుజాలము తన్నుఁ బ్రతికించుకోలేరు
బల పరాక్రమమమేమి పనికిరాదు
ఘనమైన సకల భాగ్యములెంతఁ గల్గియు
గోచి మాత్రంబైన (గొనుచుఁబోఁడు
తే. వెట్టి కుక్కల భ్రమలన్ని విడిచి నిన్ను
భజన చేసెడి వారికి (బరమసఖము
భూషణ వికాస శ్రీధర్మపురనివాస
దుష్టసంహార నరసింహ దురిత దూర!

బావం: ఓ స్వామీ ఈ మేను ప్రపంచంలో వేయేండ్లు మనదు. గడించిన డబ్బు శాశ్వతం కాదు. పెళ్లాంపిల్లలెవ్వరు చనిపోయేనాడు వెంట రారు. సేవకులు, చుట్టాలు ఎవరూ కాపాడలేరు బతికించలేరు. బలపరాక్రమాలేవీ పనిచేయవు. ఎంత సిరిసంపదలార్జించినా గోచిపాతంత కూడా వెంట రాదు. వెట్టికుక్కల్లాగా భ్రాంతికి లోబడకుండా నిన్ను సేవించేవారికే ఎంతో సుఖం కల్గుతుంది.

శ్రీ నరసింహ శతకములోని పద్యము



వ్యూహం

34 అలపర్తి రామకృష్ణ

అతను వస్తున్న వైపు తిరిగి వుంది కాబట్టి సావేరికి అతను కన్పించాడు. ఇంట్లో దూరి సావేరిని వాటేసుకున్న వ్యక్తి నిశాంత్ రావడం గమనించలేదు.

మెల్లగా వెనగ్గావచ్చి ఆ వ్యక్తి మెడ చుట్టూ చెయ్యి బిగించి బలంగా వెనుక్కు లాగాడు నిశాంత్.

తూలి కింద పడిపోయాడు.

అతను లేచి నిలబడే ప్రయత్నం చేస్తుంటే గట్టిగా కాలికి వున్న షూతో గట్టిగా తన్నాడు.

మొహం పచ్చడైపోయినట్లు అయ్యింది.

బాధతో మూలుగుతూ లేచి నిలబడి నిశాంత్‌మీద విరుచుకుపడే ప్రయత్నం చేయబోయాడు. తనమీద పడే అవకాశం అతనికి ఇవ్వకుండా బలంగా అతని ఛాతీమీద గుద్దాడు.

మళ్లీ తూలి కిందపడ్డాడు.

నడుం విరిగినంత పనైంది.

వస్తాదులా వున్న అతను నిశాంత్ చేతిలో చావుదెబ్బలు తినడం ఆశ్చర్యాన్ని ఆనందాన్ని కల్గిస్తూ వుంది సావేరికి.

అతను పారిపోయే ప్రయత్నం చేస్తున్నాడు. అతని చొక్కా పట్టుకుని లాగి గుంజి పిడిగుద్దులు గుద్దుతున్నాడు నిశాంత్.

తాడు తెచ్చి వాడి భుజాల చుట్టూ చుట్టేసింది పారిపోనివ్వకుండా. వాడి జేబులో వున్న సెల్‌ఫోన్ తీసేసుకుంది. గేటు దగ్గరకు వెళ్లి దొంగ దొంగ.. ఇంట్లో జొరబడ్డాడు.. అంటూ పెద్దగా కేకలు పెట్టింది. ఇరవై మంది అక్కడకు చేరుకున్నారు.

అతన్ని పోలీసు స్టేషన్‌లో అప్పగించి తిరిగి వచ్చాడు నిశాంత్.

తన దగ్గర వున్న నిశాంత్ సెల్‌ఫోన్‌ను చెంపలకు హద్దుకుంది.

“అదేమిటి! నాకు దక్కాల్సిన అదృష్టం ఆ సెల్‌ఫోనద్‌కు దక్కింది.. నిన్ను రక్షించింది నేను కదా!” అన్నాడతను.

“మీరు సెల్‌ఫోన్ మర్చిపోయి వెళ్లారు. ఈ ఫోన్ మీ దగ్గర వున్నట్లయితే మళ్లీ తిరిగి వచ్చేవారు కాదు. ఆ వెధవ ఏం చేసేవాడో? తలుచుకుంటూ వుంటే కంపరమేస్తోంది” అందామె.

“ఇక ఆ విషయం మర్చిపో! క్లోజ్‌డ్ చాప్టర్.. వాడిని పోలీసులకు అప్పగించాం గదా! వాడి వ్యవహారం వాళ్లు చూసుకుంటారు”.

“వాడు దున్నపోతులా వున్నాడు.. మీరు వాడిని ఎలా చావగొట్టగలిగారు?”

“ఇంజనీరింగ్ కాలేజీలో చదువుకునేటప్పుడు నేను, స్కంద బాక్సింగ్ నేర్చుకున్నాం. స్కంద స్పోర్ట్సులో కాలేజ్ ఛాంపియన్.. నేను రన్నరప్”

వెళ్లిపోవడానికి సిద్ధమయ్యాడు.

“మీరు వెళ్ళొద్దు.. ఈ రాత్రికి ఇక్కడే ఉండిపోండి.. మా తమ్ముడు ఫస్ట్ షో చూసి రాత్రి పది గంటలకో, పదకొండు గంటలో చేరుకుంటాడు. అమ్మా నాన్న రేపు ఉదయం వస్తారు. మీరు ప్రక్కనే వుంటే భయం పోతుంది” అందామె అతని భుజంమీద చెయ్యివేసి.

ఆప్యాయంగా ఆమె చెంపలు నిమిరేడు.

జరిగినదంతా లోహితకు, స్కందకు ఫోన్లో చెప్పారు.

మరుసటి రోజు సాయంత్రం స్కంద వచ్చాడు

“మీరు పోలీసులకు అప్పగించివాడిని చితగ్గొడితే అసలు విషయం కక్కేశాడు.. వాడు అరిఫ్ మనిషి.. వాడిమీద చాలా కేసులు వున్నాయి.. అన్నీ రేప్ కేసులే! అరిఫ్‌కు ఎదురు తిరిగినవాళ్ళ ఇంటిపై వీడు నిఘావేస్తాడు. ఇంట్లో ఆడవాళ్ళు ఒంటరిగా వుండటం గమనించి ఇంట్లో చొరబడి మానభంగాలు, ఇంట్లో వస్తువులు చెల్లాచెదురు చేస్తాడు. ఆ ఇంటి వాళ్ళు భయపడి అరిఫ్ చెప్పినట్లు చేస్తారు.. భయానక వాతావరణం సృష్టించి తను దారికి తెచ్చుకుంటారు. వీడికి హత్యలు చేసే ధైర్యం లేదు, ఆడవాళ్ళను బెదిరించడంలో సిద్ధహస్తుడు. మగవాళ్ళతో ఫైటింగ్ చెయ్యడం కూడా రాదు.. అందుకే నిశాంత్ చేతిలో చావు దెబ్బలు తిన్నాడు” నిశాంత్‌వైపు నవ్వుతూ చూస్తూ అన్నాడు స్కంద. “అంటే చేతగాని దద్దమ్మను మట్టిగరిపించాననా నీ ఉద్దేశ్యం” అన్నాడు నిశాంత్.



“అది కాదురా.. నవ్వుతూ అన్నానులే”.

“నువ్వురా.. ఫైటింగ్‌కు.. ఎవరు గెలుస్తారో తేల్చుకుందాం..” అన్నాడు నిశాంత్ స్కందమీదకు దూకుతూ.

“అరే ఉండరా బాబూ! మాట్లాడితే ఫైటింగ్ అంటావ్.. చూడమ్మా! ఎలా మీదపడి గుద్దుతున్నాడో.. వాడితో ఎలా వేగుతావ్?”

సిగ్గుపడిపోయింది సావేరి- “మీ మిత్రుడికి చెప్పేసేవన్నమాట” అందామె.

“నాకు చెప్పకుండా ఏ పని చెయ్యడు” అంటూ మిత్రుని గట్టిగా వాటేసుకున్నాడు.

“ఏలా వాటేసుకున్నాడోచూడు సావేరి.. ఎముకలు విరిగిపోయేటట్లు.. మీ అక్కయ్య ఎలా భరిస్తుందో వీడిని” అన్నాడు నిశాంత్.

అన్నపూర్ణమ్మ రావడంతో వాళ్ళిద్దరూ బుద్ధిమంతుల్లా కూర్చున్నారు కుర్చీల్లో వొదిగిపోయి. “అరిఫ్ వాళ్ళు లోహితమీద ఒత్తిడి తీసుకువచ్చి వాళ్ళు చెప్పినట్లు వినేటట్లు చేసుకోవడానికే సావేరి మీద అఘాయిత్యం చెయ్యడానికి ప్రయత్నం చేశారు.. ఒక ప్రయత్నం విఫలమైతే మరో ప్రయత్నం చేస్తారు.. మన జాగ్రత్తల్లో మనం ఉండాలి.. అరిప్ ముఠాను కటకటాల వెనుకకు తోసేదాగా సావేరి జాగ్రత్తగా ఉండాలి.. ఎవరికి తెలియకుండా మరో చోటుకి ఆమెను తీసుకువెళ్ళాలి!” చెప్పుకుంటూ పోయాడు స్కంద.

“సావేరిని మా ఊరు తీసుకువెళ్తాను.. కొన్నాళ్ళు మా దగ్గరే వుంటుంది. మా ఊరు ఎక్కడో అరిఫ్ ముఠాకు తెలియదు”అన్నాడు నిశాంత్. “గుడ్ ఐడియా.. సావేరిని కాపాడుకోవాలి.. మీకేం అభ్యంతరం లేదుగదా ఆంటీ” అన్నాడు స్కంద అన్నపూర్ణమ్మగారి వైపు చూస్తూ.

“మీరు, అంకుల్ కూడా సావేరితోపాటు రండి! మా అమ్మా నాన్నలు సాదరంగా ఆహ్వానిస్తారు.. మీకు ఎటువంటి ఇబ్బంది కల్గించరు” అన్నాడు నిశాంత్.

“అందరం ఎందుకులే బాబూ! పెద్దవాళ్ళం మమ్మల్ని వాళ్ళేం చెయ్యరు.. లోహిత గురించేనా ఆలోచన.. తోడేళ్ళ మధ్య మేకపిల్లలా అక్కడ ఇరుక్కుపోయింది.. ఎలా బయటపడుతుందోనని ఆందోళన పడుతున్నాను.”

“హాస్పిటల్లో ఉన్నంతకాలం ఆమెకేం భయంలేదు.. రిజైన్ చేసి బయటకు వచ్చే ప్రయత్నం చేస్తే ప్రమాదమే! ఇప్పటికే ఇద్దరు డాక్టర్లను కడతేర్చారు.. లోహిత ఎటువంటి హాని జరక్కుండా నేను చూసుకుంటాను.. సావేరిని నిశాంత్‌తో పంపించండి” అన్నాడతను.

- ఇంకా ఉంది

మంచిమాట

గురువు

మానవ జీవితంలో గురువు పాత్ర చాలా ముఖ్యమైనది. ఆదిగురువు తండ్రి. తదనంతరం మన పూర్వ జన్మలో సంపాదించుకున్న పాప పుణ్యాల ఫలితంగా, మన అన్వేషణను అనుసరించి మనకు గురువు లభించడం జరుగుతుంది. గురోపదేశమ్ లేని విద్య నిష్ఫలం అంటారు పెద్దలు. అయితే గురువు అంటే ఎవరు? ఎలా వుండాలి? అనే సందేహం మానవ సహజం. సామాన్యులమైన మనం ఎంచుకునే గురువుకి ఇలాంటి భౌతిక, మానసిక లక్షణాలు ఉండాలనుకోవడం అంతే సహజం అని చెప్పుకోవచ్చు.

మహాత్ముల దృష్టి వేరే విధంగా గోచరిస్తుంది. అది మన మేధస్సుకి అందడం కష్టం. ఉదాహరణకి దత్తాత్రేయులవారు ఇరువది నలుగురు జీవులని తన గురువుగా భావించారు. ఆయన కొన్నాళ్ళు ఒక వారకాంతని పరిశీలించడం జరిగింది. ఆమె రోజూ విటులను ఆకర్షించడానికి అర్థరాత్రివరకు వేచి ఉండేది. ఆ సమయమంతా తన అందచందాలను చూసుకుంటూ గర్వపడేది. అయ్యో ఆమె సమయం వృధా చేసుకుంటూ వుంది. తన వృత్తికి తగ్గట్లుగా ప్రవర్తించినా, ఆ సమయంలో భగవంతుని ధ్యానం చేసుకుంటే ఇహం, పరం కలిగేవి కదా అనుకున్నాడు ఆయన.

ఆమె దగ్గరనుంచి ‘సమయం వృధా చేసుకోకుండా ఉండాలనే’ విషయాన్ని నేర్చుకున్న ఆయన, ఆమెను గురువుగా తలంచాడు. ఒకసారి ఆయన ఒక పక్షి మాంసపు ఖండాన్ని ముక్కున కరచుకు ఎగరడం, ప్రక్కగా ఎన్నో పక్షులు ఆ మాంసం ఖండంపై ఆశతో దాని వెంటపడుతూ ఉండడం గమనించాడు. వాటి ధాటికి తట్టుకోలేక కొంతసేపటికి ఆ పక్షి మాంసపు ఖండాన్ని జారవిడిచేయడం చూశాడు. వెంటనే ఆ పక్షిని వెంటాడుతున్న ఇతర పక్షులు దూరంగా తొలగిపోయాయి. ఆయన కోరికలని అంటిపెట్టుకున్నంతకాలం అశాంతి మనలను వేధిస్తూ వుంటుంది. ఎపుడు అయితే కోరికలను వదలివేస్తామో అప్పుడే శాంతి పొందగలం అని తెలుసుకున్నాడు. పక్షి రూపంలో ఒక గురువు దొరికిందని సంతోషించాడు.

ఒకరోజు ఒక కన్నె కవ్వంతో మజ్జిగ చిలుకుతూ ఉండడం ఆయన కంటపడింది. ఆమె చేతులనిండా గాజులున్నాయి. అందువలన పెద్ద శబ్దం రాసాగింది. అది ఆమె గ్రహించి గాజులు అన్నీ తీసివేసి ఒక్కొక్క చేతికి ఒక్కొక్క గాజు వేసుకుంది. శబ్దం రావడం ఆగిపోయింది. దత్తాత్రేయులవారు అక్కడ గ్రహించిన విషయం ఏమిటంటే ఒకరికంటే ఎక్కువ మంది ఒక చోట గుమిగూడితే మాటలు, అధిక ప్రసంగాలు ఎక్కువ అవుతాయి. అదే విడిగా ఉంటే మౌనంగా ఉండవచ్చని, భగవంతుణ్ణి ధ్యానించుకోవచ్చని, ఆ క్షణం నుంచే ఆ కన్నెని గురువుగా భావించాడు ఆయన. ఒక రోజు ఆయన వెడుతుండగా ఒకచోట ఇంటిలోని వారెవ్వరూ లేకపోయినా ఇంటిలోంచి పెద్దగా శబ్దం రావడంతో, అది విన్న చుట్టుప్రక్కలవారు అప్రమత్తమయ్యారు. ఆ ఇంట్లోకి దొంగలు ప్రవేశించారు అనుకుని కర్రలు, కత్తులు పట్టుకుని అందరూ ప్రోగయ్యారు. పోగైన జనం ఎంతగా అరిచినా, కేకలువేసినా లోపలనుంచి ఎటువంటి సమాధానం రాకపోగా శబ్దాలు మరికాస్త ఎక్కువ కాసాగాయి. జనంకి ఏమీ అర్థంకాక తలుపులు బ్రద్దలుకొట్టి లోపలకి ప్రవేశించారు.

అక్కడ ఒక పిల్లి ఒక సన్నని మూతి గల పాత్రలో ఇరుక్కుపోవడం చూశారు. అందరూ కష్టపడి పిల్లికి ఏమీ గాయం కాకుండా దాని తల బయటకి తీశారు. ఆ పాత్రలో బెల్లంతో చేయబడిన ఒక తీపి పదార్థం ఉంది. పిల్లి అది తిందామని ఆశతో, తన మెడ దూరని పాత్రలో తల దూర్చి ప్రాణంమీదకు తెచ్చుకుంది. అది గమనించిన దత్తాత్రేయులవారు ఆశ వినాశహేతువు అని తెలుకున్నారు. తత్‌క్షణం ఆపిల్లి ఆయనకి గురువు అయిపోయింది. ఈ విధంగా ఆరువది నలుగురు జీవులని తన గురువులుగా స్వీకరించారు దత్తాత్రేయులవారు. కేవలం మానవరూపంలోగాక గురువు ఏ రూపంలో, ఎక్కడున్నా తారసపడవచ్చు అనే విషయం మనం గ్రహించాలి. ఆ విషయంలో ఎంతో జాగరూకతతో వుండి, గురువుని అన్వేషించడంలో, మన మనోనేత్రం సర్వసన్నద్ధంగా ఉంచుకోవాలి. ఎంతో మంది కలోకంలో ఎన్నో చెబుతుంటారు. అవి మహత్తర మైన విషయాలు కావచ్చు. లేదా పనికి మాలిన విషయాలు కావచ్చు. లేదా వారి వారి అనుభవపూర్వకమైన విషయాలే చెప్తుండవచ్చు. అయితే అన్ని విని ఏది మంచి విషయమో తెలుసుకొని దాన్ని మాత్రమే గ్రహించాలి.

- ఎం.వి.ఎస్.ఎస్.ప్రసాద్

యాజ్ఞసేని




- త్రోవగుంట వేంకట సుబ్రహ్మణ్యము 26

కుడిచేతితో నారి కొనను పట్టి వింటిని సంధించ ప్రయత్నించబోగా వంగియున్న విల్లు ఒక్కసారిగా చేతి నుండి అదను తప్పి శిశుపాలుణ్ణి విసరివేయగా అతడు మోకాళ్ళు వంగి పడ్డాడు. అక్కడున్న వారంతా పెద్దగా నవ్వారు. శిశుపాలుడు మరలా వింటిని పట్టి నారిని సంధింప ప్రయత్నించక వెనుదిరిగిపోయి తన ఆసనంలో కూర్చున్నాడు.

శిశుపాలుని వంతు ముగిసింది.

తరువాత అక్కడ వున్న వారంతా మరొకరెవరు వస్తారో చూస్తున్నారు. ఇంతలో మగధ దేశాధిపతి అయిన ‘జరాసంధుడు’ లేచాడు.



రాజుందరూ ఆశ్చర్యపోయారు.

ఇంత ముదుసలికి ఈ వయస్సులో వివాహ ప్రయత్నమా అని మనస్సులలో ఆరాటపడ్డారు. ఏవగించుకొన్నారు.

జరాసంధుడు నెమ్మదిగా ఆసనం వెడలి మత్స్య యంత్రం వద్దకు పోయి దాన్ని ఒక్కసారి పరికించాడు. అక్కడి నుండి ద్రుపద మహారాజు వద్దకు వెళ్ళాడు.

“ద్రుపదరాజా! నేను ఈ స్వయంవరంలో పాల్గొనదలచటంలేదు. ద్రౌపది నాకు మనుమరాలితో సమానం. ఇక నాకు శెలవు, వస్తాను’ అని అన్నాడు.

వెంటనే అక్కడినుండి వెడలి తన మనుమడితో, పరివారంతో, సేనా సమూహంతో వెనుదిరిగి మగధకు బయలుదేరాడు. అది చూచి రాజులందరూ ఆశ్చర్యచకితులయ్యారు.

సభాస్థలి ఒక్కసారి నిశ్శబ్దం ఆవరించింది. రాజులు ఒకరిమొగం ఒకరు చూచుకున్నారు. తరువాత ఎవరివంతోనని ఆసక్తితో ఎదురుచూస్తున్నారు.

రాజులందరూ ఆసక్తితో చూస్తుండగా దుర్యోధనుడు ఆసనం నుండిలేచాడు. కలయచూశాడు. బలగర్వం ముందుకు సాగాడు.. వాద్యాలు, భేరీ మృదంగాల శబ్దాలు వ్ూారుమ్రోగాయి.. వందివూగధులు గళాలు విప్పారు.

ఈతడు హస్తినాపుర ప్రభువైన ధృతరాష్ట్ర మహారాజు యొక్క జ్యేష్ఠ పుత్రుడు. వంద మంది కౌరవులలో పెద్దవాడు. శంతన మహారాజుకు, విచిత్రవీర్యునికి పౌత్రుడు. అస్త్రవిద్యాసంపన్నుడు. గదాయుద్ధ కౌశల్యుడు. గాంధారి తనయుడు అని అన్నారు. ద్రుపదుడికంటే గొప్ప రాజుననే గర్వంతో దుర్యోధనుడు ద్రుపదుని వద్దకు పోలేదు.

మత్స్యయంత్రం ఉన్న చోటికి వచ్చాడు. ధనుస్సును చేతబట్టాడు. వింటి నారిని సంధించి ఎక్కుబెట్ట ప్రయత్నించగా వ్రేళ్ళమధ్య వింటి నారి దెబ్బ తగిలి పట్టుదప్పి క్రిందికి వాలిపోయాడు. దెబ్బతిని సిగ్గుతో తల వంచాడు. మెల్లగా అక్కడినుంచి వెనుదిరిగి ఆసనంపై ఆసీనుడయ్యాడు.

సభాస్థలిని మరలా నిశ్శబ్దం ఆవహించింది. అంత అంగ దేశాధిపతి, దుర్యోధనునికి నమ్మిన మిత్రుడు అయిన కర్ణుడు ఆసనం నుండి లేచాడు. రాజులందరూ ఆత్రుతతో ఎదురుచూస్తున్నారు. అక్కడనే బ్రాహ్మణ వేషంలో వున్న పాండవులు కూడా చూచారు.

“అగ్నికంటే, సూర్యచంద్రులకంటే మహాతేజస్వి అయిన ఈ కర్ణుడు మత్స్యయంత్రాన్ని ఛేదించి నేల కూలుస్తాడు” అని మనస్సులో భావించారు.

సభను మరలా కొంతసేపు నిశ్శబ్దం ఆవరించింది.

వాద్యాలు మ్రోగాయి. వందిమాగధులు కర్ణుని మహారథిగా వర్ణించారు. అయితే అతడి వంశక్రమాన్ని మాత్రం వివరించలేదు.

ఆసనం దిగి మత్స్య యంత్రం వున్న చోటికి వచ్చాడు కర్ణుడు. ధనుస్సును చూచాడు. ఒక్కసారి ఆ ధనుస్సును చేతబట్టి నారిని అవలీలగా సంధించాడు. ధనుస్సును ఎక్కుబెట్టి బాణాన్ని సంధించాడు.

అంతవరకూ పరధ్యానంతో వచ్చే పోయేవారిని చూస్తున్న యాజ్ఞసేని ఒక్కసారిగా ఉలిక్కిపడింది. కర్ణుడిని చూచింది.

“నేను ఈ సూత్రపుత్రుని వరించను” అని పెద్దగా అన్నది.

ఆ మాటలు విన్న కర్ణుడు కోపంతో నవ్వుతూ సూర్యునివైపు చూచి చేతిలోని ధనుస్సును క్రిందకు వదలి వెనుదిరిగాడు.

కర్ణుని మనస్సు దెబ్బతిన్నది. తాను మత్స్యయంత్రాన్ని ఛేదించి ద్రౌపదిని గెలిచి తన మిత్రుడైన దుర్యోధనునికి ఆమెను కానుకగా ఇవ్వాలనే ఆశ అడుగంటింది.

అధర్మవర్తనులకు మిగిలేది అవమానం మాత్రమే. ఎప్పుడూ ధర్మమే విజయాన్ని వరిస్తుంది.

రాజులందరూ కర్ణుడికి జరిగిన అవమానాన్ని చూచి మనస్సులో బాధపడ్డారు. కానీ పైకి ఏమీ అనలేకపోయారు. అతడు క్షత్రియుడు కాకపోవడంతో వూరకున్నారు. సభాస్థలిని మరలా నిశ్శబ్దం ఆవహించింది. కర్ణుడిలాంటి మహారథి వెళ్లిన తరువాత అంత సమర్థుడు ఒక్క అర్జునుడే. అతడు లేడు. మరెవరు ఈ యంత్రాన్ని ఛేదించగలరు. ఇది అసాధ్యమైన పని అంటూ తలపోశారు రాజులు.


రాజులలో ఆశ నశించింది. నిరుత్సాహం కొట్టవచ్చినట్లు కనపడుతున్నది. ఇంతలో మద్ర దేశాధీశుడైన శల్యుడు లేచాడు. మెల్లగా నడిచి మత్స్యయంత్రం ఉన్నచోటికి వచ్చాడు. యధావిధిగా వాద్యాలు, భేరీ మృదంగాలు మ్రోగాయి. వందిమాగధులు శల్య మహారాజును పొగిడారు

- ఇంకా ఉంది

రచనలు పంపవలసిన చిరునామా: ఎడిటర్, ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 003

మాటాట : 1552

నిర్వహణ: సుధామ



ఆధారాలు

అడ్డం:

1. నెలాఖరు
3. అద్దె
5. ఆంగ్లంలో చేతిగడియారం
6. శుకము
8. చెట్టు
10. వస్త్రము
12. పిల్లఆవు
13. గుడ్లగూబ
14. మామిడి, చూచెదము

నిలువు:

1. నా భర్త అని గౌరవంగా స్త్రీ పేర్కొనే పదం
2. ఇక్కడి బౌద్ధ స్థూపం ప్రసిద్ధం
4. కడుపుతో ఉన్నది , నిండుచూలాలు
6. కొండసర్పము
7. నాగమాత
9. పాండవపత్ని
11. గుడ్డు
12. రాయబారి

మాటాట - 1551 సమాధానం

	1 మ	2 హా	త్మా	గాం	ధి	
3 మ		ని				4 వి
5 ర	6 మ				7 ఇ	ల్లు
	8 గా	డ్వే		9 కు	ష్ట	
10 పం	డు		11 మ		12 డు	13 చేం
తం			రు			చు
	14 ధ	న	వం	తు	లు	

రాశిఫలం



- గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

- **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)**
  మానసికాందోళనతో కాలం గడుస్తుంది. ఆరోగ్యం విషయంలో శ్రద్ధ వహించక తప్పదు. ప్రయత్న కార్యాలు ఆలస్యంగా సఫలమవుతాయి. అన్నింటా జాగ్రత్త అవసరం.
- **వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)**
  ఆర్థిక ఇబ్బందులుండవు.వస్తు, ఆభరణాలను ఖరీదు చేస్తారు. స్నేహితులను కలుస్తారు. ఇతరులకు మంచి సలహాలు, సూచనలిస్తారు. సంఘంలో గౌరవం పెరుగుతుంది.
- **మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)**
  కష్టాలన్నీ క్రమేణా తొలగిపోతాయి. నూతన కార్యాలకు శ్రీకారం చుడతారు. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా వుంటుంది. ఆభరణాలను ఖరీదు చేస్తారు.
- **కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్రేష)**
  ఋణప్రయత్నాలు సులభంగా ఫలిస్తాయి. కుటుంబంలో అనారోగ్య బాధలుండును. బంధు, మిత్రులతో వైరమేర్పడకుండా జాగ్రత్తపడుట మంచిది.
- **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)**
  బంధు, మిత్రులతో విరోధమేర్పడకుండా జాగ్రత్తపడుట మంచిది. ఆర్థిక ఇబ్బందులనెదుర్కొంటారు.అనారోగ్య బాధలుంటాయి. వృత్తి, ఉద్యోగ రంగంలో అభివృద్ధి ఉంటుంది.
- **కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)**
  పట్టుదలతో కొన్ని కార్యాలు పూర్తిచేసుకోగలుగుతారు. పిల్లలపట్ల జాగ్రత్తగా నుండుట మంచిది. వృత్తిరీత్యా గౌరవ, మర్యాదలు పొందుతారు.
- **తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)**
  కుటుంబంలో సుఖ సంతోషాలుంటాయి. ధనధాన్యాభివృద్ధి ఉంటుంది. విద్యార్థులు విజయాన్ని సాధిస్తారు. అనుకొన్న కార్యములు ఫలిస్తాయి. మార్పులు సంతృప్తినిస్తాయి.
- **వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)**
  ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా మారుతుంది. నూతన కార్యాలు ప్రారంభించరాదు. ప్రయాణాలెక్కువ చేస్తారు.మానసికాందోళనతో కాలం గడుస్తుంది.
- **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.,)**
  విదేశయాన ప్రయత్నాలు అనుకూలిస్తాయి. అనారోగ్య బాధలు అధికమవుతాయి. ఆకస్మిక ధననష్టమేర్పడే అవకాశముంటుంది.మానసికానందం కలుగుతుంది.
- **మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)**
  స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. ప్రయాణాల్లో వ్యయ, ప్రయాసలు తప్పవు. కలహాలకు దూరంగా ఉండుటకు ప్రయత్నించాలి. దైవ ప్రార్థన మనశ్శాంతినిస్తుంది.
- **కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)**
  కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా లభిస్తుంది. ఆకస్మిక ధనలాభంతో ఆనందాన్ని పొందుదురు.స్త్రీల మూలకంగా లాభం వుంది. పేరు ప్రతిష్ఠలు లభిస్తాయి. ఋణబాధలు తొలగును.యి. బంధు, మిత్రులతో కలుస్తారు
- **మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)**
  శుభవార్తలు వింటారు. ఆకస్మిక ధనలాభంలో ఆనందంగా వుంటారు. ప్రయత్న కార్యాలన్నింటిలో సఫలీకృతులవుతారు. కీర్తి ప్రతిష్ఠలు అధికమవుతాయి. విందులు వినోదాల్లో పాల్గొంటారు. ఇతరులకు సాయం చేస్తారు.

ధర్మభూమి


ఒరులేయవి యొనరించిన
నరవర యప్రియము తన మనంబునకగు దా
నొరులకు నవిసేయకునికి
పరాయణము పరమ ధర్మ పథములకెల్లన్

ఆంధ్రభూమి గురువారం, 1 ఫిబ్రవరి 2018



ఓమ్

అకార ఉకార మకారాల సమ్మేళనం ఓమ్ కారం. ఓమ్ ఉచ్చారణ తర్వాత వినిపించే శబ్దం అర్ధమాత్ర ఇది ఇందులోనే ఉంది. ఈ అర్ధమాత్రను ఏకాగ్రత ద్వారా వినవచ్చు. సృష్టికి మొట్టమొదట వినిపించిన శబ్దం 'ఓమ్' మాత్రమే. సృష్టికి ముందు తర్వాత ఉండేది శాశ్వతమైందీ ఈ ఏకాక్షర ఓమ్ కారమే. చతుర్ముఖ బ్రహ్మ ఈ ఓమ్‌కార జపం తోనే ఋగ్వేద, యజుర్వేద సామవేదాలను గ్రహించాడు. ఓమ్ కారం సర్వ శ్రేష్ఠం. సర్వోన్నతం. ఓం కారం పదేపదే జపించడం ద్వారా ప్రాణవాయువు శాతం పెరుగుతుంది. కార్బన్‌డై ఆక్సైడ్ శాతం తగ్గుతుంది. సంపూర్ణ ఆరోగ్యానికి మంచి మందు 'ఓమ్'కారం.



మనమేం చేస్తున్నాం...

వేదం మనకు పరమ ప్రమాణం...

మరి వేదం చెప్పినట్లు మనం నడుచుకుంటున్నామా?

సహనంతో నలుగురితో కలసి నడువమని, నలుగురితో ఐకమత్యంతో ఉండమని, నలుగురితో మాట్లాడమని, జీవించమని, ప్రయాణించమని ఋగ్వేదం చెబుతుంది.

మరి ఇలా ఉంటున్నామా మనం ఇది ఎవరికి వారు ఆలోచించుకోవాల్సింది. చీటికి మాటికి కోపం వస్తుంది. కోపం రావడం సహజమే. కాని అది తాటాకు మంటలాగా చప్పున ఆరిపోవాలి. కోపం వల్ల ఎదుటివారు కాని తనకు తాను కాని మాడిపోకూడదు. అపుడు మాత్రమే నలుగురితో కలసి మాట్లాడుతాం, నడుస్తాం.. ప్రయాణిస్తాం...

దోషం లేని కర్మ చేయమని యజుర్వేదం చెబుతోంది.

మరి దీన్ని ఆచరిస్తున్నామా మనం...

దోషం అంటే తప్పు చేయడం కాదు స్వార్థంతో ఆలోచించడమూ దోషమే. మనమేమి పనిచేసినా అది నలుగురికీ ఉపయోగపడేట్టుగా ఉండాలి. ఒకవేళ అలా వీలు కాకపోతే కనీసం మనం చేయబోయే పనివల్ల ఎవరికీ నష్టం రాకుండా ఉండాలి... అపుడే యజుర్వేదాన్ని మనం అనుసరిస్తున్నట్టు అవుతుంది.

కాలంతో పాటు కదిలే మనిషి లో మార్పులు సహజం. ఊసరవెల్లి, బల్లులు ప్రకృతి రంగులను బట్టి మారుతూ ఉంటాయి. అసలు మారుతూ ఉంటేనే మనిషి అనిపించుకుంటాడు. ప్రతినిమిషంలో ప్రకృతిలో జరిగే మార్పులకు అనుగుణంగా తన్ను తానుమార్చుకుంటూ సరికొత్త ఆలోచనలతో ముందుకు పోతూ ఉంటే ఆధునికత్వం ప్రతిచోట కనిపిస్తుంది. అపుడే -

ఓమ్ సహనావవతు
సహనౌభునక్తు
సహవీర్యం కరవావహై
తేజస్వినా వధీతస్తు
మావిద్విషావహై
ఓమ్ శాన్తిః

మమ్ము రక్షించుగాక.. మాకు పోషణము కలుగజేయుగాక.. మాకు విద్యావిషయమునందు సామర్థ్యము కలుగుకాక.. తేజస్సుగల మాకు బ్రహ్మ విద్య తెలియబడినదగుగాక.. మాలో పరస్పరము ద్వేషము లేకుండుగాక.


- యజుర్వేదం

సందేశం

ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపల నుండు లీనమై
యెవ్వని యందుడిందు బరమేశ్వరుడెవ్వడు మూల కారణం
బెవ్వడనాదిమధ్యలయుడెవ్వడు సర్వము దానయైన వా
డెవ్వడు వాని నాత్మభవు నీశ్వరునే శరణంబు వేడెదన్

ఈ లోకం ఎవని వల్ల పుడుతుందో, ఎవనితో కలసి ఉంటుందో ఎవని లోపల లయం పొందుతుందో ఎవడు పరమాత్ముతో ఎవడు ఈ విశ్వానికి మూలకారణమో ఎవడు పుట్టడం, గిట్టడం, పెరగడమూ లేకుండా ఉంటాడో ఎవడు అన్నీ తానేయై ఉంటాడో అటువంటి ప్రభువైన భగవంతుణ్ణి నేను శరణు కోరుతాను అన్న గజేంద్రుడిలాగే మనమూ భగవంతుని శరణు కోరాలి. అసలా భగవంతుని గురించి తెలుసుకోవాలంటే గురువు కావాలి. గురువులేని విద్య గుడ్డి విద్య అన్నారు కదా. గురువుఅనే కాగాడపట్టుకుని వెతికితే పెంజీకటికావల ఉన్న దివ్యమైన భవ్యమైన వెలుగు మనకు కనిపిస్తుంది. ఆ కాగాడానే రమణ మహర్షి...

''భగవత్ప్రేను ఎల్లలు లేనిది. పరిపూర్ణమైనది. కాగా, జ్ఞానేంద్రియాలుగా పేరు పెట్టుకున్న ఇంద్రియాలందించేది మాత్రమే జ్ఞానంకాదు. అది అందుకోలేనిది, అతీతమైనది, అంతర్బోధాత్మకమైన ఆత్మబోధే అసలైన జ్ఞానం'' కనుక రమణ మహర్షులు ఇలా చెప్పారు. మనిషి ఏ దేశం వాడైనా, ఏ మతంవాడైనా, ఆస్తికుడైనా, నాస్తికుడైనా వారికి 'నేను ' అనే భావన ఉంటుంది. నేను నేను అనడం అహంభావానికి మారుపేరు అంటారందరూ. కాని, అది అంత తప్పేమీ . కాని, నేను అనేది ఆ పేరు, ఊరూ శరీరానికి సంబంధించింది. దీనిని వదులుకొని అదే 'నేను'ను పట్టుకుని మూలందాకా వెళ్లండి. అసలు విషయం తెలుస్తుంది- రమణ మహర్షి. అలా అలా వెళ్ళగా 'నేను' పోయి 'తాను' దర్శనమిస్తుంది. ఆ 'తాను' అంతరాత్మ. అది తెలుసుకోవడానికి ఆత్మ విచారణ చేయాలి. శ్రీరమణుల ముఖ్యమైన ఉపదేశం ఇదే. ఇంద్రియాలకతీతమైనది ఒకటి ఉంది. అదికంటికి కనిపించదు. అది పట్టుకోవడానికి ఆత్మవిచారణమే సాధనం. ఆ సాధనతో దానిని సాధించవచ్చు. అపుడు గజేంద్రుని రక్షించిన పరమేశ్వరుడు మనకూ కనిపిస్తాడు. 'స్వయం తీర్ణః పరాన్ తారయతి'-అని పూర్వులు అన్నారు. తాను తరించిన వాడు ఇతరులను తరింపచేయగలడని అర్థం. కనుక భగవంతుడిని తను చూస్తే ఇతరులకూ చూపించగలరు.



నేగంటి నేగంటి శివుని నేగంటి



భగవంతుని ఉనికిని గూర్చి పదేపదే కొందరు సందేహపడుతుంటారు. భగవంతుని లేని వస్తువు లేనేలేదు. సర్వాంతర్యామి అయిన భగవంతుడు ఇక్కడ ఉన్నాడు అక్కడ లేడు అని చెప్పడానికి ఏదీ లేదు అని అచంచలమైన నమ్మకస్తులు అంటారు. నిజమే! నమ్మితే చాలు భగవంతుడు తన్నుతాను దత్తం చేసుకొంటాడు. భక్తుని కోసం భగవంతుడు దిగి వస్తాడు. కింకరుడుగా కావాలని కోరినా తాను కింకరునిగా మారిపోతాడు. చిన్న పిల్లవానివైతే నిన్ను నేను లాలిస్తాను అంటే పసిబిడ్డగా మారిపోతాడు.

రూపం అనేదే లేనివాడు కనుక భక్తులు కోరిన రూపాల్లోకి తన్ను తాను సృజియించుకుంటూ ఉంటాడు. భక్తులకు నచ్చిన రూపాల్లో నామాల్లో విహరిస్తూ వారికి ఆనందం

దినదినాభివృద్ధి చెందే యాగంటి బసవేశ్వరుడు

పంచుతుంటాడు. అందుకే భగవంతుడిని కృపాళువు అని కీర్తిస్తారు.

ఒకానొక కాలంలో కర్నూలు జిల్లాలో బనగానపల్లి గ్రామానికి సమీపంలో ఓ శివభక్తుడు శివదర్శనం కోరి కఠోరమైన తపస్సు చేసుకొంటున్నాడట. పంచాక్షరిని జపిస్తూ కన్నులు మూసుకొని ఉన్నాడు. అతనికి పులి గాండ్రింపు వినవచ్చి కనులు తెరిచాడట. అతని ఎదురుగా పెద్దపులి నిలిచింది. పులి రూపంలో స్వామి వచ్చాడనుకొన్న ఆ భక్తుడు 'నేగంటి నేగంటి శివుని నేగంటి' అని శివుని చూశానన్న ఆనందంతో చిందులు వేశాడట. ఆ నేగంటి అన్న పదమే ఈ ప్రదేశానికి యాగంటిగా కాలక్రమంలో స్థిరపడిపోయింది. ఈ క్షేత్రంలో శివుడు ఆ భక్తుని కోసం ఉమామహేశ్వరుడై పూజలందుకుంటున్నాడు. అయితే 15వ శతాబ్దంలో విజయ నగర రాజు హరిహర బుక్కరాయలు ఈ ఉమామహేశ్వరాలయాన్ని ఆధునాతనంగా తీర్చిదిద్దాడని చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి.


ఈ ఆలయానికి ముందు పుష్కరిణి ఉంది. ఈ పుష్కరిణి దాటుకుని ముందుకి వెళితే ఆలయ రాజగోపురం తేజో విరాజమానమవుతుంది. మెట్లమీదుగా ఈ రాజగోపురాన్ని దాటితే ప్రధానాలయ ప్రాంగణంవస్తుంది. ఇక్కడ రాతి శాసనాలు, ఎదురుగా ధ్వజస్థంభము కనిపిస్తుంది. ఈ మండపంలో శివలింగమొకటి ఉంది. గర్భాలయానికి ఎదురుగా నంది విగ్రహం ఉంది. ఈ ఆలయంలోని ఉమామహేశ్వరుని అగస్త్యుడు ప్రతిష్టించారని చెబు తారు. పానవట్టంపై ఉన్న లింగం మీద శివపార్వతుల మూర్తులున్నాయి. అగస్త్యుడు శివుని మెప్పించి పార్వతీ పరమేశ్వరులను ఇక్కడ కొలువుతీరి భక్తులను కాపాడమని వేడు కున్నాడట. మొట్ట మొదట అగస్త్య మహర్షి ఇక్కడికి వచ్చి ఈ పరిసరాలు చూసి చాలాబాగున్నాయి. ఈ క్షేత్రం కలియుగ వేంకటేశ్వరుని పూజించడానికి అనువుగా ఉన్నాయి. ఇక్కడ ఆస్వామిని ప్రతిష్టించాలనుకుని విగ్రహాన్ని మలుస్తూ ఉండగాచేతి బొటనవేలుకి గాయమైందట. తాను ఏదైనా తప్పుచేస్తున్నానేమోన్న భావానికి లోనైన అగస్త్యుడు వెంటనే వేంకటేశ్వరుని గూర్చి తపస్సులో మునిగిపోయాడట. కాని ఆయన ఏకాగ్రతను భంగం చేసేట్లుగా కాకుల రొద ఇక్కడ ఎక్కువగా ఉండేదట. అందుకే అగస్త్యుడు ఆ కాకులను ఈ యాగంటిక్షేత్రంలోకి రావద్దు అని అంక్ష పెట్టాడట. దాంతో ఇక్కడ ఏ కాకులు కనిపించవు. దీనికి గుర్తుగా వేంకటేశ్వరస్వామి గుహ ఇక్కడ ఉంది. దీనిని చేరుకోవడానికి సోపాన మార్గం ఉంది. ఈ గుహలో అగస్త్యమహర్షి శ్రీ వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని ప్రతిష్టించాడు. యాగంటిలో తొలుత ప్రతిష్టించాలనుకున్న విగ్రహమిదే. ఈ విగ్రహంలోని ఒక భాగం ఇప్పటికీ భిన్నమైనట్లు కనిపిస్తుంది. దీని పక్కగా శంకర గుహ ఉంది. దీనిని రోకళ్ళ గుహ అని కూడా అంటారు. పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఈ గుహలోనే తన శిష్యులకు జ్ఞానోపదేశం చేశాడని చెబుతారు.



ఈ గుహలో వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహం అచ్చెమ్మ విగ్రహాలు కనిపిస్తాయి.ఈ ఆలయ క్షేత్ర పాలకుడు వీరభద్ర స్వామి. ఈ వీర భద్రుడు శివుని అంశే. ఈ వీరభద్రుని దర్శనం సర్వ పాపహరం కీర్తిస్తారు. ఆలయ వెనకవైపు భాగంలో కేదారేశ్వరస్వామి మందిరం ఉంది. ఇక్కడే సుబ్రహ్మణ్యేశ్వరుడూ కొలువుదీరాడు.ఇక్కడి పుష్కరిణిని అగస్త్య పుష్కరిణి అంటారు. ప్రకృతి ఒడిలో పుట్టిన జలధార పర్వత సానువుల్లో ప్రవహించి ఆలయ ప్రాంగణంలోని కోనేరులో చేరుతుంది. ఏ కాలంలోనైనా పుష్కరిణిలోని నీరు ఒకే మట్టంలో వుండడమేఇక్కడి విశేషం. ఇందులోని నీటికి ఔషధ గుణాలున్నాయని, ఇందులో స్నానమాచరిస్తే సర్వరోగాలు నయమౌతాయని అంటారు.

యాగంటి శ్రీ ఉమామహేశ్వరాలయంలో ప్రధాన ఆకర్షణగా ఉన్నది ఒక బసవేశ్వరుడు. ఈ బసవన్న విగ్రహం దినదినాభివృద్ధి చెందుతూ అటు హేతువాదులకు ఆశ్చర్యాన్ని ఇటు భక్తులకు పరమసంతోషాన్ని కలుగచేస్తోంది. స్వయంభువుగా వెలసిన ఈ బసవన్న విగ్రహం లో జీవకళ ఉట్టిపడుతుంది. వీరబ్రహ్మేంద్రస్వామిగా రు ఈ బసవన్న గురించి కాల జ్ఞాన తత్వాల్లో విశేషాలు చెప్పారు. ఈ ఆలయానికి కుడివైపువున్న కొండమీద దాదాపు నూట యాభై అడుగుల ఎత్తున అనేక ప్రకృతి సిద్ధమైన గుహలు ఉన్నాయి

- ఎస్. నాగలక్ష్మి



ఇలా వెళ్లాలి...


కర్నూలుకు 100 కిలోమీటర్ల దూరంలో బనగానపల్లికి 13 కిలోమీటర్ల దూరంలో యాగంటి క్షేత్రం వుంది. కర్నూలు వరకు వచ్చి అక్కడ నుంచి బస్సులో యాగంటికి చేరుకోవచ్చు. అలాగే బనగానపల్లి వరకు వచ్చి అక్కడ నుంచి ఏదైనా వాహనంలో కూడా ఇక్కడికి చేరుకోవచ్చు.

హరోం హర..



హిందువుల ప్రత్యక్ష దైవం శ్రీ సుబ్రహ్మణ్య స్వామిని విశేషంగా పూజించే రోజు 'తైపూసం'. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం మలేసియా రాజధాని కౌలంపూర్‌కు సమీపంలోని బటు గుహల్లో కొలువైవున్న మురుగన్‌ను దర్శించుకునేందుకు భక్తులు అశేషంగా తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకునేందుకు 272 మెట్లు ఎక్కాల్సివుంటుంది. ఇక్కడి మార్గాలన్నీ భక్తజన సందోహంతో కిటకిటలాడాయి. సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని మురుగన్ పేరుతో తమిళులు పూజించుకునే విషయం తెలిసిందే.

బహుమతి



ప్రేమ స్వరూపుడు యేసు. ప్రేమను పంచటమే ఆయన తత్వం. పాపం చేయడం మనుష్యుల సహజ గుణం. పశ్చాత్తాపం చెందటం, పరివర్తన చెందటమూ మనుషులకు సహజమే. కాని పరివర్తన చెందటం అంత సులభం కాదు. యేసు పాపం చేసిన వారికి శిక్ష విధిస్తే పాపమనేది మరణించడం జరగదు. పాపం అనేది జీవించే ఉంటుంది. అసలు శిక్ష అనేది పాపానికే వేయాలి అంటారు. నీకు జన్మనిచ్చిన తల్లి దండ్రులను, నీ క్షేమంకోరే బంధువులను,నీ ఉన్నతిని కోరే స్నేహితులను, నీకు విద్యాబుద్ధులు చెప్పి జ్ఞానోపదేశం చేసే గురువులను నిర్లక్ష్యం చేయకు. వారిని ప్రేమతో చూడు. నీ తోటివారికి ప్రేమను పంచుము ఈ అమృతవాక్కులే యేసు చెప్పింది... నువ్వు నిన్ను ప్రేమించుకుంటున్నట్లే నీ పొరుగువాణ్ణి ప్రేమించు . ఈ అద్భుతమైన ఆనందకరమైన సందేశాన్ని యేసు ప్రతివారికీ ఇచ్చాడు. సన్మార్గులను, దుర్మార్గులను, పాపం చేసినవారిని, పుణ్యం చేసినవారిని ఒక్కలాగే చూడగలిగితే నిజమైన యేసు క్రీస్తు ప్రేమను పొందగలిగిన జీవివి అవుతావు. మరి నీకు యేసు ప్రేమ కావాలంటే ఇక నీవెలా జీవించాలో నీవే నిర్ణయించుకో... యేసు ఎవరినీ దేనికీ బలవంతం చేయడు. నీవు ఏమిచ్చినా యేసు మాత్రం ప్రేమనే పంచుతాడు... నీవు ప్రేమ, కరుణ, క్షమ కలిగినట్లయితే యేసు మార్గంలో ఉన్నట్లే ... యేసు ఒకసారి తన శిష్యులకు ఇలా చెప్పారు.. ఒకసారి ఓ గొర్రెల కాపరి వంద గొర్రెలను మేపుతుండగా ఒక చిన్న గొర్రె పిల్ల తప్పిపోయింది. ఆ చిన్న గొర్రె పిల్లకోసం అతడు తల్లడిల్లిపోయాడు. ఈ తొంభైతొమ్మిది గొర్రెలు ఒకచోట ఉంచి తాను తప్పిపోయిన గొర్రె కోసం వెదుకులాట ప్రారంభించాడు. గిరులు, తరులు, పొదలు, వాగులు, వంకలు ఇలా అన్ని చోట్ల గొర్రె కోసం గాలించాడు. చివరకు ఒకచోట అలసిపోయి పడుకొని వున్న తన గొర్రెపిల్లను చూశాడు. ఎంతో ఆనందంతో దాన్ని రెండు చేతులతో ఎత్తుకొన్నాడు. తన భుజాలపై ఎక్కించుకున్నాడు. ఆనందంతో తిరిగి తన గొర్రెల మంద దగ్గరకు వచ్చాడు. ఆ గొర్రెపిల్ల ఎలా తప్పిపోయింది తాను ఎలా కనుకొన్నది కథలు కథలుగా తన స్నేహితులకు చెప్పాడు.

అదేవిధంగా మీరు ఏవేవో ఊహలతో ఎక్కడెక్కడ తిరిగినా నేను మిమ్ములందరినీ ఒకదరికి చేరుస్తాను. నా ప్రేమతోనే మీరంతా నా చెంతకు వస్తారు. మీరంతా కూడా ప్రేమను పంచుతూ మన వాళ్లందరినీ ఒక దరికి చేర్చండి.. ఇది యేసు ఇచ్చిన సందేశం.. కనుక మనమందరమూ యేసు చూపిన దారిలో నడుద్దాం.. యేసు పంచుమన్న ప్రేమను పంచుదాం.

భగవంతుని అనుగ్రహమే..

ప్రతిరోజు భగవంతుడు గురించి, ఆయన లీలలు, మహిమలు, భగవత్త్వం గురించి, ఆధ్యాత్మికానికి సంబంధించి అనేక విషయాల్ని ప్రతిరోజు పాఠకులకు అందించాలనే ఆలోచన రావడం దైవ నిర్ణయం. దైవ ప్రసాదమే. ఏది జరిగినా ఇంకేం జరుగుతున్నా, ప్రతిదీ దైవ నిర్ణయం అని అనుకోవడం, అనుకోగల్గడం ప్రసాదాలన్నింటిలో మహాప్రసాదం.

'కర్మణ్యే వాధికారస్తే.. ' అని గీతాకారుడు గీతలో చెప్పాడు. పని, ప్రయత్నం మాత్రం నువ్వు చెయ్యి-దాని నుంచి వచ్చే ఫలితాన్ని ఆశించకు, ఆలోచించకు అని దానర్థం. ఫలితం ఏమొచ్చినా అది భగవత్ నిర్ణయమనుకున్నప్పుడు, అనుభవించగలిగినప్పుడు ప్రతిదీ 'ప్రసాదమే' అవుతుంది.

'ప్రసాదాలు' అన్నింటిలో ఏది ఉత్కృష్టమైన, మహోన్నతమైన ప్రసాదం అని ప్రశ్నించుకుందాం. ఇదే ప్రశ్నని ఓ మహనీయుణ్ణి ఓ సామాన్య వ్యక్తి అడుగుతాడు. 'విభూతి' ప్రసాదం అన్ని ప్రసాదాలలోను మహోన్నతమైనదని ఆ మహనీయుడు సమాధానం చెప్తాడు. ఎందుకు? ఎలా? అని మళ్లీ సందేహం వెలిబుచ్చేడు ఆ సాధారణ వ్యక్తి. సృష్టిలో ఏ పదార్థమైనా, ఎంత విలువైనది అయినా మరెంతో ఉపయోగకరమైనది అయినా క్షణికమైనదే. ఎప్పుడో ఒకప్పుడు నాశనమయ్యేదే. బూడిదయ్యేక దానికి మరో రూపం ఉండదు. మరో రూపంగా మారగలగటం అనేది ఉండదు. అది సత్యం. అచిరమైన, చలనమయ్యే అన్ని ఐశ్వర్యాలు మారే ఆఖరి స్థితి 'బూడిద'. అంటే 'విభూతి'. కాబట్టి 'విభూతి ప్రసాదం' జీవిత తత్త్వాన్ని బోధించే అందించే మహోన్నత ప్రసాదం అని జ్ఞానబోధ చేస్తాడా మహనీయుడు. ఎంతటి ఉన్నతమైన వివరణ! ఆధ్యాత్మికంగా జీవిత అర్థాన్ని పరమార్థాన్ని, పర అర్థాల్ని విడమరచి చెప్పే, ఎంతటి లోతున్న వివరణ అది! అద్భుతం!!

కొబ్బరి చెక్కో, బెల్లం ముక్కో, వడపప్పో, పానకమో, ప్రసాదం అని పిలవబడే వంకటమో ఏదైనా



కావచ్చు. ఆఖరికి వండి వార్చిన అన్నమైనా కావచ్చు. ఏదైనా దానిని భగవంతుడికి నివేదన చేస్తే, భగవత్ శేషమైన.. ఆ అన్నం కాస్తా అన్నప్రసాదమవుతుంది. ముందు చెప్పిన పదార్థాలన్నింటినీ, నైవేద్యంగా భగవంతునికి నివేదన చేసి అర్పణ చేస్తే, పరమ పవిత్రతని ఆపాదించుకుని, దైవ ప్రసాదాలుగా

ప్రసాదం

- రమాప్రసాద్ ఆదిభట్ల
9348006669

మారిపోతాయి. భగవంతుని అనుగ్రహానికి ప్రతీకలవుతాయి. భక్తులు మనసుల్ని, హృదయాల్ని, మనోభావాల్ని భగవంతుని దరి చేరుస్తాయి. ఆనందాల అమృత తత్వాన్ని అందిస్తాయి.

ఎంతటి పనిలో ఉన్నా 'ప్రసాదం' అనగానే ప్రతి ఒక్కరూ భక్తి పారవశ్యంతో పరవశించిపోతారు. పరవళ్ళు తొక్కుతారు. వెంటనే పాదరక్షలు వదలి, రెండు చేతులు శుభ్రం చేసుకుని భక్తితో రెండు చేతులు చాచి వినమ్రంగా ప్రసాదాన్ని అందుకుంటారు. కళ్లకద్దుకుని ఆరగిస్తారు ఎవరైనా! ఎంతటి గొప్పవారైనా! భగవద్దర్శనం చేసుకోవడానికి తాము ఆ పుణ్యక్షేత్రాలకి వెళ్లలేకపోయినా, ఆ ప్రసాదంలోనే ఆ భగవంతుడిని దర్శించుకున్నంతటి అనుభూతికి లోనవురు ప్రతి ఒక్కరూ.

ఇది మాటలకందని 'ప్రసాదం' మహత్మ్యం!!

సత్యనారాయణస్వామి వ్రతకథలో 'ప్రసాదం' విశిష్టతను వివరించే ఘట్టాలు రెండుంటాయి. మన స్ఫూర్తిగా భక్తిప్రపత్తులతో సత్యనారాయణ స్వామి వ్రతం జరుపుకున్న ఓ అమ్మాయి, వ్యాపారం కోసం విదేశాలకేగిన తన పెనిమిటి వస్తున్నాడన్న వార్త తెలియడంతో పెనిమిటి మీదుండే ప్రేమతో ప్రసాదం ఆరగించకుండా పరుగు పరుగున సముద్ర తీరానికి వెళ్తుంది. ఫలితంగా తన పెనిమిటి ప్రయాణం చేస్తున్న ఆ పడవ అకస్మాత్తుగా సముద్రంలో మునిగిపోతుంది. తల్లిద్వారా ప్రసాదం ఆరగించలేదన్న తన తప్పు తెలుసుకున్న ఆ అమ్మాయి, పశ్చాత్తాపంతో ఇంటికి పరిగెత్తి 'ప్రసాదం' కళ్ళకద్దుకుని ఆరగిస్తుంది. ఫలితంగా మునిగిన తన పెనిమిది పడవ సముద్రంమీదకొచ్చి కథ సుఖాంతమవుతుంది.

'ప్రసాదం' అనేది కుల మత భేదాలకు, స్థాయీ, స్థానం తేడాలకు, హోదాలు, అంతస్థులకి అతీతమైనదనే సందేశాన్ని, భగవత్ తత్వాన్ని విశదపరిచే మరో సంఘటన కూడా సత్యనారాయణ వ్రత కథలో మనకి దర్శనమిస్తుంది.

ఇదీ ప్రసాదం విశిష్టత!


భగవంతుడు గురించి, భక్తి గురించి, భక్తుడి గురించి వివిధ కోణాల్లో అనేక రూపాలలో మొత్తంగా ఆధ్యాత్మిక తత్త్వాన్ని, బోధల్ని, ప్రబోధాల్ని ఎందరెందరో మహిమాన్వితులు వేసిన అడుగుల్లో అడుగు వేస్తూ.. వారందించిన మహత్తరమైన మహా మార్గంలో పయనిస్తూ ఆ మహిమాన్విత రూపాలకు, స్వరూపాలకు మనసా వాచా కర్మణా ప్రణమిల్లుతూ..

చిత్రభూమి
ఆంధ్రభూమి గురువారం, 1 ఫిబ్రవరి 2018

ప్రేక్షకుల మైండ్‌సెట్ మారుతోంది

రవితేజ

మాస్ మహారాజాగా టాలీవుడ్‌లో తనదైన ప్రత్యేకతను చాటుకున్న రవితేజ ఓ వైపు కమర్షియల్ సినిమాలు చేస్తూనే మరోవైపు ప్రయోగాలకు సిద్ధమవుతున్నాడు. రవితేజ సినిమా అంటే సదరు ప్రేక్షకుడికి సందడిలా వుంటుంది. అందుకే ఆయనకు అభిమానులు కూడా ఎక్కువే. రవితేజ ప్రస్తుతం 'టచ్ చేసి చూడు' చిత్రంతో ముందుకు వస్తున్నాడు. విక్రమ్ సిరికొండ దర్శకత్వంలో లక్ష్మీనరసింహ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై తెరకెక్కిన ఈ చిత్రం ఈనెల 2న విడుదలవుతున్న సందర్భంగా రవితేజ చెప్పిన విశేషాలు...



టచ్ చేస్తే..

టచ్ చేస్తే షాక్ తగులుతుందా? అనేగా మీ డౌట్! అది తెలియాలంటే రేపటిదాకా ఆగాల్సిందే. ఈ చిత్రంలో నేను పోలీసుగా కనిపిస్తాను. ఇదివరకు కూడా పోలీసు పాత్రల్లో నటించాను. అయితే ఈ పాత్ర నాకే చాలా కొత్తగా అనిపించింది. చిన్న ఫన్‌తోపాటు ఎమోషన్ వుంటుంది. వ్యంగ్యం వుంటుంది. ఓ వైపు పర్సనల్ లైఫ్‌ను బ్యాలెన్స్ చేస్తూనే మరో వైపు డ్యూటీ మైండెడ్‌గా వుంటాడు. దర్శకుడు అద్భుతంగా డీల్ చేశాడు.

విక్రమ్‌తో..

దర్శకుడు విక్రమ్ కొత్తగా పరిచయమవుతున్నాడు. తను చాలా అనుభవం వున్న వ్యక్తి. వినాయక్ దగ్గర అసిస్టెంట్‌గా చేశాడు. మిరపకాయ్ సినిమా సమయం నుండీ నాకు పరిచయం. మంచి కమిట్‌మెంట్ వున్న వ్యక్తి. కథ చెప్పినదాని కన్నా అద్భుతంగా తీశాడు. ఈ కథ విషయంలో నాకు ఒక్క పాయింట్ అని కాదు కథ మొత్తం నచ్చింది.

హీరోయిన్లతో..

ఇందులో సీరత్‌కపూర్, రాశీఖన్నాలు నటించారు. ఇద్దరి పాత్రలు బావుంటాయి. సీరత్ అల్ట్రా మోడరన్‌గా ఉంటుంది. అలాగే రాశీఖన్నా పాత్ర కామెడీ వేలో ఎంటర్‌టైన్ చేస్తుంది.

మ్యూజిక్ ట్రెండ్

ఈ సినిమాకు ప్రీతమ్ జామ్ 8 అనే ఓ కంపెనీ పెట్టాడు. అందులో వాళ్ల టీమ్ చాలా మంచి మ్యూజిక్ ఇచ్చారు. అందులో నుంచి ఎంచుకున్న పాటలివి. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ మణిశర్మ ఇచ్చాడు. తను అందులో మాస్టర్.

కొత్తదనం కోసం

కొత్తదనం కోసం ఆలోచిస్తే సినిమాలు ఆడడం లేదు. నేను కొత్తగా చాలా సినిమాలు చేశా కానీ అవి ఏవీ కమర్షియల్‌గా వర్కవుట్ కాలేదు. ఆటోగ్రాఫ్ ఎంత మంచి సినిమా. అలాగే నేనింతే, ఈ అబ్బాయి చాలా మంచోడు లాంటి సినిమాలన్నీ నిరాశ మిగిల్చాయి. కాబట్టి కమర్షియల్ ఎంటర్‌టైన్‌మెంటే బెటర్.

ప్రయోగాలు..

ప్రయోగాలు చేయనని చెప్పడంలేదు. ఎందుకంటే ఇప్పుడు ప్రేక్షకుల మైండ్ సెట్ మారుతోంది. ఆటోగ్రాఫ్ సినిమా ఇప్పుడు వస్తే ఖచ్చితంగా హిట్ అవుతుందని నా ఫీలింగ్. మంచి కథలు వస్తే తప్పకుండా చేస్తా.

ఇతర భాషల్లో..

ప్రస్తుతం తెలుగు సినిమా మార్కెట్ పెరిగింది. ఈ విషయంలో రాజమౌళికి థాంక్స్‌చెప్పాలి. నాకు కూడా ఇతర భాషల్లో సినిమాలు చేయాలని వుంది. తప్పకుండా అలాంటి స్క్రిప్ట్ వస్తే చేస్తా.

దర్శకత్వం..

తప్పకుండా దర్శకత్వం చేసే ఆలోచన వుంది. దానికి ఇంకా టైమ్ పడుతుంది. ఆ సినిమాలో నేను హీరోగా చేయను.

తదుపరి చిత్రాలు

ప్రస్తుతం కళ్యాణ్‌కృష్ణ దర్శకత్వంలో నటిస్తున్నాను. దాంతోపాటు శ్రీను వైట్లతో ఓ చిత్రం ఉంటుంది.

-శ్రీనివాస్ ఆర్ రావ్

ఇంటిలిజెంట్‌గా మెప్పిస్తాడు

ప్రముఖ నిర్మాత సి.కల్యాణ్



సాయిధరమ్ తేజ్, లావణ్య త్రిపాఠి జంటగా ప్రముఖ దర్శకుడు వి.వి.వినాయక్ దర్శకత్వంలో సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సి.కల్యాణ్ నిర్మించిన 'ఇంటిలిజెంట్' చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తిచేసుకుని ఈనెల 9న సిద్ధమైన సందర్భంగా నిర్మాత సి.కల్యాణ్ చెప్పిన విశేషాలు...

ఇటీవలే విడుదలైన టీజర్, పాటలకు అనూహ్యమైన రెస్పాన్స్ వస్తోంది. ముఖ్యంగా బాలకృష్ణ, ప్రభాస్‌లు ఈ సినిమా టీజర్‌ను, పాటలను విడుదల చేయడం ఆనందంగా వుంది. వారికి నా ప్రత్యేక ధన్యవాదాలు. సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ ఏడాదిలో జై సింహాతో మంచి విజయాన్ని అందించారు. అదే ఉత్సాహంతో ఇంటిలిజెంట్‌గా వస్తున్నాం. ఖైదీ నెం 150 లాంటి భారీ విజయం తరువాత వినాయక్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ నెల 4న రాజమండ్రిలో భారీ ఎత్తున ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను జరుపుతున్నాం. వినాయక్ డబ్బులకోసం ఏదిపడితే అది చేయడు. మంచి కమిట్‌మెంట్ వుంటేనే సినిమా చేసే వ్యక్తి. ఇంటిలిజెంట్ సినిమాను అద్భుతంగా తీశాడు. ఇక సాయిధరమ్ తన మేనమామలా మంచి గుర్తింపు తెచ్చుకుంటున్నాడు. ఆయన కెరీర్‌లో గొప్పగా నిలిచిపోయే చిత్రం ఇది. ఇప్పటికే పరిశ్రమ నుంచి కూడా మంచి స్పందన వస్తోంది. తేజ్ ఈ చిత్రంలో నటనతోను, డాన్సులతోను అదరగొట్టాడు. ఫ్యాన్స్ బాగా ఎంజాయ్ చేసే చిత్రమిది. చమ్మక్ చమ్మక్ అనే వీడియో సాంగ్‌ను ఇళయరాజాగారు విడుదల చేస్తారు. ఈ సినిమా కోసం యూనిట్ అంతా చాలా కష్టపడింది. పాటలకే కాదు ఫైట్స్ కోసం కూడా సెట్స్ వేశాం. అన్నీ గొప్పగా వుంటాయి. ఈ సినిమాతోపాటు విడుదలవుతున్న చిత్రాలు కూడా మంచి విజయాలు అందుకోవాలని కోరుకుంటున్నాను. అసిస్టెంట్ డైరెక్టర్‌గా కెరీర్ మొదలుపెట్టిన నేను ఈ రోజు నిర్మాతగా ఈ స్థాయిలో వున్నానంటే కారణం- మా గురువు దాసరి గారు. ఇక ఈ సినిమా తరువాత రానాతో 1945 చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. సుభాష్ చంద్రబోస్ నేపథ్యంలో వుంటుంది. అలాగే కొత్త దర్శకుడితో భారతి అనే సినిమా చేస్తాను. అలాగే వినాయక్‌తో మరో సినిమా కూడా వుంటుంది అన్నారు.

మంచి టీమ్‌తోనే ఇలాంటి విజయాలు

అనుష్క

అనుష్క ప్రధాన పాత్రలో అశోక్ దర్శకత్వంలో యు.వి.క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్ నిర్మించిన 'భాగమతి' చిత్రం ఇటీవలే విడుదలై సంచలన విజయంతో దూసుకుపోతోంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ సక్సెస్ మీట్‌ను ఏర్పాటుచేశారు.

ఈ కార్యక్రమంలో దిల్‌రాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ- అరుంధతి, రుద్రమదేవి చిత్రాలకు అనుష్క ఎంత కష్టపడిందో దానికి రెట్టింపుగా భాగమతి చేసింది. నిజంగా హీరోలు చేసేంత రిస్క్ చేసిన అనుష్క కష్టానికి అందరూ హ్యాట్సాఫ్ చెప్పాల్సిందే. ఓ మంచి టీమ్ కుదిరినపుడే ఇలాంటి విజయాలు సాధ్యం అవుతాయి. యువి బ్యానర్ తన బ్రాండ్ వాల్యూని కాపాడుకుంటూ విజయవంతమైన చిత్రాలు నిర్మిస్తోంది అన్నారు. అనుష్క మాట్లాడుతూ- భాగమతి విడుదలైనప్పటినుంచే ఎక్కడ చూసినా పాజిటివ్ టాక్ వస్తోంది. ఈమధ్య లేడీ ఓరియెంటెడ్ చిత్రాలు చాలా చేస్తున్నావని అందరూ అంటున్నారు. నన్ను నమ్మి ఇలాంటి కథలు వస్తున్నాయి. ఖచ్చితంగా ఎఫర్ట్ పెట్టే టీమ్ దొరికినపుడే ఇలాంటి విజయాలు వస్తాయి. ఈ సినిమాకు పనిచేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు అన్నారు. దర్శకుడు అశోక్ మాట్లాడుతూ- ఇది సక్సెస్ మీట్ కాదు. సక్సెస్ జర్నీ. 2012లో మొదలైన ఈ జర్నీ అప్పుడు తీసుకున్న నిర్ణయం కరెక్టేనని ఈ రోజు ప్రూవ్ అయింది. నాతోపాటు పనిచేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. నిర్మాతలు నన్ను నమ్మి ఇంత రిస్క్ చేశారు. మాకు ప్రేక్షకులిచ్చిన విజయంగా భావిస్తున్నాను అన్నారు.



హీరోగా మెగా అల్లుడు



మెగాస్టార్ చిరంజీవి అల్లుడు కళ్యాణ్‌దేవ్ హీరోగా పరిచయం అవుతూ రాకేష్ శశి దర్శకత్వంలో వారాహి చలనచిత్ర నిర్మిస్తున్న చిత్రం బుధవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. మాళవిక నాయర్ హీరోయిన్. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న చిరంజీవి క్లాప్ కొట్టారు. ప్రముఖ దర్శకుడు రాజమౌళి గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ- చిరంజీవి అల్లుడు కళ్యాణ్‌దేవ్‌ను హీరోగా పరిచయం చేయడం ఆనందంగా వుంది. దర్శకుడు శశి అద్భుతమైన స్క్రిప్ట్‌ను సిద్ధం చేశాడు. ఎక్కడా రాజీపడకుండా భారీగా నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. సెంథిల్‌కుమార్ కెమెరామెన్‌గా పనిచేస్తున్నాడు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ మొదలుపెడతాం అన్నారు. ఈ చిత్రానికి ఫైట్స్: జాషువా, సంగీతం: యోగేష్, కెమెరా: సెంథిల్‌కుమార్, సమర్పణ: సాయి శివాని, నిర్మాణం: సాయి కొర్రపాటి, నిర్మాత:రజనీ కొర్రపాటి, దర్శకత్వం: రాకేష్ శశి.



'యు' కథే హీరో..

కొవెరా క్రియేషన్స్ బ్యానర్‌పై నూతన దర్శకుడు కొవెర దర్శకత్వం వహిస్తున్న 'యు' కథే హీరో..! చిత్రం మోషన్ పోస్టర్‌ను క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుకుమార్ మాట్లాడుతూ - 'ఈ సినిమా లైన్ వినగానే చాలా ఎగ్జయిటింగ్‌గా అనిపించింది. మోషన్ పోస్టర్‌ని కూడా కథానుగుణంగా చాలా వినూత్నంగా డిజైన్ చేశారు. ఈ సినిమా మంచి విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అన్నారు. దర్శకుడు కొవెరా మాట్లాడుతూ - ''యుచిత్రం మోషన్ పోస్టర్ సుకుమార్ గారి చేతులమీదుగా ఆవిష్కరించడం చలా ఆనందంగా ఉంది. నేను వి.విజయేంద్ర ప్రసాద్ గారి దగ్గర వర్క్ చేశాను. కొన్ని సినిమాలకి రచయితగా కూడా చేసి, మొదటి ప్రయత్నంగా 'యు'మూవీకి దర్శకత్వం వహిస్తున్నాను.

ఇకపై నా జోక్యం ఉంటుంది

యువ హీరో నాగశౌర్య

ఊహలు గుసగుసలాడే సినిమాతో అచ్చంగా మన పక్కింటి అబ్బాయిలా కనిపించి ఆకట్టుకున్నాడు యువ హీరో నాగశౌర్య. ఆ సినిమాతో హీరోగా గుర్తింపు తెచ్చుకున్న ఆయన, పలు చిత్రాల్లో నటించి తనకంటూ ఓ ఇమేజ్‌ని ఏర్పరచుకున్నాడు. తాజాగా 'ఛలో' అంటూ వస్తున్నాడు. వెంకీ కుడుముల దర్శకత్వంలో ఐరా క్రియేషన్స్ బ్యానర్‌పై ఉషా ముల్పూరి నిర్మిస్తున్న ఈ చిత్రం ఈనెల 2న విడుదలవుతోంది. రష్మిక మండన్న హీరోయిన్. ఈ సందర్భంగా నాగశౌర్యతో ఇంటర్వ్యూ..

★ సొంత బ్యానర్ ఎందుకు?

– ఈ సినిమాకోసం దర్శకుడు వెంకీ చెప్పిన కథ బాగా నచ్చడంతో సినిమా చేద్దామని అనుకున్నాం. అయితే మరో నిర్మాత ఈ సినిమా తీయడానికి రెడీ అయ్యాడు. కానీ బడ్జెట్ విషయంలో కుదరకపోవడంతో ఈ కథను విన్న మా అమ్మ, మనమే సినిమా తీద్దామని, ఐరా క్రియేషన్స్‌ను మొదలుపెట్టాం. ఐరా అంటే ఐరావతం, ఇంద్రుని వాహనం. నాకు ఏనుగులంటే చాలా ఇష్టం. ముఖ్యంగా వినాయకుడంటే భక్తి. అందుకే ఈ టైటిల్.

★ ఇంతకీ 'ఛలో' అంటే?

– ఎవ్వరైనా ఒక కథ అనుకున్న తరువాత దానికి వంద శాతం న్యాయం చేయలేరు. అటో ఇటో అవుతుంది. కానీ ఈ సినిమా విషయంలో మా కెమెరామెన్ సాయి శ్రీరామ్‌వల్ల అనుకున్నది పక్కాగా తీయగలిగాం. ఇక కథ గురించి చెప్పాలంటే ఒక ఊరు రెండు ఊర్లుగా విడిపోయింది. ఆ రెండు ఊర్లు చెరో రాష్ట్రంలో వుండడం, అక్కడ కట్టుబాట్లు, ఆచారాలు మారిపోవడం లాంటివి కథ. అక్కడికి చదువుకోవడానికి వెళ్లిన ఓ అబ్బాయి ఏం చేశాడన్నదే సినిమా.

★ కొత్త దర్శకుడితో పనిచేయడం?

– వెంకి నేను చేసిన జాదూగాడు సినిమా సమయం నుంచి పరిచయం. మంచి ఫ్రెండ్. తను నా కోసం ఓ సినిమా చేయడానికి సిద్ధంగా ఉన్నాడని తెలిసింది. అయితే మన ఫ్రెండ్‌షిప్‌ను అడ్డుపెట్టుకొని తను నన్ను సినిమా చేయమని అడగలేదు. దాంతో నేనే ఒక రోజు పిలిచి మనం సినిమా చేద్దామని చెప్పాను. తను ముందు క్రైమ్, కామెడీ కథ చెప్పాడు. అది కాదు మంచి కమర్షియల్ సినిమా చేద్దామని చెప్పడంతో ఛలో కథ రెడీ అయింది. దర్శకుడిగా వెంకి తప్పకుండా మంచి గుర్తింపు తెచ్చుకుంటాడు.

★ హీరోయిన్ గురించి?

– కథ ప్రకారంగానే హీరోయిన్‌గా రష్మికను ఎంపిక చేశాం. తను అద్భుతంగా నటించింది. చూస్తే కొత్త అనుభూతి కలుగుతుంది.

★ మీ పాత్ర గురించి?

– నేను రియల్ లైఫ్‌లో ఎలా ఉంటానో ఈ సినిమాలో అలాగే కన్పిస్తాను. కావాలనే వెంకి నా పాత్రను ఉన్నది ఉన్నట్టు చిత్రీకరించాడు. హీరోయిన్‌తో వున్న సన్నివేశాలు తప్ప మిగతావన్నీ నా రియల్ లైఫ్‌వే.

★ సినిమాల విషయంలో మీ ఇన్‌వాల్వ్‌మెంట్ ఎంత?

– గతంలో కథ విన్నప్పుడే ఏవైనా మార్పులు వుంటే చెప్పేవాణ్ణి. సెట్స్‌పైకి వచ్చాక అసలు ఏ విషయాన్ని పట్టించుకోను. దానివల్ల నా కెరీర్ పరంగా చాలా నష్టాలు వచ్చాయి. అందుకనే ఈ సినిమా విషయంలో ఎక్కువ ఇన్‌వాల్వ్ అయ్యాను. కథతోపాటు సన్నివేశాల చిత్రీకరణ లాంటి విషయాల్లో కూడా దర్శకుడితో చర్చించాను. ఇక ముందు కూడా నా సినిమాల విషయంలో ఇన్‌వాల్వ్ అవుతా.

★ మొదటిసారి నిర్మాతగా మారారు?

– నిర్మాణానికి సంబంధించిన విషయాలన్నీ నాకు తెలియవు.



అవన్నీ అమ్మా, నాన్నలే చూసుకున్నారు. వాళ్లు కూడా కొత్తే కాబట్టి మొదట్లో టెన్షన్ పడ్డారు. కానీ తరువాత అన్నీ సర్దుకున్నాయి. ప్రొడక్షన్ విషయంలో వాళ్ల రెస్పాన్స్ బాగుంది.

★ తదుపరి చిత్రాలు?

– ప్రస్తుతం కణం చిత్రం విడుదలకు సిద్ధంగా వుంది. అలాగే కెమెరామెన్ సాయి శ్రీరామ్‌తో ఓ సినిమా చేయబోతున్నాను. ఇది ఫిబ్రవరి నెలాఖరులో ప్రారంభం అవుతుంది. దాని తరువాత శ్రీనివాస్ అనే కొత్త దర్శకుడితో 'నర్తనశాల' మా బ్యానర్‌లో ఉంటుంది.

-శ్రీ

'ఎందుకో ఏమో' టీజర్



మహేశ్వర్ క్రియేషన్స్ పతాకంపై నందు, నోయల్, పునర్వి హీరో హీరోయిన్లుగా కోటి వద్దినేని దర్శకత్వంలో మాలతి వద్దినేని నిర్మిస్తున్న చిత్రం 'ఎందుకో ఏమో'. ఈ చిత్రం టీజర్‌ను దర్శకుడు వి.వి.వినాయక్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వినాయక్ మాట్లాడుతూ... 'ఎందుకో ఏమో' టైటిల్ లాగే టీజర్ కూడా చాలా ట్రెండీగా, ఆసక్తికరంగా ఉంది. ఈ సినిమా ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్న కోటికి మంచి పేరు, నిర్మాతకు లాభాలు రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ... ఇందులో నటించిన నటీనటులకు, సాంకేతిక నిపుణులకు నా శుభాకాంక్షలు అన్నారు. దర్శకుడు కోటి వద్దినేని మాట్లాడుతూ... 'ఎందుకో ఏమో' సినిమా ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్నా. ఎంతో బిజీ షెడ్యూల్‌లో కూడా మా చిత్రం టీజర్ ఆవిష్కరించిన దర్శకుడు వి.వి వినాయక్‌కు కృతజ్ఞతలు. నందు, నోయల్, పునర్వి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రం ముక్కోణప్రేమకథ. మా నిర్మాత ఎక్కడా రాజీపడకుండా పూర్తి స్వేచ్ఛనివ్వడంతో అనుకున్నట్టుగా సినిమా తీయగలిగాం. నిర్మాత మాలతి వద్దనేని మాట్లాడుతూ- ''మహేశ్వర్ క్రియేషన్స్ పతాకంపై ఇది మా తొలి సినిమా. వినాయక్ చేతుల మీదుగా మా చిత్రం టీజర్ విడుదల కావడం శుభసూచకంగా భావిస్తున్నాం. దర్శకుడు చెప్పిన కథ నచ్చడంతో ఏ విషయంలో రాజీపడకుండా సినిమాను నిర్మించాం. మంచి లవ్‌స్టోరీతోపాటు కమర్షియల్ హంగులు కూడా సినిమాలో ఉన్నాయి. ఇది అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చే సినిమా అవుతుంది. మా యూనిట్ అంతా పూర్తి సహకారం అందించడంతో సినిమాను అనుకున్న విధంగా పూర్తి చేయగలిగాం అన్నారు.

విషపురంలో ఏం జరిగింది?

లింకన్ మెథడ్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై షఫి, శ్రావణి, యాధవ్ ప్రధాన పాత్రల్లో శ్రీనివాస్ సందిరి దర్శకత్వంలో బోగారి లక్ష్మీనారాయణ, పాతూరి బుచ్చిరెడ్డి, బోగారి రాజు, మాధవరెడ్డి నిర్మిస్తున్న 'విషపురం' చిత్ర ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ ట్రైలర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ- జాంబి జానర్‌లో హాలీవుడ్‌లో ఎక్కువ సినిమాలు వచ్చాయి. మన దగ్గర ఆ జానర్‌లో సినిమాలు రాలేదు. ట్రైలర్ చూస్తుంటే ఆసక్తికరంగా వుంది. ఓ కొత్త ప్రయత్నమిది. తప్పకుండా సక్సెస్ అవ్వాలి అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ- షఫి కీలక పాత్రలో నటిస్తున్న ఈ సినిమా ఎక్కడా రాజీపడకుండా తీశాం. ప్రేక్షకులకు సరికొత్త ఫీలింగ్‌ను ఇచ్చే చిత్రమిది అన్నారు.





'చెన్నై చిన్నోడు' ఫస్ట్‌లుక్

జి.వి. ప్రకాష్ కుమార్, నిక్కీ గల్రానీ జంటగా నటించిన ఓ తమిళ చిత్రాన్ని తెలుగులో 'చెన్నై చిన్నోడు' (వీడి లవ్‌లో అన్నీ చిక్కులే..) అనేది ఉప శీర్షిక టైటిల్‌తో తెలుగులోకి అనువదిస్తున్నారు. శూలిని ప్రొడక్షన్స్ పతాకంపై వి.జయంత్ కుమార్ అందిస్తున్న ఈ చిత్రానికి యశ్వంత్ సాయికుమార్ సమర్పకుడు. ఎం. రాజేష్ దర్శకుడు. ఈ చిత్రానికి సంబంధించిన టీజర్ ఫస్ట్‌లుక్ పోస్టర్ ఆవిష్కరణ హైదరాబాద్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన నిర్మాత కె.వి సత్యనారాయణ టీజర్, ఫస్ట్‌లుక్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ - 'తమిళలో పెద్ద హిట్ అయిన సినిమా ఇది. తెలుగులో చక్కని క్యాచీ టైటిల్‌తో జయంత్ అనువదిస్తున్నాడు. నిర్మాతగా ఆయనకు ఇది తొలి సినిమా. నేను కూడా డబ్బింగ్ సినిమాలతోనే నిర్మాతగా పరిశ్రమకు పరిచయమై తర్వాత పెద్ద సినిమాలు నిర్మించాను. జయంత్ కూడా భవిష్యత్తులో మంచి సినిమాలు నిర్మించి పెద్ద నిర్మాతగా పేరు తెచ్చుకోవాలి. సినిమా చూడలేదు కానీ ప్రకాష్‌రాజ్ పాత్ర చాలా బాగుంటుందన్నారు. సినిమా కూడా బాగుంటుందని ఆశిస్తున్నా. ఈ చిత్రం విజయం సాధించి నిర్మాతకు మంచి లాభాలు తీసుకురావాలి' అన్నారు. నిర్మాత వి.జయంత్ కుమార్ మాట్లాడుతూ తమిళ సినిమా నచ్చడంతో ఇలాంటి మంచి సినిమాను తెలుగు ప్రేక్షకులకు అందించాలన్న ఉద్దేశంతో చేస్తున్న ప్రయత్నమిది. ఆద్యంతం కడుపుబ్బ నవ్వించే చక్కని కామెడీ ఎంటర్‌టైనర్ ఇది. ప్రకాష్‌రాజ్ పోషిస్తున్న పోలీస్ పాత్ర సినిమాకు హైలైట్‌గా నిలుస్తుంది అన్నారు. సహ నిర్మాత ఎన్. కృష్ణ, పాటల రచయిత సి.హెచ్ పూర్ణాచారి తదితరులు మాట్లాడారు.